RNI.No. APTEL/2014/57702 ESTD: 1999 www.voodayam.com




# వుదయం




గుంటూరు 14-09-2026 సోమవారం సంపుటి : 13 | సంచిక : 181 SINCE 27 YEARS CIRCULATED TELUGU DAILY రూ. 3.00 | పేజీలు : 12 VOODAYAM Telugu DAily

Simultaneously Published from Guntur, Hyderabad, Adilabad, Karimnagar, Khammam & Warangal Postal Regd. No. GTR/117/2025-27 Follow us on

## బలవంతుడిదే రాజ్యం అనే
# పోకడలకు స్వస్తి పలకాలి



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 13 (ఎంఎస్) :** న్యూఢిల్లీ వేదికగా ముగిసిన బ్రిక్స్ అధినేతల శిఖరాగ్ర సదస్సులో చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ కీలక ప్రసంగం చేశారు. నిబంధనలు లేని ప్రపంచం అనేది ట్రాఫిక్ దిశా నిర్దేశం లేని ఒక కూడలి లాంటిదని, అటువంటి వాతావరణంలో అనిశ్చితి, గందరగోళం తప్పవని ఆయన హెచ్చరించారు. బలవంతుడిదే రాజ్యం అనే పురాతన భావజాలాన్ని ప్రపంచ దేశాలు వీడాలని నొక్కి చెప్పారు. పరిమాణం, ఆర్థిక బలం లేదా శక్తిసామర్థ్యాలతో సంబంధం లేకుండా అంతర్జాతీయ వేదికపై అన్ని దేశాలు సమాన భాగస్వామ్యాన్ని కలిగి ఉండాలని ఆకాంక్షించారు.

సరఫరా వ్యవస్థల పరిరక్షణ ఐదు సూత్రాల ప్రతిపాదన

అంతర్జాతీయ వాణిజ్యాన్ని, సరుకు రవాణా మార్గాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని జిన్‌పింగ్ అభిప్రాయపడ్డారు. సమీకృత మార్కెట్లను ప్రోత్సహించేందుకు గ్లోబల్ సౌత్ దేశాలతో బ్రిక్స్ కూటమికి ఉన్న బలమైన సంబంధాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా వాణిజ్య రంగాన్ని విస్తరించడం, తయారీ రంగానికి ఊతం ఇవ్వడం, పెట్టుబడులను ప్రోత్సహించడం మరియు సాంకేతిక సహకారాన్ని పెంచుకోవడమే లక్ష్యంగా ఐదు సూత్రాల ప్రణాళికను సదస్సు ముందు ప్రతిపాదించారు.

ఐరాస పాత్ర సమర్థన అంతర్జాతీయ నియమాలుగ్లోబల్ సౌత్ దేశాల ఐక్యతలో ఒక నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టాలని సభ్య దేశాల అధినేతలను కోరారు. ప్రపంచ వ్యవహారాల్లో ఐక్యరాజ్యసమితి అధికారాన్ని, ప్రధాన పాత్రను అందరూ ఏకగ్రీవంగా సమర్థించాలని విజ్ఞప్తి చేశారు. అంతర్జాతీయ నియమాలను, చట్టాలను ఏ ఒక్క దేశమో కాకుండా ప్రపంచ దేశాలన్నీ కలిసికట్టుగా రూపొందించాలని, ఆ చట్టాలు మినహాయింపులు లేకుండా అందరికీ సమానంగా వర్తించేలా గ్లోబల్ సౌత్ దేశాలు కృషి చేయాలని స్పష్టం చేశారు.

## రోశయ్య చూపిన బాట, గాంధీజీ ఆదర్శాలు
# ఆర్యవైశ్యులకే గర్వకారణం



**హైదరాబాద్, సెప్టెంబర్ 13 (వుదయం) :** సమాజంలో సౌమ్యులుగా, మానవతావాదులుగా పేద ప్రజల నమ్మకానికి బ్రాండ్ అంబాసిడర్లుగా ఆర్యవైశ్యులు విశేష సేవలు అందిస్తున్నారని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి కొనియాడారు. పేద ఆర్యవైశ్య కుటుంబాల అభ్యున్నతికి, సంక్షేమానికి తమ ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన స్పష్టమైన భరోసా ఇచ్చారు.హైదరాబాద్‌లోని ఉప్పల్ భగాయత్ ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన సముదాయ నిర్మాణానికి ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ భూమిపూజ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, మాజీ మంత్రి టీజీ వెంకటేష్‌లతో పాటు పలువురు శాసనసభ్యులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు మరియు ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడారు. ఆయన ప్రసంగంలోని ముఖ్యమైన ముఖ్యాంశాలు:భవన నిర్మాణానికి పూర్తి సహకారం: ఆత్మగౌరవ భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి అవసరమైన అన్ని రకాల సాయాన్ని అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ భవనం కేవలం భౌతిక నిర్మాణంలా కాకుండా, పేద ఆర్యవైశ్య కుటుంబాల పిల్లల భవిష్యత్తుకు, విద్యాభివృద్ధికి సంపూర్ణంగా ఉపయోగపడేలా చూడాలని సంఘ ప్రతినిధులకు సూచించారు.మహనీయుల స్మరణ: సాధారణ ఆర్యవైశ్య లో జన్మించిన మహాత్మా గాంధీ దేశ సరిహద్దులు దాటి ప్రపంచస్థాయి నాయకుడిగా ఎదగడం సమస్త భారతీయులకు గర్వకారణమని పేర్కొన్నారు. ఆంధ్రరాష్ట్ర సాధన కోసం ప్రాణ త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు సేవలను, ఉమ్మడి రాష్ట్ర ఆర్థిక మంత్రిగా 16 వేల కోట్ల మిగులు బడ్జెట్‌ను అందించిన కొణిజేటి రోశయ్య సుదీర్ఘ అనుభవాన్ని సీఎం గుర్తుచేసుకున్నారు. శాసనమండలిలో రోశయ్య గారు తనకు అందించిన మార్గదర్శకత్వాన్ని, ప్రోత్సాహాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు.నమ్మకానికి నిలువుటద్దం: గ్రామాల్లో పేద ప్రజలకు సరుకులు అరువు ఇచ్చి ఆదుకునే విషయంలో ఆర్యవైశ్యులు ప్రదర్శించే మానవతా దృక్పథం ప్రశంసనీయమైనదని అన్నారు. ముందస్తు ఆలోచన, క్రమశిక్షణ, జాగ్రత్తగా వ్యవహరించడం ఆర్యవైశ్యుల జీవన విధానంలోనే భాగమని స్పష్టం చేశారు.సమైక్యతతోనే రాజకీయ ప్రాధాన్యత: ఆర్యవైశ్యులంతా ఐక్యంగా ఒక్కతాటిపై నడిచినప్పుడే తగినంత బలం చేకూరుతుందని, దాని ద్వారా రాజకీయాల్లో తమకు దక్కాల్సిన వాటాను సులువుగా సాధించుకోవచ్చని పిలుపునిచ్చారు. తమ ప్రభుత్వంలో ఇప్పటికే కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ఆర్యవైశ్యులకు తగిన ప్రాధాన్యం ఇచ్చామని గుర్తుచేశారు.మాట ఇస్తే తప్పకుండా నెరవేర్చే అలవాటు తనకు ఉందని, ఆర్యవైశ్యుల శ్రేయస్సు కోసం ప్రభుత్వం ఎల్లప్పుడూ సానుకూలంగా పని చేస్తుందని ముఖ్యమంత్రి తన ప్రసంగాన్ని ముగించారు.

# పదవులు వస్తాయి... పోతాయి...
## నిరంతరం ప్రజల్లోనే ఉంటాం: కొండా సురేఖ ధీమా



**వరంగల్, సెప్టెంబర్ 13 (వుదయం) :** తనను మంత్రివర్గం నుంచి తొలగించినందుకు ఎలాంటి బాధ లేదని, అయితే ఎటువంటి కారణం లేకుండా పదవి నుంచి తప్పించడమే కొంత వేదనకు గురిచేసిందని వరంగల్ తూర్పు శాసనసభ్యురాలు శ్రీమతి కొండా సురేఖ పేర్కొన్నారు. తమకు పదవులు ముఖ్యం కాదని, ప్రజల గుండెల్లో శాశ్వత స్థానం సంపాదించుకోవడమే ఏకైక లక్ష్యమని స్పష్టం చేశారు. మంత్రి పదవికి బర్తరఫ్ అయిన అనంతరం వరంగల్‌లో తొలిసారిగా కొండా సురేఖ, కొండా మురళి దంపతులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో కార్యకర్తలను ఉద్దేశించి కొండా సురేఖ మాట్లాడారు. ఆ ప్రసంగంలోని ముఖ్య అంశాలు: రాజకీయాల్లో విశ్వసనీయత: ప్రస్తుత కాలంలో అవకాశవాద రాజకీయాలు ఎక్కువయ్యాయని విమర్శించారు. ఒకప్పుడు రాజశేఖరరెడ్డి గారి పట్ల ఉన్న నమ్మకంతోనే తాను మంత్రి పదవిని సైతం త్యాగం చేసి రాజీనామా చేశానని గుర్తుచేశారు. గతం లో కొందరు కుట్రలు చేసి తమకు టికెట్ రాకుండా అడ్డుపడిన విషయాన్ని ప్రస్తావించారు.




# పండుగ రోజే విచారణకు రావాలంటూ నోటీసులు



హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ గేట్ నంబర్ 3 వద్ద ఈ నెల 7వ తేదీన చోటుచేసుకున్న సంఘటనలకు సంబంధించి నమోదైన కేసులో తీవ్ర పరిణామాలు చోటుచేసుకున్నాయి. భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి. రామారావు ముఖ్య అనుచరులైన ఆయన వ్యక్తిగత సహాయకుడు (పీఏ) మహేందర్‌రెడ్డి, ప్రచార అధికారి (పీఆర్వో) మహేష్‌లకు సైఫాబాద్ పోలీసులు తాజాగా నోటీసులు అందజేశారు. ఈ వ్యవహారంలో నమోదైన కేసు దర్యాప్తులో భాగంగా సోమవారం ఉదయం 10 గంటలకు సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో స్వయంగా విచారణకు హాజరుకావాలని, దర్యాప్తునకు పూర్తిస్థాయిలో సహకరించాలని ఆ నోటీసులలో స్పష్టంగా పేర్కొన్నారు.

**హైకోర్టు ఆదేశాల మేరకు తదుపరి చర్యలు**

అసెంబ్లీ వద్ద జరిగిన ఘటనల ఆధారంగా సైఫాబాద్ పోలీసులు కేసు నమోదు చేయడంతో, మహేందర్‌రెడ్డి, మహేశ్‌లు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. వీరి పిటిషన్‌పై సమగ్ర విచారణ జరిపిన రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం (హైకోర్టు) ఇద్దరికీ మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అదేవిధంగా తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు వారిపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశించింది. అయితే, కేసు దర్యాప్తునకు సంబంధించి పోలీసుల విచారణకు ప్రతివాదులు సంపూర్ణంగా సహకరించాలని న్యాయస్థానం స్పష్టం చేసింది.న్యాయస్థానం ఇచ్చిన ఈ ఆదేశాల ఆధారంగానే సైఫాబాద్ పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. కోర్టు సూచనల మేరకు విచారణ ప్రక్రియలో భాగంగా ఇద్దరికీ నోటీసులు జారీ చేశారు.కాగా, పండుగ రోజే విచారణకు హాజరుకావాలంటూ నోటీసులు ఇవ్వడం ప్రస్తుతం రాజకీయ వర్గాలలోనూ, స్థానిక ప్రజల్లోనూ తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# పర్యావరణ పరిరక్షణతోనే స్థిరమైన అభివృద్ధి

**లక్ష్యాల సాధనలో బహుళత్వమే బ్రిక్స్ బలం**
**సాంకేతికత, కీలక ఖనిజాలను ఆయుధాలుగా మలచవద్దు**
**ప్రపంచ పురోగతికి భాగస్వామ్య సాంకేతికతే ప్రాతిపదిక**
**బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో మోదీ**



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 13 (ఎంఎస్) :** న్యూఢిల్లీ వేదికగా జరుగుతున్న బ్రిక్స్ అధినేతల శిఖరాగ్ర సదస్సు రెండో రోజు ముగింపు సమావేశంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగించారు. సాంకేతిక పరిజ్ఞానం, అత్యంత కీలకమైన ఖనిజ వనరులను ఆయుధాలుగా మలచుకోవడం ప్రపంచ పురోగతికి తీవ్ర అవరోధంగా మారుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సాంకేతికత వినియోగం కేవలం కొందరికే పరిమితం కాకుండా, అందరికీ అందుబాటులో ఉండేలా సమగ్ర దృక్పథంతో ముందుకు సాగాలని ఆయన నొక్కి చెప్పారు. ప్రస్తుత ప్రపంచంలో సాంకేతికత, వ్యూహాత్మక ఖనిజాలు ఆర్థిక వ్యవస్థలకు, జాతీయ భద్రతకు అత్యంత కీలకమైన ఆస్తులుగా మారాయి. ఇలాంటి సమయంలో కొన్ని శక్తులు వీటి సరఫరాలను నియంత్రించడం వల్ల అభివృద్ధి చెందుతున్న దేశాలు కృత్రిమ మేధస్సు (ఏఐ), పరిశుభ్రమైన ఇంధనం వంటి ఆధునిక రంగాలలో వెనుకబడిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు.సరఫరా వ్యవస్థల బలోపేతం సభ్య దేశాల సహకారంసభ్య దేశాలన్నింటికీ ప్రయోజనం చేకూరేలా సరఫరా వ్యవస్థలను బలోపేతం చేయడం, చిన్న తరహా పరిశ్రమలను అంతర్జాతీయ విపణులతో అనుసంధానించడం, ఆవిష్కరణలను ప్రోత్సహించడం, మహమ్మారులను ఎదుర్కొనే ముందస్తు వ్యవస్థలను బలోపేతం చేయడం వంటి పలు కీలక చర్యలకు బ్రిక్స్ భాగస్వామ్య దేశాలు ఆమోదం తెలిపాయని ప్రధాని వెల్లడించారు. పర్యావరణ పరిరక్షణను విస్మరించకుండా అభివృద్ధిని సాధించవచ్చని, ఇందుకు భారత దేశపు పురాతన జీవన సంస్కృతియే గొప్ప నిదర్శనమని గుర్తుచేశారు. ఆరింటికి మించి 11 సభ్య దేశాలకు విస్తరించిన ఈ కూటమి కేవలం ప్రభుత్వాల నడుమ ఉండే అధికారిక వేదికగా మాత్రమే మిగిలిపోకూడదని, సామాన్య ప్రజల జీవితాల్లో ప్రత్యక్ష మార్పు తీసుకువచ్చే స్థాయికి ఎదుగాలని ఆకాంక్షించారు.వైవిధ్యంలోనే బ్రిక్స్ అసలైన శక్తి"మనోగతాలు, భౌగోళిక పరిస్థితులు వేరైనా సహకార భావనతో మనమందరం కలసి ఎదుగుతున్నాం" అని ప్రధాని అభివర్ణించారు. మన సంస్కృతులలోని వైవిధ్యమే కూటమికి గుర్తింపుగా నిలవాలని, సహకారమే ప్రేరణగా మారి సాధించే పురోగతి యావత్ మానవాళికి ఉపయోగపడాలని పిలుపునిచ్చారు.విపత్తులు, వ్యాధుల నివారణకు సమగ్ర వ్యవస్థలువ్యాధుల వ్యాప్తిని ముందే గుర్తించి హెచ్చరించే "అనుసంధానిత ముందస్తు హెచ్చరిక వ్యవస్థ" ఏర్పాటుకు, విపత్తు నిర్వహణ సమాచార మార్పిడి మార్గదర్శకాలకు సభ్య దేశాలు అంగీకారం తెలిపాయని ప్రధాని వివరించారు. దీనితో పాటు సరుకు రవాణా, షిప్పింగ్ సేవలు, స్థానిక ఉత్పత్తి వ్యవస్థలను బలోపేతం చేయడానికి "బ్రిక్స్ లాజిస్టిక్స్ సరఫరా వ్యవస్థ సహకార విధానం" ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు.


# మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దు

**హైదరాబాద్, సెప్టెంబర్ 13 (వుదయం) :** ఇందిరమ్మ టవర్స్ పరిధిలోని కనీస ఆదాయ వర్గాల (ఎల్.ఐ.జి) గృహాల లక్కీ డ్రాలో ఎంపికైన అభ్యర్థుల క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది. ఇప్పటివరకు 6,660 మంది అభ్యర్థుల అర్హతల పరిశీలన పూర్తయిందని తెలంగాణ గృహనిర్మాణ మండలి ఉపాధ్యక్షుడు, కమిషనర్ శ్రీ వి.పి. గౌతమ్ తెలిపారు. మిగిలిన అభ్యర్థుల పరిశీలనను కూడా ఈ వారంలోనే పూర్తి చేసి, నిబంధనలకు అనుగుణంగా అర్హత సాధించిన లబ్ధిదారులకు కేటాయింపు పత్రాలను (ఎలాట్‌మెంట్ లెటర్లు) అందజేస్తామని స్పష్టం చేశారు. లక్కీ డ్రాలో ఎంపికైన అభ్యర్థులు తమకు ఇల్లు దక్కుతుందో లేదోనని ఎటువంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని కమిషనర్ భరోసా ఇచ్చారు. అర్హతల నిర్ధారణ ప్రక్రియ అంతా అత్యంత పారదర్శకంగా, ప్రభుత్వ నిబంధనల ప్రకారమే జరుగుతోందని వివరించారు.

## భారతీయ రుచుల వైవిధ్యంలో
# మాంసాహారం లేదా?

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 13 (ఎంఎస్) :** దేశ రాజధానిలో నిర్వహించిన 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశానికి హాజరైన విదేశీ అధినేతలు, ప్రతినిధులకు ఏర్పాటు చేసిన రాత్రి విందులో కేవలం శాకాహార వంటకాలకే ప్రాధాన్యత ఇవ్వడంపై తీవ్ర రాజకీయ వివాదం చెలరేగింది. అంతర్జాతీయ వేదికపై భారతీయ భోజన వైవిధ్యాన్ని చాటిచెప్పామని చెప్తున్న ప్రభుత్వం, మాంసాహారాన్ని పూర్తిగా పక్కన పెట్టడంపై లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ వ్యవహారంపై సామాజిక మాధ్యమాల వేదికగా స్పందించిన రాహుల్ గాంధీ, ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యంగా విమర్శలు గుప్పించారు.విపక్ష నేత ధ్వజమెత్తు: దేశంలో దాదాపు 80 శాతానికి పైగా ప్రజలు మాంసాహార ప్రియులనే విషయాన్ని ప్రధాని విస్మరించారని రాహుల్ ఆరోపించారు. భారతీయ సంస్కృతిలో భాగమైన రుచికరమైన మాంసాహార వంటకాలను విదేశీ అతిథులకు పరిచయం చేయకుండా, కేవలం శాకాహారానికే పరిమితం చేయడం సరైంది కాదని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ నాయకుల మద్దతు: పార్టీ మీడియా ప్రతినిధి పవన్ ఖేరా ఈ అంశంలో రాహుల్ గాంధీకి మద్దతుగా నిలిచారు. ప్రపంచస్థాయిలో ఎంతో గుర్తింపు పొందిన భారతీయ మాంసాహార రుచులను విదేశీ నాయకులకు రుచి చూపించే అవకాశాన్ని ప్రభుత్వం కోల్పోయిందని విమర్శించారు.

## ఇంతే కదా...!












## పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి అరెస్ట్

**పరిగి సెప్టెంబర్ 14, (ఉదయం)**

వికారాబాద్ జిల్లా పరిగి పట్టణం లో భారీ పోలీసుల బందోబస్తు మధ్యలో కుల్కచర్ల పోలీస్ స్టేషన్ కి తరలింపు. కలాపూర్ భూ బాధితులను పరామర్శ కు వెళ్తున్న మహేష్ రెడ్డి ని అక్రమంగా అరెస్ట్ చేసిన పోలీసులు.ప్రజాసొమ్యం లో ప్రజల కోసం పోరాడే హక్కు, వారికి ధైర్యాన్ని ఇచ్చే స్వేచ్ఛ లేదా అని, పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసారు. కలాపూర్ రైతులు ప్రాణాలు కూడా లెక్క చేయకుండా, ధర్నా చేస్తున్నారు అని, వారి కోసం వెళ్తే ఎందుకు ఆపుతున్నారు అని పోలీసులను ప్రశ్నించిన పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి . మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డి వెంట బి ఆర్ ఎస్ నాయకులు కార్యకర్తలు రైతులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పల్లె యువజన సేవా సమితి ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ

**ఉదయం మనూరు సెప్టెంబర్:13**



సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం,మండలం మనురు,మండలం గ్రామంలో,దోసపల్లి గ్రామంలో,పల్లె యువజన సేవ సమితి, ఆధ్వర్యంలో ఆదివారం,మట్టి వినాయక విగ్రహాల, పంపిణీ చేశారు కాలుష్యాన్ని,అరికట్టాలని ఉద్దేశంతో,మట్టి వినాయక విగ్రహాలను,పంపిణీ చేస్తున్నామని,వారు తెలిపారు,ఈ "కార్యక్రమంలో దత్తాత్రేయ,సంతోష్. ప్రకాష్. ధనరాజ్.సంగిశెట్టి .శివరాజ్ పాటిల్.విజయ్ కుమార్. శ్రీనివాస్.తదితరులు పాల్గొన్నారు,

## ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఏర్పాటు



- **గ్రామ అధ్యక్షుడిగా పరిమళ చిన్న దేవయ్య మాదిగ**
- **మండల అధ్యక్షుడు కేతపాగ గోపాల్**

**చిన్నంబావి మండలం 13 (ఉదయం రిపోర్టర్ )**

పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాలను చిన్నంబావి మండల కేంద్రంలోని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు కేతపగా గోపాల్ మాదిగ ఆధ్వర్యంలో కాలూరు గ్రామంలో ఎమ్మార్పీఎస్ నూతన గ్రామ కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు సంధ్యపోగుల కుర్మయ్య హాజరై నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కాలూర్ గ్రామ అధ్యక్షులుగా పరిమళ చిన్న దేవయ్య మాదిగను, ఉపాధ్యక్షులుగా సంపంగి రవీందర్ మాదిగ, సంపంగి నాగరాజు, కార్యదర్శులు సంపంగి విష్ణు, సందెపోగుల నాగేష్, పరిమళ భాను ప్రకాష్, సందెపోగు నవీన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే చిన్నంబావి మండల కమిటీ సభ్యులు మెలకలపల్లి సాములయ్య, ఎమ్మార్పీఎస్ పెద్దమారూర్ గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి డి. నరేష్, సలహాదారుడు పగిడాల చిన్న కురుమయ్య పాల్గొన్నారు. ఈ నూతన కమిటీ గ్రామంలో ఎమ్మార్పీఎస్ కార్యక్రమాలను మరింత బలోపేతం చేస్తూ, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నాయకులు ఆకాంక్షించారు. నూతన కమిటీ సభ్యులకు ఎమ్మార్పీఎస్ మండల నాయకులు అభినందనలు తెలిపారు.

## పెద్ద చింతరేవుల్లో ఆధ్యాత్మిక జాతర!

- **పలిమార్ పీఠాధిపతుల 48వ చాతుర్మాస్య మహోత్సవానికి పోటెత్తిన భక్తజనం**
- **వేద ఘోషల నడుమ మూలరాములకు, శ్రీకృష్ణునికి విశేష పూజలు**
- **హోమాలు.. గోపూజలు.. ప్రవచనాలతో మార్మోగిన పుణ్యక్షేత్రం**

**ధరూర్ సెప్టెంబర్ 13 (ఉదయం బ్యూరో)**

చాతుర్మాస్య మహోత్సవ వైభవంతో పెద్ద చింతరేవుల భక్తిసాగరంగా మారాయి. ఉడిపి పలిమార్ పీఠాధిపతుల 48వ చాతుర్మాస్య మహోత్సవ దీక్షలు, విశేష పూజలతో జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలంలోని పెద్ద చింతరేవుల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. శ్రీ ఆంజనేయ అన్నదాన సత్రంలో జరుగుతున్న మహోత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు.చాతుర్మాస్య మహోత్సవంలో భాగంగా ఆదివారం 44వ రోజు ప్రత్యేక పూజలను ఉడిపి పలిమార్ పీఠాధిపతులు శ్రీ 1008 విద్యాదిశ తీర్థ శ్రీపాదులు స్వామివారు, శ్రీ 1008 విద్యారాజేశ్వర తీర్థ శ్రీపాదుల వారు సంయుక్తంగా నిర్వహించారు. ఉడిపి వేద అర్చక బృందం వేద మంత్రోచ్చారణల మధ్య మూలరాములకు, శ్రీకృష్ణునికి శాస్త్రోక్తంగా విశేష పూజలు నిర్వహించింది. అనంతరం శ్రీ ఆంజనేయ స్వామివారికి ప్రత్యేక అభిషేకం, పూజలు చేశారు. వేద ఘోషలతో మార్మోగిన ఆలయం పీఠాధిపతుల సమక్షంలో సాగిన పూజా కార్యక్రమాలతో ఆలయ ప్రాంగణం భక్తి పారవశ్యం లో మునిగిపోయింది. వేద మంత్రాల ఘోష, హోమాగ్ని జ్వాలలు, భక్తుల హరినామస్మరణలతో పరిసర ప్రాంతాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి.

భక్తులకు స్వామీజీలు భాగవతం, రామాయణంపై ఆధ్యాత్మిక ప్రవచనాలు నిర్వహించారు. ధర్మం, భక్తి, ఆధ్యాత్మికతపై వారు అందించిన సందేశాలను భక్తులు శ్రద్ధగా ఆలకించారు. హోమాలు...గోపూజలువివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తుల ఆధ్వర్యంలో పవమాన హోమం, నవగ్రహ హోమం, గోపూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం పీఠాధిపతులు భక్తులకు మంత్రాక్షతలు అందజేసి ఆశీర్వచనాలు ప్రసాదించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. వినాయక చవితికి విశేష పూజలుసోమవారం వినాయక చవితి సందర్భంగా పీఠాధిపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక వినాయక చవితి పూజలు నిర్వహించనున్నట్లు శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ ప్రధాన అర్చకులు ఆద్య చక్రవర్తి కేశవాచార్యులు తెలిపారు. ఈ నెల 25 వరకు చాతుర్మాస్య మహోత్సవ దీక్షలు, ప్రత్యేక పూజలు కొన సాగనున్నాయని వెల్లడించారు. భక్తుల తో కిక్కిరిసిన ప్రాంగణం చాతుర్మాస్య మహోత్సవాన్ని పురస్కరించుకుని పెద్ద చింతరేవులకు భక్తుల రాక పెరిగింది. పీఠాధిపతుల దర్శనం, ప్రత్యేక పూజలు, ప్రవచనాలు, హోమాలు, గోపూజల్లో పాల్గొనేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మహిళా భక్తులు సైతం విశేష సంఖ్యలో పాల్గొని స్వామివారి సేవల్లో భాగస్వాములయ్యారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఆద్య వామనాచారి, ఆద్య కిష్టాచారి, ఆద్య మద్వాచారి, భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## మురుగు కూపంలో సదాశివపేట టౌన్ తాగునీటి మెయిన్ వాల్వ్!

- **ఫైర్ స్టేషన్ ఎదురుగా జాతీయ రహదారి 65పై అధ్వాన పరిస్థితి**
- **చెత్తాచెదారం, వర్షపు నీరు ఉన్న గుంతలోనే పైప్‌లైన్లకు సప్లై.. రోగాల భయంలో పట్టణం**
- **ఓపెన్‌గా ఉండటంతో గుంతలో పడుతున్న బైకులు, జనాలు.. గతంలో పలు ప్రమాదాలు గమనార్హం**

**(సదాశివపేట ప్రతినిధి):**

సదాశివపేట పట్టణ ప్రజలకు రక్షిత మంచినీరు అందించాల్సిన అధికార యంత్రాంగం తీవ్ర బాధ్యతారాహిత్యంతో వ్యవహరిస్తోంది. జాతీయ రహదారి 65 (NH 65) పై ఉన్న ఫైర్ స్టేషన్ ఎదురుగా గల సదాశివపేట టౌన్ తాగునీటి సరఫరా మెయిన్ వాల్వ్ (Main Valve) ఛాంబర్ పూర్తిగా డ్రైనేజీ మురుగునీరు, కుళ్ళిపోయిన వ్యర్థాలతో నిండిపోయి కంపుకొడుతోంది.

**చెత్తాచెదారం, వర్షపు నీటిలోనే సప్లై.. ప్రజల ప్రాణాలతో చెలగాటం:**

అత్యంత దారుణమైన విషయమేమిటంటే.. కురిసిన వర్షపు నీరు, డ్రైనేజీ మురుగు, కుళ్ళిపోయిన చెత్తాచెదారంతో నిండి ఉన్న ఆ మురికి గుంతలోనే మెయిన్ వాల్వ్ తిప్పుతూ సిబ్బంది పట్టణ పైప్‌లైన్లకు నీటిని సరఫరా చేస్తున్నారు. పైపుల జాయింట్లు, వాల్వ్ లీకేజీల ద్వారా ఆ మురికి నీరు, వ్యర్థాలు నేరుగా తాగునీటి లైన్లలో కలిసిపోతున్నాయి. ఈ కలుషిత నీరే ఇళ్లకు సరఫరా అవుతుండటంతో పట్టణ ప్రజలు డయేరియా, కలరా, టైఫాయిడ్ వంటి ప్రాణాంతక వ్యాధుల బారిన పడే ప్రమాదం పొంచి ఉందని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**ఓపెన్‌గా ఉన్న గుంత – గతంలో పలువురు పడి ప్రమాదాలు:**

ఈ మెయిన్ వాల్వ్ గుంత ఎలాంటి రక్షణ మూతలు లేకుండా పూర్తిగా ఓపెన్‌గా ఉండటంతో నిత్యం పెను ప్రమాదాలు పొంచి ఉన్నాయి. జాతీయ రహదారి 65 కావడం వల్ల ఇక్కడ నిత్యం వాహనాలు, స్థానిక ప్రజల రద్దీ



విపరీతంగా ఉంటుంది. ఈ క్రమంలో రద్దీని తప్పించుకునే ప్రయత్నంలో పలు బైకులు, ఇక్కడ తిరిగే జనాలు ప్రమాదవశాత్తు ఈ మురుగు గుంతలో పడి గాయపడిన ఘటనలు గతంలో పలుసార్లు చోటుచేసుకోవడం గమనార్హం.వినాయక చవితి నిమజ్జనం ఈ రహదారి గుండానే:వినాయక చవితి పండుగను పురస్కరించుకుని చిన్న గణపతులు మొదలుకొని భారీ విగ్రహాల వరకు నిమజ్జన ఊరేగింపులు ప్రధానంగా ఇదే జాతీయ రహదారి 65 గుండా సాగుతాయి. వేలాది మంది భక్తులు, యువకులు శోభాయాత్రలో నడుచుకుంటూ వెళ్లే ప్రధాన దారి ఇది. నిమజ్జన రద్దీ సమయంలో ఏమాత్రం అదుపుతప్పినా భక్తులు, వాహనాలు ఈ తెరిచి ఉన్న మురుగు గుంతలో పడి పెద్ద ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంది. గతంలో జరిగిన ప్రమాదాల దృష్ట్యా ఉత్సవాల వేళ భక్తులు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

**అధికారులు తక్షణమే స్పందించాలి:**

నిత్యం ఉన్నతాధికారులు తిరిగే జాతీయ రహదారి 65పై ఇంత బహిరంగంగా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నా మున్సిపల్, వాటర్ వర్క్స్ అధికారులు పట్టించుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. వినాయక నిమజ్జన శోభాయాత్రలకు ఆటంకం కలగకుండా, ప్రజారోగ్యం దెబ్బతినకుండా ఉండాలంటే తక్షణమే మోటార్లు/పంపులు పెట్టి ఆ గుంతలోని వర్షపు, మురుగునీటిని తోడేయాలని డిమాండ్ చేస్తున్నారు. చెత్తను తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లడంతో పాటు, సదాశివపేట టౌన్ మెయిన్ వాల్వ్ ఛాంబర్‌పై పటిష్టమైన మూత (స్లాబ్) ఏర్పాటు చేసి సురక్షితమైన తాగునీరు అందించాలని స్థానికులు కోరుతున్నారు.

## ధాన్యం దాచుకునే దారి.. రైతుకు ఊరట!

- **ముల్కలపల్లిలో నిల్వ కేంద్రానికి శ్రీకారం**
- **అకాల వర్షా ల దెబ్బకు పంట నష్టం.. గోదాముల కొరతతో రైతుల అవస్థలు**
- **పంటను తక్కువ ధరకు అమ్ముకునే పరిస్థితికి తెరపడాలి: ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి**

**గద్వాల సెప్టెంబర్ 13 (ఉదయం బ్యూరో)**

పంట చేతికొచ్చింది.. కానీ దాచుకునే చోటు లేదు. అకాల వర్షం వస్తే ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం కళ్లముందే తడిసి పోవాల్సిందే. నిల్వ సదుపాయం లేక మార్కెట్‌లో సరైన ధర కోసం ఎదురుచూడ లేక.. వచ్చిన ధరకే పంటను అమ్ముకో వాల్సిన దుస్థితి. ఈ సమస్యకు పరిష్కారం చూపే దిశగా గద్వాల మండలం ముల్కల పల్లి గ్రామంలో ఆహార ధాన్యాల నిల్వ కేంద్రం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.ముల్కలపల్లి గ్రామంలో నిర్మించనున్న ఆహార ధాన్యాల నిల్వ కేంద్రానికి గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి, పూలగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు. పంట పండించడం ఒక ఎత్తు.. దాచుకోవడం మరో ఎత్తు!భూమిపూజ అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతు కష్టానికి తగ్గ ఫలితం దక్కాలంటే పంట పండించడం ఒక్కటే సరిపోదని, దానిని సురక్షితంగా నిల్వ చేసుకునే వసతులు కూడా ఉండాలని అన్నారు. ధాన్యాన్ని సురక్షితంగా నిల్వ చేసుకుని, మార్కెట్ పరిస్థితులను పరిశీలిం చిన అనంతరం విక్రయించుకునే వెసులుబాటు రైతులకు లభిస్తుందని తెలిపారు. పంటను వెంటనే అమ్మేయాలనే ఒత్తిడి తగ్గి, రైతుకు తన పంటపై మరింత నియంత్రణ వస్తుందని అన్నారు. ప్రతి గ్రామానికీ నిల్వ కేంద్రాల అవసరం రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రతి గ్రామంలో అవసరా నికి అనుగుణంగా గోదాములు, నిల్వ కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడంతో పాటు రైతుల ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో పంట నిల్వ సౌకర్యాల కల్పన కూడా కీలకమైన



ముందడుగు అని పేర్కొన్నారు. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర దక్కాలంటే.. పంటను నిల్వ చేసుకునే సదుపాయం కూడా అంతే కీలకం. ముల్కల పల్లి నిల్వ కేంద్రం ఆ దిశగా మరో అడుగు.పాల్గొన్నవారు ఈకార్య క్రమంలో ముల్కల పల్లి సర్పంచ్ బి. రాముడు, పీఏసీఎస్ చైర్మన్ తిమ్మారెడ్డి, సీనియర్ నాయకులు రమేష్‌నాయుడు, అగ్గి రాముడు, శ్రీధర్ తదితరులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సంగీత దర్శకుడు, నటుడు ,నిర్మాత ఆర్.పి. పట్నాయక్ ఎస్వీబీసీ ఛైర్మన్‌ను కలిశారు

- **భక్తి ప్రాజెక్టుల సహకారంపై చర్చ**

**తిరుపతి, సెప్టెంబర్ 13, 2026:**

ప్రముఖ తెలుగు గాయకుడు, సంగీత దర్శకుడు, నటుడు మరియు నిర్మాత ఆర్.పి. పట్నాయక్ నేడు తిరుపతిలోని ఎస్వీబీసీ కార్యాలయంలో శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్ (ఎస్వీబీసీ) ఛైర్మన్ బి. శ్రీధర్ వర్మను కలిసి, ఆయన ఇటీవలి నియామకానికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన హృద్యపూర్వక సమావేశంలో, ఆర్.పి. పట్నాయక్ ఎస్వీబీసీ ఛైర్మన్‌కు తన ఇటీవలి భక్తి సంగీత ప్రాజెక్టుల గురించి వివరించారు. ఇందులో "దేవ కరుణామృతం" ఆల్బమ్ (లక్ష్మీ నారాయణస్తోత్రం, దత్త పాదుకాస్తోత్రం మరియు దత్త చిన్మయా స్తోత్రంతో కూడినది), ఆధ్యాత్మిక "అప్ప అప్ప అయ్యప్ప" సింగిల్, మరియు శ్రీరాముడికి అంకితమైన "పిబరే రామ రసం" పాట ఉన్నాయి. అలాగే 18 అధ్యాయాలతో కూడిన తన "సంపూర్ణ భగవద్గీత తాత్పర్యం" ప్రాజెక్ట్ వివరాలను కూడా ఆయన పంచుకున్నారు.ఎస్వీబీసీ ఛైర్మన్ బి. శ్రీధర్ వర్మ ఆర్.పి. పట్నాయక్ చేపట్టిన భక్తి కార్యక్రమాలను అభినందించారు, ఆధ్యాత్మిక కంటెంట్ నాణ్యతపై ప్రశంసలు కురిపించారు.



ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ, తమ సమయాన్ని కేటాయించినందుకు ఆర్.పి. పట్నాయక్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్వీబీసీతో సహకరించడానికి ఆయన చూపుతున్న ఆసక్తిని ఛైర్మన్ అభినందించారు. భవిష్యత్తులో ఎస్వీబీసీ వేదికగా మరిన్ని భక్తి కార్యక్రమాలను నిర్వహించాలనే తన ఆకాంక్షను ఆర్.పి. పట్నాయక్ వ్యక్తం చేశారు. ఇరువురు భక్తి సంగీత సిరీస్‌లు మరియు ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఎస్వీబీసీ ద్వారా ప్రసారం చేయడానికి అవకాశాలను పరిశీలించారు.తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో నడుస్తున్న, భారతదేశపు మొట్టమొదటి ప్రభుత్వ రంగ భక్తి ఛానల్ ఎస్వీబీసీ, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న భక్తుల కోసం ప్రత్యక్ష ఆలయ కార్యక్రమాలు, పారాయణాలు మరియు ఆధ్యాత్మిక కార్యక్రమాలతో తన కంటెంట్‌ను విస్తరిస్తోంది.

## బ్రేక్‌డౌన్ కష్టాలకు బ్రేక్.. మనోహరన్న చొరవతో బషీరాబాద్‌కు కొత్త విద్యుత్ లైన్"

- **ప్రజల గోడు విన్నారు.. పరిష్కారం చూపిస్తున్నారు.. ఎమ్మెల్యే మనోహరన్న కృషికి ప్రశంసలు...**
- **బషీరాబాద్‌కు విద్యుత్ బ్రేక్‌డౌన్ కష్టాలకు త్వరలో తెర**
- **కాశీంపూర్–బషీరాబాద్ మధ్య కొత్త 33/11 కేవీ విద్యుత్ లైన్ పనులు తుది దశకు**

**తాండూర్ సెప్టెంబర్ 13 (ఉదయం ప్రతినిధి)**

తాండూరు నియోజకవర్గం బషీరాబాద్ మండలంలో ఏళ్ల తరబడి విద్యుత్ బ్రేక్‌డౌన్ సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న బషీరాబాద్ మండల ప్రజలకు త్వరలో ఊరట లభించనుంది. మండలంలో విద్యుత్ సరఫరాను



మెరుగుపరిచేందుకు చేపట్టిన నూతన 33/11 కేవీ విద్యుత్ లైన్ ఏర్పాటు పనులు తుది దశకు చేరుకున్నాయి. ఇప్పటివరకు తాండూర్ మెయిన్ సబ్‌స్టేషన్ నుంచి బషీరాబాద్‌కు విద్యుత్ సరఫరా కొనసాగుతోంది. అయితే పాత విద్యుత్ స్తంభాలు, వ్యవసాయ పొలాల మధ్య నుంచి విద్యుత్ లైన్లు వెళ్లడం, తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్నాయి. ప్రస్తుతం పనులు చివరి దశలో ఉండటంతో త్వరలోనే నూతన లైన్ ద్వారా విద్యుత్ సరఫరా అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.కొత్త విద్యుత్ లైన్ అందుబాటులోకి వస్తే బ్రేక్‌డౌన్‌ల కారణంగా ఏర్పడే విద్యుత్ అంతరాయాలు గణనీయంగా తగ్గడంతో పాటు, మండలంలో విద్యుత్ సరఫరా మరింత స్థిరంగా ఉండే అవకాశం ఉంది. దీంతో బషీరాబాద్ మండల ప్రజలు ఏళ్లుగా ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలకు పరిష్కారం లభించనుంది.మండల ప్రజల విద్యుత్ సమస్యను ఎమ్మెల్యే మనోహరన్న దృష్టికి తీసుకెళ్లగా, సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టడంతో నూతన విద్యుత్ లైన్ పనులు ముందుకు సాగుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. నూతన లైన్ పనులు పూర్తయితే బషీరాబాద్ మండల విద్యుత్ వ్యవస్థలో కీలక మార్పు చోటుచేసుకోనుంది.

విద్యుత్ సమస్యకు పరిష్కారం

**ఎమ్మెల్యేకు రైతుల *కృతజ్ఞతలు**

ఎన్నో ఏళ్లుగా విద్యుత్ సమస్యతో ఇబ్బందులు పడుతున్న రైతులకు ఎట్టకేలకు ఊరట లభించింది. విద్యుత్ సరఫరా సమస్యను ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడంతో విద్యుత్ సరఫరా మెరుగుపడింది.

రైతులు హర్షం వ్యక్తం చేశారు. పంటల సాగు సమయంలో విద్యుత్ అంతరాయాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామని, సమస్య పరిష్కారం కావడంతో తమకు ఎంతో ప్రయోజనం కలిగిందని రైతులు పేర్కొన్నారు. తమ సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చొరవ చూపిన ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డికి రైతులు కృతజ్ఞతలు తెలిపారు. రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ఎమ్మెల్యే చేస్తున్న కృషిని వారు అభినందించారు

## 17 సెప్టెంబర్ విమోచన దినాన్ని అధికారికంగా నిర్వహించాలి

- **బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రతంగ్ పాండు రెడ్డి**

**నారాయణపేట టౌన్ సెప్టెంబర్ 13(ఉదయం ప్రతినిధి)**

సెప్టెంబర్ 17 తెలంగాణ దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికా రికంగా నిర్వహించాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొత్తకాపు రతంగ్ పాండు రెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. భారతదేశానికి 15 ఆగస్టు 1947న స్వాతంత్ర్యం లభిస్తే, హైద రాబాద్ సంస్థానానికి 17 సెప్టెంబర్ 1948న విముక్తి లభించిందన్నారు. నిజాం నిరంకుశ పాలన, రజాకార్ల దౌర్జన్యాలను ఎదురించి తెలంగాణ ప్రజలు, రైతు లు, యువత, మహిళలు స్వేచ్ఛ కోసం అనేక త్యాగా లు చేశారని గుర్తు చేశారు. సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో అత్యంత కీలక మైన రోజని, హైద రాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైన ఈ చారిత్రక ఘట్టాన్ని తెలం గాణ విమోచన దినోత్సవం గా రాష్ట్ర ప్రభుత్వం అధి కారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 17 చరిత్రను ప్రతి గ్రామానికి, ప్రతి విద్యార్థికి చేరేలా కార్య క్రమాలు నిర్వహించాల్సిన



అవసరం ఉందన్నారు. తెలంగాణ విమోచన పోరా టంలో పాల్గొన్న వీరుల చరి త్రను పాఠ్యాంశాలు, ప్రజా కార్యక్రమాల ద్వారా భావిత రాలకు తెలియజేయాలని అన్నా రు.తెలంగాణ విమో చన పోరాటంలో అనేక మంది తమ ప్రాణాలను త్యాగం చేశారని అన్నారు. వారి త్యాగాల ఫలితంగానే నేడు ప్రజలు స్వేచ్ఛగా జీవి స్తున్నారని పేర్కొన్నారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు వారి పోరాట చరిత్రను భావితరాలకు అందించడం మనందరి బాధ్యత అన్నా రు. సెప్టెంబర్ 17ను తెలం గాణ విమోచన దినోత్సవం గా అధికారికంగా నిర్వహిం చాలని డిమాండ్ చేశారు.

## ఆర్యవైశ్య కుటుంబాల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుంది

- **సీఎం రేవంత్ రెడ్డి**
- **ఉప్పల్ భగాయత్ లో ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన సముదాయానికి శంకుస్థాపన**

**హైదరాబాద్, సెప్టెంబర్ 13 (ఉదయం బ్యూరో) :**

పేద ఆర్యవైశ్య కుటుంబాల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.ఆదివారం హైదరాబాద్ ఉప్పల్ భగాయత్ లో ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన సముదాయ నిర్మాణానికి సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు.

**ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ..**

పేద ఆర్యవైశ్య కుటుంబాల పిల్లలకు ఆత్మగౌరవ భవనం ఉపయోగపడేలా చూడాలని, భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని హామీ ఇచ్చారు.పేదల విశ్వాసానికి ఆర్యవైశ్యులు బ్రాండ్ అంబాసిడర్లని, ముందుచూపు, జాగ్రత్తగా వ్యవహరించడం ఆర్యవైశ్యుల డీఎన్ఏలోనే ఉందని అన్నారు.మహాత్మా గాంధీ ప్రపంచస్థాయి నాయకుడిగా ఎదగడం గర్వకారణమని, ప్రపంచంలోని అనేక దేశాల్లో గాంధీ విగ్రహాలు కనిపిస్తున్నాయని సీఎం పేర్కొన్నారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు త్యాగాన్ని, కొణిజేటి రోశయ్య సేవలను గుర్తుచేశారు.ఆర్యవైశ్యులు ఐక్యంగా ఒక్కతాటిపై నడిస్తేనే బలమని, ఐక్యతతో రాజకీయాల్లో తమ వాటాను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ఆర్యవైశ్యులకు ప్రాధాన్యత ఇచ్చామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, మాజీ మంత్రి టీజీ వెంకటేష్, పలువురు ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ల చైర్మన్లు, ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.





## పేద ప్రజలకు సేవ చేయడమే లక్ష్యం

**దుబ్బాక ప్రతినిధి, సెప్టెంబర్ 13, ఉదయం :**

గ్రామీణ పేద ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తామని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, గాడిపల్లి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రఘువర్ధన్ రెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణంలో ఆదివారం గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్, తానా సౌజన్యంతో గాడిపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులను నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరానికి దుబ్బాక పట్టణ ప్రజలతో పాటు వివిధ మండలాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. శిబిరానికి విశేష స్పందన లభించడం పట్ల రఘువర్ధన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో గాడిపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇప్పటికే పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నామని, రాబోయే రోజుల్లో పేద ప్రజలకు ఎలాంటి ఆర్థిక, అనారోగ్య ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే సేవ చేయడానికి ముందుంటానని ఆయన తెలిపారు. వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహించిన అనంతరం రోగులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, గాడిపల్లి ఫౌండేషన్ సభ్యులు, వైద్య సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

## మట్టి గణపతులతోనే పర్యావరణ పరిరక్షణ డాక్టర్ హేమ్‌రాజ్ సింగ్

**దుబ్బాక ప్రతినిధి, సెప్టెంబర్ 13, ఉదయం :**

మట్టి గణపతులను ఏర్పాటు చేసి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని డాక్టర్ హేమ్‌రాజ్ సింగ్ సూచించారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రిలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వినాయక చవితి పండుగ ప్రతి ఇంటిలో సుఖసంతోషాలు నింపాలే తప్ప విషాదం కాకూడదని అన్నారు. భారీ గణపతులను తరలించే సమయంలో తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని, ముఖ్యంగా విద్యుత్ వైర్ల వద్ద అప్రమత్తంగా ఉండాలని



సూచించారు. ఆనందోత్సవాల మధ్య వినాయక పండుగ ఉత్సవాలను జరుపుకోవాలని ఆయన కోరారు. ముందస్తుగా దుబ్బాక ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.

## ఆపదలో అండగా సర్పంచ్ అనిల్‌కుమార్

**కొండాపూర్ ఉదయం.**

మానవత్వానికి మరో నిదర్శనంగా మల్కాపూర్ గ్రామ సర్పంచ్ మామిడిపల్లి అనిల్‌కుమార్ నిలిచారు. గ్రామానికి చెందిన హబీబ్ కుమార్తె అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న సర్పంచ్ అనిల్‌కుమార్ స్పందించి, తన వంతుగా ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు.ఆపద సమయంలో కుటుంబానికి అండగా నిలిచి ఆర్థిక భరోసా కల్పించిన సర్పంచ్ అనిల్‌కుమార్‌కు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఆపదలో ఉన్న



వారికి అండగా నిలవడమే నిజమైన మానవత్వమని సర్పంచ్ పేర్కొన్నారు.

## భక్తులకు మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



- **జాతీయ బీసీ కార్యవర్గ సభ్యులు, తాండూరు నియోజకవర్గ కన్వీనర్ కందుకూరి రాజు కుమార్**

**తాండూరు సెప్టెంబర్ 13 ( ఉదయం ప్రతినిధి ) :**

పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహిస్తూ బీసీ సంఘం ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్నితాండూరు పట్టణంలోని సర్దార్ పటేల్ చౌక్, విశాల్ మార్ట్ వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జాతీయ బీసీ కార్యవర్గ సభ్యులు, తాండూరు నియోజకవర్గ కన్వీనర్ కందుకూరి రాజ్‌కుమార్ భక్తులకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. పర్యావరణానికి హాని కలిగించే రసాయన విగ్రహాలకు స్వస్తి పలికి, మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పర్యావరణహితంగా వినాయక చవితి వేడుకలను జరుపుకోవాలని కోరారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు, మట్టి వినాయకుల వినియోగాన్ని ప్రోత్సహించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు."మట్టి వినాయకుడిని పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందాం" అనే సందేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి భక్తుల నుంచి విశేష స్పందన లభించింది. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

## బాల్యమిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం

**దుబ్బాక,సెప్టెంబరు 13 ( ఉదయం ప్రతినిధి )**

బాల్యమిత్రుడి కుటుంబానికి అండగా నిలిచి తమ స్నేహబంధాన్ని చాటుకున్నారు ఎస్ఎస్‌సీ 1993-94 బ్యాచ్ బాల్యమిత్రులు. ఇటీవల మృతి చెందిన తమ మిత్రుడు తడక లచ్చయ్య కుటుంబానికి రూ.35 వేల ఆర్థిక సాయాన్ని అందించారు.లచ్చయ్య ఈ నెల 8న మృతి చెందడంతో బాల్యమిత్రులు తీవ్ర విషాదానికి గురయ్యారు. చిన్ననాటి నుంచి కలిసి పెరిగిన మిత్రుడి మృతిని జీర్ణించుకోలేకపోతున్నామని పేర్కొన్నారు. ఆయనతో కలిసి గడిపిన మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

ఈ విషాద సమయంలో లచ్చయ్య కుటుంబానికి తమ వంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో బాల్యమిత్రుల బృందం తరపున రూ.35 వేల ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. ఆపద సమయంలో స్పందించి సహకరించిన ప్రతి బాల్యమిత్రుడికి కృతజ్ఞతలు తెలిపారు.స్నేహం అంటే మాటల్లోనే కాకుండా ఆపదలో ఒకరికొకరు అండగా నిలవడమేనని పేర్కొన్నారు. లచ్చయ్య తమ మధ్య లేకపోయినా ఆయన జ్ఞాపకాలు ఎప్పటికీ హృదయాల్లో నిలిచిపోతాయని తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ ఘన నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో బాల్య మిత్రులు మోహన్, రాజేశం, నవీన్ కుమార్, బాలరాజ్, చంద్రశేఖర్, ఎల్లా గౌడ్, బాబయ్య, అష్రఫ్ పాల్గొన్నారు.



# వ్యవసాయ మార్కెట్ అభివృద్ధి పనులకు నిధుల మంజూరు

**ప్రజా నాయకులకు చిత్ర పటాలకు పాలాభిషేకం**

**కోరుట్ల సెప్టెంబర్ 12 (వుదయం ప్రతినిధి)**

కథలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధి కి పనులకు రాష్ట్ర ప్రభుత్వం 2.96 కోట్ల రూపాయల నిధులను విడుదల చేస్తున్నట్లు శుక్రవారం ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది ఈ సందర్భాన్ని పురస్కరించు కొని కథలాపూర్ మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర్ రావు ప్రభుత్వ విప్ వేములవాడ నియోజకవర్గ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ల చిత్రపటాలకు మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేపట్టారు ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ పుండ్ర నారాయణరెడ్డి వైస్ చైర్మన్ పులి శిరీష హరిప్రసాద్ మండల కాంగ్రెస్ నాయకులు మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మాట్లాడుతూ కథలాపూర్ మండల వ్యవసాయ మార్కెట్ కు పెద్ద మొత్తంలో ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కృషితో మంజూరైన నిధుల కేటాయింపులో భాగంగా గోదాం నిర్మాణానికి 2.26 కోట్ల రూపాయలు డ్రైన్ నిర్మాణానికి 55 లక్షల రూపాయలు టాయిలెట్ బ్లాక్ నిర్మాణానికి 14,50 లక్షల రూపాయలను అధికారులు కేటాయించారు

ఇట్టి నిధులతో మార్కెట్ యార్డులో మౌలిక వసతులు మెరుగుపరచ డంతో పాటుగా రైతులకు సౌకర్యవంతమైన వాతావరణం గోదాం నిర్మాణం ద్వారా వ్యవసాయ ఉత్పత్తుల నిల్వకు అదనపు సదుపాయం అందుబాటులోకి తీసుకురావ డంతో పాటు డ్రైనేజీ పారిశుద్ధ్య వసతులు పరిశుభ్రత మెరుగుపరచడనికి ఇట్టి ఈ నిధులను మంజూరు చేశారని మన నియోజకవర్గంలోనే కథలాపూర్ మండలానికి ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కృషితో అత్యధిక నిధులు రావడం సంతోషకరంగా ఉందని అటు దేవాలయాల నిర్మాణానికి ప్రతిష్టాత్మక సూరమ్మ చెరువు ప్రాజెక్టు నిర్మాణానికి అలాగే సిసి రోడ్లు డ్రైనేజీలు కథలాపూర్ మండల కేంద్రంలో 220 సబ్ స్టేషన్ కు సిరికొండలో నిర్మాణం అవుతున్నటువంటి సబ్ స్టేషన్ కు ఇలా చెప్పుకుంటూ పోతే మన కథలాపూర్ మండలానికి నిధుల వరద వెల్లువెత్తిన విషయాన్ని ప్రతి ఒక్కరు గమనించాలని అట్టి నిధులతో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని ప్రతిపక్షాలు ఓర్వలేక చేస్తున్నటు వంటి అబద్ధపు ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని ఈ నిధులు అలాంటి అబద్ధపు ప్రచారాలు చేసే వారికి చెంపపెట్టులా మారాయని ఈ సందర్భంగా వారు తెలియజేశారు నియోజకవర్గంలోని కథలాపూర్ మండలానికి ప్రాధాన్యతను ఇస్తున్నందుకు ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కి కథలాపూర్ మండల



పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు జగదీశ్వర్ రావు వాకిటి రాజారెడ్డి కారపు గంగాధర్ అల్లంకొండ విజయ్ ఆకుల శంకర్ ఎండి ఆఫీస్ రమేష్ నాయక్ కథలాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాయితి నాగరాజ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎండి అజీమ్ రాష్ట్ర పిసిసి కార్యవర్గ సభ్యులు తొట్ల అంజయ్య జగిత్యాల జిల్లా కార్యదర్శి ధనుంజయ రెడ్డి మండల యూత్ అధ్యక్షుడు అంబటి రాధాకృష్ణ కథలాపూర్ సర్పంచుల ఫోరం అధ్యక్షులు న్యావనంది శేఖర్ సర్పంచులు ముదం రవి రంజిత్ రాజ గంగారం ఉప సర్పంచ్ చెట్పల్లి ప్రసాద్ భూషణ్ రావు.పేట గ్రామ శాఖ అధ్యక్షులు తలారి మోహన్ సోమిడి ప్రభుదాస్ లతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 19న కోదాడలో మెగా జాబ్ మేళా



**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**సూర్యాపేట, సెప్టెంబర్ 13 (వుదయం ప్రతినిధి):**

ఈ నెల 19న కోదాడలోని సీఎస్ రెడ్డి పాఠశాలలో భారీ మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఆదివారం అధికారులతో వెబెక్స్ ద్వారా సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ... ఈ మేళా ద్వారా జిల్లాలోని నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలు కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. పదో తరగతి నుంచి ఇంటర్, డిగ్రీ, ఐటిఐ, పాలిటెక్నిక్, ఉన్నత చదువులు పూర్తి చేసిన ప్రతి ఒక్కరూ అర్హులే. దాదాపు 250కి పైగా ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయి.

## పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ



- **ఎన్జీ కళాశాల వద్ద మట్టి గణపతుల పంపిణీ**
- **కార్యక్రమంలో పాల్గొన్న టూటౌన్ సీఐ ఆదిరెడ్డి**

**నల్గొండ, సెప్టెంబర్ 13(వుదయం):**

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని, వినాయక చవితి పండగను పర్యావరణహితంగా జరుపుకోవాలని నల్గొండ టూటౌన్ సీఐ ఆదిరెడ్డి పిలుపునిచ్చారు. కస్తూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నల్గొండ పట్టణంలోని ఎన్జీ (నాగార్జున) ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద నిర్వహించిన మట్టి గణపతుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, ప్రజలకు మట్టి ప్రతిమలను అందజేశారు. ఈ సందర్భంగా సీఐ ఆదిరెడ్డి మాట్లాడుతూ... ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీఓపీ) విగ్రహాల వల్ల నీరు, రసాయన వర్ణాల వల్ల పర్యావరణం కలుషితమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రకృతిని కాపాడుకునేందుకు అందరూ మట్టి వినాయకులనే పూజించాలని సూచించారు. సమాజహితం కోసం కస్తూరి ఫౌండేషన్ ఉచితంగా మట్టి గణపతులను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో టూటౌన్ ఎస్సై సైదాబాబు, కస్తూరి ఫౌండేషన్ సభ్యులు సాగర్ల లింగయ్య, మహేష్, రామకృష్ణ, పిన్నింటి నరేందర్ రెడ్డి, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

## 1980ల రెట్రో ఫొటో ఎడిటింగ్ మోజులో పడుతున్నారా?

**తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో సంచలన హెచ్చరిక!**

**పెద్దపల్లి, సెప్టెంబర్ 13 (వుదయం ప్రతినిధి)**



సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతున్న 1980ల రెట్రో ఫోటో ఎడిటింగ్ పేరుతో సైబర్ నేరగాళ్లు సరికొత్త మోసాలకు తెరలేపారు. సాధారణ ఫొటోలను పాతకాలపు రెట్రో స్టైల్‌లోకి ఉచితంగా లేదా అపరిమితంగా మార్చి ఇస్తామంటూ సోషల్ మీడియా ప్రకటనలు, సందేశాల ద్వారా ప్రజలను ఆకర్షిస్తున్నారు. ఈ తరహా ఉచ్చులో పడి అనుమానాస్పద లింకులను క్లిక్ చేస్తే తీవ్ర ప్రమాదం తప్పదని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ సోషల్ మీడియా వినియోగదారులను అప్రమత్తం చేశారు.ఇలాంటి లింకుల ద్వారా మొబైల్ ఫోన్లలోకి ఏపీకే (APK) ఫైళ్లను పంపి, బాధితుల ఎస్ఎంఎస్‌లు, ఓటీపీలు, కాంటాక్టులు, బ్యాంకింగ్ వివరాలతో పాటు వ్యక్తిగత సమాచారాన్ని దొంగిలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ సున్నితమైన సమాచారం ద్వారా అనధికారిక ఆర్థిక లావాదేవీలు, గుర్తింపు దుర్వినియోగం వంటి నేరాలకు పాల్పడే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. ఎస్ఎంఎస్, వాట్సాప్ లేదా ఇతర మాధ్యమాల్లో వచ్చే తెలియని లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపెన్ చేయకూడదని స్పష్టం చేశారు. ఒకవేళ సైబర్ మోసానికి గురైతే తక్షణమే 1930 హెల్ప్‌లైన్, వాట్సాప్ నంబర్ 8712672222 లేదా cybercrime.gov.in పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు.

## ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న పలువురు ఉపాధ్యాయులు

**జన్నారం,సెప్టెంబర్ 13 (వుదయం విలేఖరి)**



జిల్లా పరిషత్ హైస్కూల్ కామన్పల్లి పాఠశాలలో పనిచేస్తున్న బాణావత్ ప్రకాష్ నాయక్, సోషల్ అసిస్టెంట్ కు జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు లభించింది. ఈ అవార్డును జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ప్రధానం చేశారు.2024-25 సంవత్సరంలో 23 మంది విద్యార్థులను, 2025-26లో 23 మందిని పాఠశాలలో నమోదు చేయించారు. విద్యార్థులకు ఆర్వో వాటర్ ను ఎస్ఎంసీ ద్వారా ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే సహకారంతో పాఠశాలకు ప్రహరీ ఏర్పాటు చేశారు. సోషల్ పరీక్షల్లో ప్రతి సంవత్సరం వంద శాతం విద్యార్థులు పాస్ కావడం, 2025-26లో 60శాతం మంది 9 పాయింట్ల గ్రేడ్ సాధించడం ద్వారా అయనకు ఈ అవార్డు లభించింది.అలాగే మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,నగర మేయర్ ధర్ని మధుకర్ నుండి కిష్టాపూర్ స్కూల్ అసిస్టెంట్లు కొట్టె రాజన్న,ఎదులపురం గోవర్ధన్ చారి లకు మెమెంటో తో పాటు ప్రశంసా పత్రం అందజేసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.వీరు కూడా వారు పనిచేస్తున్న పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఇప్పించడంతోపాటు పదవ తరగతి ఫలితాల్లో జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో ఉండడానికి ఎంతో కృషి చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

## పందుల స్వైర విహారంతో అడవి శ్రీరాంపూర్ ఉక్కిరిబిక్కిరి

- **నివాస ప్రాంతాల్లో గుంపులుగా సంచారం**
- **అంటువ్యాధుల భయంతో గ్రామస్తుల ఆందోళన**

**ముత్తారం,సెప్టెంబర్ 13(వుదయం ప్రతినిధి):**



ముత్తారం మండలంలోని అడవిశ్రీరాంపూర్ గ్రామంలో పందుల బెడద రోజురోజుకూ పెరిగిపోతుండటంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.గ్రామంలోని ప్రధాన వీధులు,నివాస ప్రాంతాలు,ఖాళీ స్థలాలు,మురుగు కాలువల పరిసరాల్లో పందులు గుంపులుగా సంచరిస్తూ ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.చెత్తకుప్పలను తవ్వి చెత్తను చెల్లాచెదురు చేయడం,మురుగు నీటి ప్రాంతాల్లో తిరగడం వల్ల గ్రామంలో అపరిశుభ్ర వాతావరణం నెలకొంటోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గ్రామంలో చిన్నారులు,మహిళలు,వృద్ధులు పందుల కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు.

**ప్రజలు బయటకు రావాలంటేనే భయపడాల్సిన పరిస్థితి**

ఉదయం,సాయంత్రం వేళల్లో ఇళ్ల ముందు,రహదారులపై పందులు సంచరిస్తుండటంతో ప్రజలు బయటకు రావాలంటేనే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు.కొన్నిచోట్ల పందులు పిల్లలను వెంబడించిన ఘటనలు కూడా చోటుచేసుకున్నాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు.వర్షాకాలం కావడంతో ఇప్పటికే గ్రామంలో దోమల బెడద పెరిగిందని,దీనికి తోడు పందుల సంచారం మరింత ప్రమాదకర పరిస్థితులను సృష్టిస్తోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.డెంగీ,మలేరియా,వైరల్ జ్వరాలు,చర్మవ్యాధులు వంటి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.గ్రామంలో పారిశుద్ధ్య పరిస్థితులు దెబ్బతింటున్నప్పటికీ సంబంధిత అధికారులు,గ్రామపంచాయతీ యంత్రాంగం సమస్యను పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

**అధికారులు కేవలం హామీలకే పరిమితమయ్యారని..**

పందుల సమస్యపై పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారులు కేవలం హామీలకే పరిమితమయ్యారని గ్రామస్తులు విమర్శిస్తున్నారు.ప్రజారోగ్యానికి ప్రత్యక్ష ముప్పుగా మారిన ఈ సమస్యపై వైద్య ఆరోగ్య శాఖ,పంచాయతీరాజ్ శాఖ,గ్రామపంచాయతీ అధికారులు వెంటనే ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.పందుల యజమానులపై చర్యలు తీసుకోవడంతో పాటు గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలను ముమ్మరం చేసి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజల ప్రాణాలతో ముడిపడిన ఈ సమస్యపై అధికారులు వెంటనే జోక్యం చేసుకుని చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో గ్రాండ్ పేరెంట్స్ డే



**జగిత్యాల సెప్టెంబర్ 13 (వుదయం ప్రతినిధి)**

తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్షులు హరి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు నిర్వహించారు ఆదివారం జిల్లా కేంద్రంలోని అసోసియేషన్ కౌన్సిలింగ్ కార్యాలయంలో ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పలువురు గ్రాండ్ పేరెంట్స్ ను సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ వారి సంఘ ప్రతినిధులు వారి మనుమలు మనుమరాళ్లు పట్టు శాలువాలు కానుకలతో సన్మానించారు ఆనంతరం సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ మాట్లాడుతూ గ్రాండ్ పేరెంట్స్ మమకారానికి మార్గదర్శకులన్నారు ఉమ్మడి కుటుంబాలు తగ్గిపోయిన ప్రస్తుత కాలంలో తాతయ్య తాతమ్మ నానమ్మ అమ్మమ్మల తో మనుమలు మనుమరాళ్ళ అనుబంధాలు క్రమంగా తగ్గుతున్నాయని పాత తరం సాంప్రదాయాలు నైతిక విలువలు సంస్కృతి పిల్లల సమక్షంలో చర్చించాలన్నారు అప్పటి గ్రాండ్ పేరెంట్స్ కాలపు నైతిక విలువలు అనుబంధాలు అర్థం చేసుకుంటే ఈ తరంలో తల్లిదండ్రుల నిరాధరణ కేసులు ఉండవన్నారు ఈ కార్యక్రమంలో టాస్క రాష్ట్ర ఉపాధ్యక్షులు పిసి హన్మంత్ రెడ్డి.జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం కోశాధికారి వెల్ముల ప్రకాష్ రావు ఉపాధ్యక్షులు బొల్లం విజయ్ ఎండి యాకుబ్ కే సత్యనారాయణ జగిత్యాల డివిజన్ అధ్యక్షులు రాజేశ్వర్ కోరుట్ల అధ్యక్షులు పబ్బా శివానందం ధర్మపురి నియోజకవర్గం అధ్యక్షులు కండ్ల గంగాధర్ కరుణ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



## సాగరం వెంకటస్వామిని పరామర్శించిన చల్మెడ

**వేములవాడ, సెప్టెంబర్ 13 (వుదయం ప్రతినిధి) :**

పట్టణ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సాగరం వెంకటస్వామి తల్లి సాగరం రామలక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహా రావు శనివారం వెంకటస్వామి కుటుంబాన్ని పరామర్శించారు, రామలక్ష్మి మృతికి సంతాపం వ్యక్తం చేసి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఆయన వెంట మాజీ సెస్ డైరెక్టర్ రామతీర్థపు రాజు, సీనియర్ నాయకులు వెంగళ శ్రీకాంత్ గౌడ్, మాజీ కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, సిరిగిరి చందు, నాయకులు గూడూరు మధు, సుంకపాక రాజు, మాడిశెట్టి కృపాల్, మంత సందీప్, ప్రేమ్‌చారి, నాగుల రాము గౌడ్, బొల్లం దేవరాజు, గోపు మధు తదితరులు ఉన్నారు.



## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు నేతకాని సంఘం సన్మానం

**జన్నారం,సెప్టెంబర్ 13 (వుదయం విలేఖరి)**

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులలో ప్రతిభ కనబరిచిన ఇద్దరు ప్రధానోపాధ్యాయులను జన్నారం మండలంలోని పోనకల్ గ్రామపంచాయతీ పరిధిలోని శ్రీలంక కాలనీ నేతకాని సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రోజున ఘనంగా సన్మానించారు. చిన్న గుడిపేట యూపీఎస్ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచి "బెస్ట్ ఎన్రోల్మెంట్" విభాగంలో అవార్డు పొందిన ప్రధానోపాధ్యాయులు ఇంధనపల్లి రాజలింగం, 10వ తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచినందుకు జిల్లా పరిషత్ పాఠశాల, చింతగూడ ప్రధానోపాధ్యాయులు కామెర శంకర్ లను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు.ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు కుకటికారి బుచ్చన్న, ప్రధాన కార్యదర్శి తుంగూరి గోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి వీరు అందిస్తున్న సేవలు ఆదర్శనీయమన్నారు.ఈ కార్యక్రమంలో కామెర రాజేశ్వర్, కామెర ప్రేమ్ సాగర్, రామటెంకి శ్రీనివాస్, దుర్గం రాకేష్, పెరుగు సుధాకర్, రత్నం తులసిపతి, జాడి రాజన్న, దుర్గం రాజలింగం తదితరులు పాల్గొన్నారు.



## క్షేత్ర బంధన్ ముక్తి దిన్ విజయవంతం చేయాలి

**మాజీ ఎంపీ సోయం బాపూరావు**

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 13 (వుదయం ప్రతినిధి):**

ఈనెల 20న మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా కిన్వాట్ పట్టణం గోకుంద సమీపంలోని ఎస్.కె. గార్డెన్‌లో నిర్వహించనున్న ఆదివాసీ క్షేత్ర బంధన్ ముక్తి దిన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎంపీ, రాజ్‌గోండ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు సోయం బాపూరావు పిలుపునిచ్చారు. ఆదిలాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో కార్యక్రమ పోస్టర్‌ను నిర్వాహకులతో కలిసి ఆవిష్కరించారు. ప్రతి ఆదివాసీ సభకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పందురంగ్, నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## జన్నారం పోలీస్ స్టేషన్ లో పీస్ కమిటీ సమావేశం



**జన్నారం, సెప్టెంబర్ 13 (వుదయం విలేఖరి)**

వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు జన్నారం పోలీస్ స్టేషన్ లో మండల పీస్ కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఎస్ఐ ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, విద్యుత్, అగ్నిప్రమాదాల నివారణ, డీజేలు, లౌడ్ స్పీకర్ల వినియోగం, ఊరేగింపులు, నిమజ్జన కార్యక్రమాల గురించి ప్రభుత్వ నిబంధనలు, పోలీస్ శాఖ సూచనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. మత సామరస్యాన్ని కాపాడుతూ, ఇతరులకు ఇబ్బంది కలగకుండా ఉత్సవాలు నిర్వహించాలని, వివాదాస్పద వ్యాఖ్యలు, రెచ్చగొట్టే చర్యలకు దూరంగా ఉండాలని తెలిపారు. మండపాల వద్ద అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు కనిపించినా, సమస్య తలెత్తినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.వినాయక ఉత్సవాలను ప్రజల సహకారంతో శాంతియుతంగా, సోదరభావంతో, అవాంఛనీయ సంఘటనలు లేకుండా విజయవంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ అన్ని విధాలుగా సహకరిస్తుందని తెలిపారు. "శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరిస్తూ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలి" అని పీస్ కమిటీ సభ్యులకు సూచించారు.

## ధర్మపురిలో శ్రీ పోచమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన

**మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి**

**ధర్మపురి,సెప్టెంబర్ 13(వు దయం ప్రతినిధి):**



పట్టణంలోని 1వ వార్డులో శ్రీ పోచమ్మ తల్లి ఆలయ పునర్ని ర్మాణం,అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక సహాయ సహకారాలతో చేపట్టిన ఈ అభివృద్ధి పనులను ధర్మపురి మున్సిపల్ చైర్మన్ వే ముల.నాగలక్ష్మి రాజేష్ ప్రారం భించారు.ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి పనులను నాణ్య తా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేసేలా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ధర్మపురి అభివృద్ధికి, ముఖ్యం గా మతపరమైన స్థలాల పునరుద్ధరణకు విశేషంగా సహక రిస్తున్న మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఇందా రపు రామన్న,వార్డు కౌన్సిలర్ అయ్యోరి వేణుగోపాల్, ఆలయ కమిటీ సభ్యులు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## 3 నుంచి 4 వేల మందికి ఉద్యోగావకాశాలు

**పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**

**కోదాడ, సెప్టెంబర్ 13(వుదయం)**



కోదాడలో సెప్టెంబర్ 19న నిర్వహించనున్న మెగా జాబ్ మేళా ద్వారా 3 వేల నుంచి 4 వేల మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యమని రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సుమారు 300 కంపెనీలు ఈ మేళాలో పాల్గొని వేలాది ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేయనున్నాయని చెప్పారు. కోదాడలో ఆదివారం జాబ్‌మేళా ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. సూర్యాపేట, నల్లగొండ, యాదాద్రి భువనగిరి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అభ్యర్థులు ముందుగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొని, బయోడేటా ఐదు ప్రతులతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు. సుమారు 27 వేల ఉద్యోగ ఖాళీలతో కంపెనీలు కోదాడకు వస్తున్నాయని, కనీసం 15 శాతం ఉద్యోగాలను భర్తీ చేయగలిగినా 3–4 వేల మందికి ఉపాధి లభిస్తుందని మంత్రి పేర్కొన్నారు. గ్రామీణ యువతను ప్రముఖ కంపెనీలతో నేరుగా అనుసంధానం చేయడమే జాబ్‌మేళా ఉద్దేశమన్నారు. హుజూర్‌నగర్‌లో గత ఏడాది నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు 40 వేల మందికిపైగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోగా, 20–21 వేల మంది ప్రత్యక్షంగా ఇంటర్వ్యూలకు హాజరయ్యారని, వారిలో 3–3.5 వేల మందికి ఉద్యోగావకాశాలు లభించాయని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. అదే అనుభవంతో కోదాడలో భారీ ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. రద్దీని నివారించేందుకు ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జాబ్‌మేళాకు తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హాజరుకానున్నట్లు మంత్రి తెలిపారు. ఎంపికైన వారికి నియామక పత్రాలు అందించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కోదాడ ఎమ్మెల్యే ఎన్. పద్మావతీరెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అర్హులైన యువత ఈ అవకాశాన్ని కోల్పోవద్దని కోరారు. జాబ్‌మేళా సమాచారం ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికీ చేరేలా ప్రజాప్రతినిధులు, యువజన సంఘాలు, సామాజిక కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 19న జరిగే కోదాడ మెగా జాబ్‌మేళా గ్రామీణ యువతకు తమ ప్రతిభను ప్రముఖ కంపెనీల ముందు ప్రదర్శించి ఉద్యోగాలు పొందేందుకు గొప్ప వేదికగా నిలుస్తుందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు.

# పేదల కంటి వెలుగుకు జనతా ట్రస్ట్ భరోసా

- **చెన్నరావుపేటలో 3వ ఉచిత కంటి వైద్య శిబిరం.. 677 మందికి పరీక్షలు**

**వరంగల్ జిల్లా**
**చెన్నరావుపేట**
**వుదయం ప్రతినిధి సెప్టెంబర్ 13**





పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా జనతా ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని ట్రస్ట్ చైర్మన్ డా. గోగుల రాణా ప్రతాప్ రెడ్డి అన్నారు. చెన్నరావుపేట మండల కేంద్రంలోని సిద్ధార్థ హైస్కూల్ ఆవరణలో శంకర కంటి ఆసుపత్రి, జనతా ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో 3వ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిద్ధార్థ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ చైర్మన్ కంది గోపాల్ రెడ్డి హాజరయ్యారు. శిబిరంలో మండలంలోని వివిధ గ్రామాల నుంచి 677 మంది హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో అవసరమైన 412 మందికి ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేశారు. తీవ్రమైన కంటి సమస్యలు, శుక్లాలు (క్యాటరాక్ట్) ఉన్న 65 మందిని ఉచిత కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వీరికి హైదరాబాద్‌లో జనతా ట్రస్ట్, శంకర్ ఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నిపుణులైన వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు, వైద్య సలహాలు అందించారు.


ఈ సందర్భంగా కంది గోపాల్ రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న డా. గోగుల రాణా ప్రతాప్ రెడ్డి, ఆయన మిత్ర బృందాన్ని అభినందించారు. యువత కూడా సేవా కార్యక్రమాల్లో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. డా. గోగుల రాణా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ ఆర్థిక స్తోమత లేక వైద్యం పొందలేని పేద, మధ్యతరగతి ప్రజలకు అండగా నిలవడమే జనతా ట్రస్ట్ ప్రధాన లక్ష్యమన్నారు. డబ్బుల కొరతతో ఏ ఒక్కరూ వైద్యానికి దూరం కాకూడదని, ప్రజలకు అవసరమైనంతకాలం సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రతి మండలంలో ఉచిత వైద్య, రక్తదాన, విద్యా సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. శిబిరాన్ని విజయవంతం చేసిన శంకర కంటి ఆసుపత్రి వైద్య బృందం, జనతా ట్రస్ట్ సభ్యులు, ప్రజలకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జనతా ట్రస్ట్ సభ్యులు, చెన్నరావుపేట మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు

**మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు**

**పర్వతగిరి ,**


**సెప్టెంబర్ 13 ( వుదయం ప్రతినిధి ):**



వినాయక చవితి పర్వదినం సందర్భంగా తెలంగాణ ప్రజలకు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నాలు తొలగించి, విజయాలను అందించే దైవంగా, వినాయకుణ్ణి హిందూ సమాజం కొలుచుకుంటుందని అన్నారు. దైవ పూజలను, ధార్మిక క్రతువులు విఘ్నేశ్వరుని పూజతో ప్రారంభించడం ద్వారా హిందూ సంప్రదాయాల్లో గణనాయకునికి తొలి ప్రాధాన్యతనిస్తామని ఎర్రబెల్లి దయాకర్ రావు తెలిపారు. వాడవాడలా మండపాలు ఏర్పాటు చేసుకుని తొమ్మిది రోజుల పాటు గణేశ్ నవరాత్రులు జరుపుకుంటూ, పిల్లలు పెద్దలు అత్యంత భక్తి శ్రద్ధలతో వినాయకునికి పూజలు నిర్వహిస్తారని తెలిపారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, వ్యవసాయం తిరిగి గాడినపడి, పాడి పంటలతో తెలంగాణ రైతు కుటుంబాలు సుఖ సంతోషాలతో వర్ధిల్లేలా దీవించాలని కోరుతూ, ఏకదంతున్ని ఎర్రబెల్లి దయాకర్ రావు ప్రార్థించారు.

ఉష
వుదయం సాహిత్యం

# ధైర్యంగా సాగుదాం బతికి సాధిద్దాం




మానసిక ఆరోగ్యానికి
మనోధైర్యమే మందు
ఆత్మవిశ్వాసమే లక్ష్యంగా
ఆత్మహత్యలు నివారిద్దాం
సమస్యలను ఓడిద్దాం

పోలికలు పోటీలు వద్దు
శాస్త్రీయ దృక్పథం ముద్దు
ఆందోళన వద్దు
అరమరికలు వద్దు
అభివృద్ధే ధ్యేయంగా

ముందడుగు వేద్దాం

కష్టం నష్టం ఆవేదన
ఆక్రోశం అనిచ్ఛితి
అభద్రతఒత్తిడితో
విలువైన జీవితాన్ని
చాలించవద్దు
బతికి సాధించాలి
జీవితంలోని ఆనందాన్ని
ఆస్వాదించాలి

సమస్యలకు చలించవద్దు
ఆర్థిక సమస్య కుటుంబ
సమస్య భార్యభర్తల గొడవ

పరీక్షల్లో ర్యాంకు తేలేదని
తల్లి తండ్రుల మందలింపు

సెల్ ఫోన్ కొనివ్వలేదనే
క్షణికావేశంలో మృత్యు
ఒడిని చేరి తనువును
చాలిస్తున్నారు

కన్న వారికి అప్పులకు
శోకాన్ని కలిగిస్తున్నారు
ఆశతో బతుకుదాం
ఆపన్నులను ఆదుకుందాం

ఒత్తిడిని ఓడిద్ధాం
ఓర్పును గెలిపిద్దాం
సహనమే ఆయుధంగా

మార్పును కోరుదాం

మనసువిప్పి మాట్లాడుదాం
డిప్రెషన్ ఉన్న వారి పట్ల
సానుభూతిని భద్రతను
చూపుదాం వారికి చేయూత
నిద్ధాం బరోసానిద్ధాం
బాసటగా నిలుద్దాం

యువతలో ఉషారుతనం
సంతోషకర వాతావరణం
నెలకొల్పుదాం నైపుణ్యాలతో
ఆత్మనిర్భరతను పెంచుదాం

యువత ప్రతిభను సమాజ
ప్రగతి కొరకు వాడుదాం
మనసు విప్పి మనో భావాలను
పంచుకునే వాతావరణాన్ని
సృష్టించాలి ఉమ్మడి కుటుంబ
వ్యవస్థ పునర్జీవనానికి
అనువైన సామాజిక స్థితికి
పునాదులు వేద్దాం

ప్రేమ ఆప్యాయత అనురాగం
అభిమానాలు ఆత్మీయత ఆర్థత
సహనంసహకారం సంఘీభావం
సమన్వయత బంధాలు

అనుబంధాలను
పరివ్యాప్తి చేయాలి
పటిష్ఠ వంతమైన
పునాదులెయ్యాలి
విద్యలో మానవీయ
విలువలను పాఠ్యాంశంగా
చేర్చాలి సామాజిక శాస్త్రాలు
చరిత్ర అధ్యయనాన్ని
ప్రోత్సహించాలి సామాజిక
స్పృహను పెంచాలి

ఒంటరి జీవితం వద్దు
సోషల్ లైఫ్ ముద్దుఅనే

వాతావరణాన్ని సృష్టించాలి
విద్యార్థుల్లో ర్యాంకులు వద్దు
సంస్కారం సహనం సంయమనం
సంఘీభావం సౌహార్థతే
సహకారమే హద్దు కావాలి

మనోసంకల్పమే ఆయుధమైతె
ప్రగతి పురోగతి వికసించి
నూతన క్రాంతి తేజస్సుతో
నవ సమాజం అవతరిస్తుంది
మూర్ఖత్వాన్ని వదులుదాం

మానవత్వాన్ని చాటుదాం
మమత సమత స్థాపనలో
మార్గదర్శిగా నిలుద్దాం
సమస్యలను ఓడిద్దాం
ఓపికతో ఒత్తిడిని జయిద్దాం



నేదునూరి కనకయ్య
9440245771

# అక్షరం ఉన్నంతకాలం మనిషితనం ఉంటుంది

**మనసును తాకే మాట..
సమాజాన్ని మేల్కొలిపే ఆలోచన..
కాలాన్ని దాటి నిలిచే జ్ఞాపకం
— అదే సాహిత్యం**




మనిషి పుట్టినప్పటి నుంచి అతని వెంట నడుస్తున్నది కథే. తల్లి ఒడిలో విన్న తొలి జోలపాట నుంచి జీవితపు చివరి మజిలీలో మిగిలే జ్ఞాపకాల వరకు మనిషి జీవితం అంతా ఒక మహా కథ. ఆ కథకు అక్షర రూపం ఇచ్చేది సాహిత్యం. సాహిత్యం కేవలం కాగితంపై అచ్చైన పదాల సమాహారం కాదు. అది మనిషి అంతరంగంలో అలజడి రేపే భావం. నిశ్శబ్దానికి స్వరం. బాధకు భాష. ఆనందానికి ప్రతిధ్వని. అన్యాయానికి ప్రశ్న. ఆశకు చిరుదీపం. కాలం మారుతుంది. పాలకులు మారుతారు. జీవన పద్ధతులు మారుతాయి. సాంకేతిక ప్రపంచం మనిషి చేతిలో కొత్త కొత్త సాధనాలను పెడుతుంది. కానీ మనిషి హృదయంలోని ప్రేమ, బాధ, ఆవేదన, ఆశ, అసంతృప్తి, స్వేచ్ఛ కోసం తపన మాత్రం మారదు. అందుకే కాలం ఎంత ముందుకు వెళ్లినా సాహిత్యం తన ప్రాసంగికతను కోల్పోదు. అక్షరం.. ఒక నిశ్శబ్ద విప్లవం. ఒక అక్షరం ఎంత చిన్నదో చూడటానికి కనిపిస్తుంది. కానీ దాని ప్రభావం ఎంత దూరం వెళ్తుందో చరిత్ర చెబుతుంది. ఒక కవి పలికిన పాదం తరాలను కదిలించగలదు. ఒక రచయిత రాసిన కథ సమాజం దాచిపెట్టిన వాస్తవాన్ని వెలుగులోకి తీసుకురాగలదు. ఒక పుస్తకం ఒక వ్యక్తి జీవిత దిశనే మార్చగలదు. అందుకే అక్షరం నిశ్శబ్దంగా కనిపించే విప్లవం. అది కత్తిలా గాయపరచదు. కానీ మనసులో ప్రశ్నను నాటుతుంది. ఆ ప్రశ్న ఆలోచనగా మారుతుంది. ఆలోచన చైతన్యంగా మారుతుంది. చైతన్యం మార్పుకు దారితీస్తుంది. సాహిత్యం అంటే జీవితాన్ని చదవడం. పుస్తకాన్ని చదవడం ఒక అనుభవం. కానీ సాహిత్యాన్ని చదవడం అంటే మనిషి జీవితాన్ని చదవడం. రైతు చెమటలోని ఉప్పుదనాన్ని ఒక కథ మనకు తెలియజేయవచ్చు. వలస వెళ్లిన కూలీ కళ్లలోని శూన్యతను ఒక కవిత చూపించవచ్చు. తల్లి ఎదురుచూపులోని అనంతమైన ప్రేమను ఒక నవల ఆవిష్కరించవచ్చు. ఒంటరి వృద్ధుడి నిశ్శబ్దాన్ని ఒక చిన్న కథ మన ముందుంచ వచ్చు. మనకు తెలియని జీవితాలను మన కళ్ల ముందు నిలబెట్టే శక్తి సాహిత్యానికి ఉంది. అందుకే మంచి సాహిత్యం చదివిన తరువాత మనం పుస్తకాన్ని మాత్రమే మూసివేయం. మనలోని ఒక కిటికీని తెరిచి ఉంచుతాం. పల్లె గుండెలో పుట్టిన పద్యం. తెలుగు సాహిత్యానికి పల్లె ఒక అక్షయ పాత్ర. పొలాల మధ్య వినిపించిన జానపద గీతాలు, పంట కోత సమయంలో పాడిన పాటలు, పండుగల వేళ వినిపించిన పద్యాలు, అమ్మమ్మలు చెప్పిన కథలు, తాతయ్యలు చెప్పిన సామెతలు—ఇవన్నీ మన సాహిత్య సంపదలో భాగమే. పల్లె భాషలో మట్టి వాసన ఉంటుంది. ఆ భాషలో జీవితం ఉంటుంది. అనుభవం ఉంటుంది. తరతరాల జ్ఞాపకం ఉంటుంది. ఒక గ్రామీణ వృద్ధుడు చెప్పే ఒక సామెత వెనుక ఎన్నో తరాల అనుభవం దాగి ఉంటుంది. ఒక జానపద గీతంలో ఒక సమాజపు సంస్కృతి ప్రతిధ్వనిస్తుంది. అందుకే జానపద సాహిత్యాన్ని కేవలం వినోదంగా చూడలేం. అది మన సామూహిక జ్ఞాపకాల భాండాగారం. కథ.. మనిషి మనసుకు అద్దం. కథ చిన్నదైనా దాని లోకం పెద్దది. ఒక చిన్న కథలో ఒక కుటుంబం కనిపించవచ్చు. కానీ ఆ కుటుంబం వెనుక ఒక సమాజం ఉండవచ్చు. ఒక పాత్ర మనకు పరిచయం లేని వ్యక్తిలా కనిపించవచ్చు. కానీ కొన్ని పేజీలు చదివిన తరువాత అదే పాత్రలో మన జీవితంలోని ఒక కోణం కనిపించవచ్చు. చిన్న కథ — "పాత పుస్తకం". గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల పాత గదిలో ఒక చిన్న చెక్క అల్మారా ఉండేది. ఎన్నో సంవత్సరాలుగా దాని తలుపులు తెరుచుకోలేదు. ఒకరోజు పాఠశాల శుభ్రం చేస్తుండగా పదో తరగతి చదువుతున్న రవి ఆ అల్మారాను తెరిచాడు. లోపల పాత పుస్తకాలు ఉన్నాయి. కొన్ని చిరిగిపోయాయి. కొన్ని పేజీలు కనిపించలేదు. కొన్ని పుస్తకాలపై పేర్లు కూడా చెరిగిపోయాయి. రవి వాటిలో ఒక పుస్తకాన్ని తీసుకున్నాడు. "ఇవి చదివి ఏం లాభం?" అని అతని స్నేహితుడు అడిగాడు. రవి నవ్వాడు. "తెలియదు. కానీ చదవకపోతే ఏం కోల్పోతామో కూడా తెలియదు కదా!" అన్నాడు. ఆ రోజు నుంచి ప్రతిరోజూ పాఠశాల ముగిసిన తర్వాత రవి కొద్దిసేపు ఆ పుస్తకాల మధ్య గడపసాగాడు. కొన్ని నెలలు గడిచాయి. పరీక్షలు వచ్చాయి. రవి మంచి మార్కులు సాధించాడు. ఏళ్ల తరువాత అతను ఉన్నత విద్య పూర్తి చేసి ఉద్యోగం సంపాదించాడు. తన గ్రామానికి తిరిగి వచ్చిన రోజు మొదటగా వెళ్లింది అదే పాఠశాలకు. పాత అల్మారా ఇంకా అక్కడే ఉంది. అతను దాని పక్కనే ఒక కొత్త పుస్తకాల అల్మారా పెట్టించాడు. దాని మీద ఒక చిన్న పలక అమర్చాడు—"ఒకప్పుడు ఈ పాత పుస్తకం నాకు దారి చూపింది. ఇప్పుడు ఈ పుస్తకాలు మరొకరి దారికి వెలుగవ్వాలి." సాహిత్యం కూడా అంతే. ఒకరి చేతిలో ఉన్న పుస్తకం మరొకరి జీవితానికి వెలుగవుతుంది. కవిత్వం.. హృదయం పలికే భాష. కవిత్వం అంటే పదాల అందం మాత్రమే కాదు. అది భావాల లోతు. అందరూ చూసే దృశ్యంలో అందరూ చూడని అనుభూతిని కవి చూస్తాడు. వానను చూసి మనిషి తడుస్తాడు. కవి మాత్రం ఆ వానలో బాల్యాన్ని గుర్తు చేసుకుంటాడు. ఎండను చూసి మనిషి నీడ కోసం వెతుకుతాడు. కవి ఆ ఎండలో కష్టజీవి చెమటను చూస్తాడు. చెట్టు నీడలో కూర్చున్న మనిషికి అది కేవలం విశ్రాంతి. కవికి అది తరతరాలకు నీడనిచ్చిన జీవితం. అందుకే కవిత్వం కళ్లతో చూసేది కాదు—హృదయంతో అనుభూతి చెందేది. కవిత — "అక్షరం". నిశ్శబ్దానికి నాలుగు అక్షరాల స్వరం... చీకటికి చిన్న దీపపు వెలుగు... కన్నీటికి ఒక ఓదార్పు... ప్రశ్నకు ఒక మేలుకొలుపు... మరిచిపోయిన మనిషితనానికి ఒక జ్ఞాపకం... కాలం చెరిపేయలేని మనసు ముద్ర... అదే అక్షరం. అది రాసిన కాగితం చిరిగిపోవచ్చు... కానీ అది రేపిన ఆలోచన చిరిగిపోదు. పుస్తకం.. మనిషికి నిశ్శబ్ద మిత్రుడు. మనిషి ఒంటరిగా ఉన్నప్పుడు పుస్తకం అతనితో మాట్లాడుతుంది. మనసు విరిగినప్పుడు ఓదార్పు ఇస్తుంది. దారి కనిపించనప్పుడు ఆలోచనకు దిశ చూపిస్తుంది. విజయం వచ్చినప్పుడు వినయాన్ని గుర్తు చేస్తుంది. ఓటమి ఎదురైనప్పుడు మళ్లీ లేచి నిలబడే ధైర్యాన్ని ఇస్తుంది. పుస్తకం మన దగ్గర ఏమీ అడగదు. కానీ మనకు ఒక కొత్త ప్రపంచాన్ని అందిస్తుంది. అందుకే పుస్తకాన్ని నిశ్శబ్ద మిత్రుడని అంటారు. పఠన సంస్కృతి.. మన సమాజానికి అవసరం. నేటి కాలంలో మనిషి చేతిలో పుస్తకం కంటే మొబైల్ ఫోన్ ఎక్కువగా కనిపిస్తోంది. సమాచారం క్షణాల్లో అందుబాటులోకి వస్తోంది. చదవడానికి కొత్త కొత్త డిజిటల్ మార్గాలు ఏర్పడ్డాయి. ఇది సాహిత్యానికి ప్రమాదం మాత్రమే కాదు—ఒక కొత్త అవకాశం కూడా. పుస్తకం కాగితంపై ఉండవచ్చు. తెరపై ఉండవచ్చు. ఆడియో రూపంలో వినిపించవచ్చు. కానీ దాని అసలు విలువ మాత్రం మారదు. అయితే వేగంగా వచ్చే సమాచారాన్ని చదవడం ఒకటి; లోతుగా ఆలోచించేలా చేసే సాహిత్యాన్ని చదవడం మరొకటి. సమాచారం మనకు ఏం జరిగిందో చెబుతుంది. సాహిత్యం మాత్రం అది మనిషికి ఏం చేసిందో చూపిస్తుంది. యువత.. సాహిత్యానికి కొత్త శ్వాస. యువత చదవడం తగ్గిందనే విమర్శ తరచుగా వినిపిస్తుంది. కానీ యువతలో సృజనాత్మకత తగ్గలేదు. కొత్త తరం కొత్త భాషలో రాస్తోంది. కొత్త మాధ్యమాల్లో రాస్తోంది. చిన్న కథలు, కవితలు, డిజిటల్ రచనలు, ఆడియో కథలు, బ్లాగులు—సాహిత్యం కొత్త రూపాలను సంతరించుకుంటోంది. అందుకే యువతను నిందించడం కంటే వారి చేతిలోని మాధ్యమాన్ని సాహిత్యానికి అనుకూలంగా మలచడం అవసరం. ఒక చిన్న కవిత సోషల్ మీడియాలో వేల మందికి చేరవచ్చు. ఒక మంచి కథ ఒక యువకుడి ఆలోచనను మార్చవచ్చు. ఒక రచయితకు డిజిటల్ వేదిక ప్రపంచవ్యాప్తంగా పాఠకులను అందించవచ్చు. ఇది సాహిత్యానికి కొత్త దశ. భాషను కాపాడటం అంటే జ్ఞాపకాలను కాపాడటం. భాష కేవలం సంభాషణ సాధనం కాదు. అది ఒక జాతి జ్ఞాపకం. మన అమ్మమ్మ పిలుపులో ఉన్న మాధుర్యం, మన ఊరి పలుకుబడిలో ఉన్న ప్రత్యేకత, పల్లె సామెతలో ఉన్న అనుభవం—ఇవన్నీ భాషలోనే నిలిచిపోతాయి. భాష బలహీనపడితే పదాలు మాత్రమే కనుమరుగవు. వాటితో పాటు ఒక సంస్కృతి, ఒక జీవన విధానం, ఒక జ్ఞాపకాల ప్రపంచం కూడా మసకబారుతుంది.


అందుకే తెలుగు మాట్లాడాలి. తెలుగు చదవాలి. తెలుగు రాయాలి. తెలుగు సాహిత్యాన్ని కొత్త తరానికి అందించాలి. రచయితకు స్వేచ్ఛతో పాటు బాధ్యత. కలం ఒక గొప్ప స్వేచ్ఛ. అదే సమయంలో అది ఒక గొప్ప బాధ్యత కూడా. రచయిత సమాజాన్ని ప్రశ్నించాలి. కానీ వాస్తవాన్ని వక్రీకరించకూడదు. అన్యాయాన్ని ఎత్తిచూపాలి. కానీ ద్వేషాన్ని పెంచకూడదు. వ్యక్తిని విమర్శించవచ్చు. కానీ వ్యక్తిత్వ హననానికి దిగజారకూడదు. సమాజంలోని లోపాలను చూపించాలి. అదే సమయంలో మార్పుకు మార్గాన్ని కూడా సూచించాలి. రచయిత తన కలంతో సమాజాన్ని గాయపరచవచ్చు. అదే కలంతో గాయపడిన సమాజానికి మందుగా కూడా మారవచ్చు. అందుకే కలం విలువను రచయిత ఎప్పుడూ గుర్తుంచుకోవాలి. సాహిత్యం.. సమాజానికి అద్దం. సాహిత్యం సమాజాన్ని ఉన్నదున్నట్లుగా చూపించడమే కాదు. సమాజం ఎలా ఉండాలో కూడా ఊహించగలదు. ప్రస్తుతం కనిపించని భవిష్యత్తును రచయిత తన ఊహలో ముందుగానే నిర్మించగలడు. అందుకే సాహిత్యం కేవలం వర్తమానాన్ని నమోదు చేసే సాధనం కాదు. అది భవిష్యత్తుకు విత్తనం. ఒక మంచి రచన చదివిన తరువాత మనలో ఒక ప్రశ్న పుడితే ఆ రచన విజయవంతమైనట్టే. ఒక మనిషి బాధను అర్థం చేసుకునే హృదయం కలిగితే ఆ సాహిత్యం తన పని చేసినట్టే. ఒక అన్యాయాన్ని చూసి మౌనం వహించలేకపోతే ఆ అక్షరం తన శక్తిని నిరూపించినట్టే. సంపాదకీయం — అక్షరాన్ని బతికిద్దాం.. ఆలోచనను నిలబెట్టుకుందాం. మన సమాజంలో భవనాలు పెరుగుతున్నాయి. సాంకేతికత పెరుగుతోంది. సమాచారం పెరుగుతోంది. కానీ ఈ అభివృద్ధితో పాటు మనిషి అంతరంగం కూడా ఎదుగుతోందా అనే ప్రశ్నకు సమాధానం వెతకాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే సమాచారం ఉన్న మనిషి తెలివైనవాడై ఉండవచ్చు. కానీ భావం ఉన్న మనిషే నిజమైన మానవుడు. ఆ భావాన్ని పెంచేది సాహిత్యం. ఇతరుల బాధను మన బాధగా అనుభూతి చెందే హృదయాన్ని సాహిత్యం పెంచుతుంది. మనకు భిన్నంగా ఉన్న మనిషిని అర్థం చేసుకునే సహనాన్ని పెంచుతుంది. మన తప్పులను మనమే చూసుకునే అద్దాన్ని అందిస్తుంది. అందుకే సాహిత్యానికి స్థానం పుస్తకాల అల్మారాలో మాత్రమే ఉండకూడదు. ఇంట్లో ఉండాలి. పాఠశాలలో ఉండాలి. గ్రంథాలయంలో ఉండాలి. గ్రామంలో ఉండాలి. నగరంలో ఉండాలి. డిజిటల్ ప్రపంచంలోనూ ఉండాలి. ప్రతి పిల్లవాడి చేతిలో ఒక పుస్తకం ఉండాలి. ప్రతి గ్రామంలో ఒక పఠన వేదిక ఉండాలి. ప్రతి పాఠశాలలో జీవంతో నిండిన గ్రంథాలయం ఉండాలి. కొత్త రచయితకు తన మాట చెప్పే అవకాశం ఉండాలి. ఎందుకంటే సాహిత్యం ఒక తరం కోసం మాత్రమే కాదు. అది తరాల మధ్య సంభాషణ. గతం మనతో మాట్లాడే భాష సాహిత్యం. వర్తమానం మనల్ని ప్రశ్నించే స్వరం సాహిత్యం. భవిష్యత్తును ఊహించే కల సాహిత్యం. అందుకే అక్షరాన్ని గౌరవించాలి. రచయితను గౌరవించాలి. కవితను వినాలి. కథను చదవాలి. పుస్తకాన్ని చేతిలోకి తీసుకోవాలి. మనసును తెరవాలి. ఎందుకంటే అక్షరం బతికితే ఆలోచన బతుకుతుంది. ఆలోచన బతికితే ప్రశ్న బతుకుతుంది

.ప్రశ్న బతికితే చైతన్యం బతుకుతుంది. చైతన్యం బతికితే సమాజం మారుతుంది. సాహిత్యం కాలంతో పోటీ పడదు. కాలాన్ని దాటి నడుస్తుంది. పుస్తకం మూసుకుపోయినా అందులోని మాట మనలో తెరిచే ఉంటుంది. కవిత ముగిసినా దాని ప్రతిధ్వని మనసులో మిగిలే ఉంటుంది. కథ ముగిసినా దాని పాత్రలు మన జ్ఞాపకాల్లో నడుస్తూనే ఉంటాయి. అదే సాహిత్యం. అదే అక్షరానికి ఉన్న అమరత్వం. అదే మనిషితనానికి చిరునామా. అక్షరం చిన్నదే... కానీ అది ఒక మనిషి ఆలోచనను మార్చగలదు. ఒక ఆలోచన ఒక తరాన్ని మార్చగలదు. ఒక తరం ఒక సమాజాన్ని మార్చగలదు.



ఎం రవీందర్
7901503777

# భారతీయ కవిత



ప్రతి ఆదివారం ఉదయ
సూర్యున్ని
ముఖానికి తగిలించుకొని
మా పెద్దరువాజకు
మేలుకొలుపై తలుపు
కొట్టేవాడు
తన చేతిలో పెట్టె రూపంలో
ఉన్న బతుకును ఆడిస్తూ
వచ్చి కూర్చునే వాడు
మన నెత్తిమీది మబ్బు తునక
అతని చేతిలో మెరుస్తున్న కత్తై

తలవంచుకొని కూర్చో
వలసిందే
శ్రమశక్తి ప్రపంచాన్ని
నడిపిస్తుందనడానికి

## తిరుగులేని తీరం

శిరసును ముద్దాడేది
తనకు తెలిసిన సకల ప్రపంచం
మెదడు స్క్రీన్ మీద రీలు రీలుగా
పరుస్తూ
తన పొలాన్ని తాను
దున్నే సేవాడు
సంవత్సరం బావతే
నాటి ఆనవాయితీ
ప్రతి ఇంటిలోను సౌందర్యాన్ని
చాకచక్యాన్ని దాచుకున్న కత్తి
పెట్టెలో ఎన్ని కలలు కనేదో
అతి నిరంకుశులైన
భూస్వాముల పైన పెత్తందారుల
పైన
అతని విధి ముందు

ఇంతకంటే ప్రతీక
ఎక్కడుంటుంది?
ఇప్పుడు అతను అతనిగా
బ్రతకడం లేదు
నాటి కుల వివక్ష నశిస్తుంది
సరే...
అతని నుంచి అతను కూడా
దూరమవుతున్నాడు
చూద్దాం...
ఇది పూరా జ్ఞాపకం కాకుండా
ఈ కలం చికిత్సే కాపాడాలి
ప్రపంచ ప్రవాహం లో అతను
తిరుగులేని
తీరం కావాలి.

# ఓ మిత్రమా..!
# నిన్ను నీవే వెలిగించుకో..!

### 1. నీలోని దీపం

చిమ్మ చీకటి ఉందని
చేతులు ముడిచి
చింతిస్తూ కూర్చోకు
నీ గుండెలో దాగిన
చిరుదీపాన్ని వెలిగించు..!
సూర్యుడు రావాలని
సంధ్యను నిందించకు..!
నీ అడుగే అరుణోదయమై
నీ దారిని మేల్కొలుపుతుంది
ఎవరో వెలిగించేది వెలుగు కాదు...
నిన్ను నీవు వెలిగించుకున్నదే ఉదయం..!

### 2. నీకే నీవు తోడు

నీడ కోసం చెట్టును వెతకకు,
తోడు కోసం తలుపులు తట్టకు..!
పడవకు తెడ్డు ఎంత అవసరమో
మనిషికి మనోధైర్యం అంత అవసరం..!
చేయి అందించే వారికోసం
చౌరస్తాలో నిలబడకు
నీ భుజమే నీకు బలమై
నీ అడుగే నీకు దారై నడవనీ..!
తోడు దొరికితే అదృష్టం...
నీకే నీవు తోడైతే అజేయత్వం..!

### 3. నీకు నీవే న్యాయమూర్తి

లోకం వేసే ముద్రలను
నుదుటిపై మోసుకోకు..!
నీ తప్పులకు నీవే
న్యాయస్థానం తెరవాలి..!
వేలెత్తి చూపేవారికంటే
వెలుగెత్తి నిలిచేవాడవు కమ్ము..!
తీర్పు కోసం తలవంచితే
జీవితం బందీ అవుతుంది
నీ మనసాక్షి చెప్పిన మాటే
నీ జీవితానికి అత్యున్నత తీర్పు..!

### 4. మార్పు ముంగిట...

ప్రపంచం మారలేదని
పెదవి విరవకు..!
నీ ఇంటి గుమ్మం ముందు
ఒక మార్పు మొక్క నాటు..!
ఎదుటివారి చీకటిని చూసి
నీ దీపాన్ని ఆర్పకు..!
నీ ఆచరణే అలవాటై
పది అడుగులకు పరిమళమైతే
నీలో మొదలైన మార్పే
నూట మందికి మార్గదర్శనం..!

### 5. నీ వెన్ను నీవే తట్టు

పరాజయం పలకరించగానే
పరాయి భుజం కోసం చూడకు..!
పడిపోయిన నేలనే
మెట్టుగా మార్చుకో..!
నీ కన్నీటిని తుడవడానికి
చేయి రాకపోవచ్చు
కానీ నీ గుండెలోని గాయం
గెలుపుకు గాథ కావచ్చు..!
నీ వెన్ను నీవే తట్టుకున్న రోజు...
పరాజయం నీకు పాదాక్రాంతమౌతుంది..!

### 6. చప్పట్ల కోసం కాదు...

చప్పట్లు వినిపిస్తేనే
చెట్టు పూలు పూయదు..!
ప్రశంసల వానకోసం
ప్రతిభ మేఘం ఆగదు..!
ఎవరో మెచ్చాలని
నీ ప్రయాణం మొదలు పెట్టకు..!
నీ కృషిని చూసి
నీవే గర్వంగా నవ్వుకో
చప్పట్లు క్షణికం...
సాధించిన సంతృప్తి జీవితకాలం..!

### 7. నవ్వుకు నీవే చిరునామా

ఎవరో నవ్విస్తారని
విచారాన్ని కాపాడకు..!
నీ పెదవులపై పూసే
చిరునవ్వుకు నీవే తోటమాలి..!
సంతోషం ఎవరో ఇచ్చే
బహుమతి కాదు సుమా
కష్టాల మధ్య కూడా
కాంతులు కురిపించే కళ..!
నీ నవ్వుకు నీవే కారణమైతే...
దుఃఖం నీ గుమ్మం దాటలేదు..!

### 8. పతనాన్ని కోరేవారు...

నీ పచ్చదనం చూసి
పండుగ చేసేవారందరూ ఉండరు..!
నీ రెక్కల రంగును చూసి
రాళ్లు విసిరేవారుంటారు..!
నీవు ఎదిగితే అసూయతో
నీ ఎత్తు కొలిచేవారుంటారు
నీవు జారిపడితే
జయధ్వానాలు చేసేవారుంటారు..!
కాబట్టి... జనాన్ని కాదు,
నీ గమ్యాన్ని చూసి అడుగేయ్..!

### 9. ఊబిలో కాదు ఒడ్డులో...

ఊబిలోకి తోసేవారి
చేతులను లెక్క పెట్టకు..!
ఒడ్డుకు చేరాలనే
నీ ఈతను నమ్ముకో..!
గాలికి దీపం వణికినా
వెలగడం మానదు..!
అలలకు పడవ భయపడితే
తీరం ఎప్పటికీ చేరదు..!
అడ్డంకి ఎంత పెద్దదైనా...
నీ సంకల్పం దానికి
మించిన తెప్ప కావాలి..!

### 10. నీవే నీ సూర్యుడు...

ఎవరో వస్తారని
ఎదురు చూసే కాలం చాలింది..!
ఎవరో చేయి ఇస్తారని
వాకిట్లో నిలిచే పని చాలింది..!
నీ గుండె గుమ్మం తెరచి
ధైర్యాన్ని లోపలికి ఆహ్వానించు..!
నీ సంకల్పానికి రెక్కలిచ్చి
ఆకాశం వైపు ఎగరవేయ్..!

ఓ నా ప్రియ మిత్రమా...
గుర్తుంచుకో—
ఒక్కమాట
నిన్ను నీవు
వెలిగించుకున్ననాడు
ప్రపంచమే నీకు
వెలుగుదారి ఔతుంది..!



పోలయ్య కూకట్లపల్లి
అత్తాపూర్ హైదరాబాద్



# జాతీయం-అంతర్జాతీయం



## అన్ని కమిటీల్లో ఆరెస్సెస్, ఏబీవీపికి చెందిన వారే

**11, 12 తరగతుల పాఠ్య పుస్తకాలరూపకల్పనకు కొత్త కమిటీలు**
- **ప్రధాని ఆర్థిక సలహా మండలి సభ్యులు, ఏబీవీపీ మాజీ నేతలకు చోటు**
- **గతంలో పొలిటికల్ సైన్స్ పుస్తకాల కమిటీలోనూ ఆర్ఎస్ఎస్ అనుబంధ సభ్యులు**
- **ఏబీవీపీ సాకేత్ బహుగుణకు చోటు**
- **భారతీయ జ్ఞాన వ్యవస్థలు చేర్చేలా ఆదేశాలు**




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 13 (ఎ.ఎం.ఎస్) :** దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే పాఠ్యపుస్తకాలు ఇక విద్యా నిపుణుల పరిధి లోనే ఉండాలా? లేక అధికారంలో ఉన్న రాజకీయ శక్తుల సిద్ధాంతాలకు అద్దం పట్టాలా? అనే ప్రశ్న మరోసారి తెరపైకి వచ్చింది. 11, 12 తరగతుల ఎకనామిక్స్, ఇంగ్లీష్ పాఠ్యపుస్తకాల రూపకల్పన కోసం ఎన్‌సీఈఆర్‌టీ ఏర్పాటు చేసిన కొత్త కమిటీల్లో ప్రధాని ఆర్థిక సలహా మండలి సభ్యులు, ఆరఎసఎస్ అనుబంధ ఏబీవీపీ మాజీ జాతీయ నేతకు చోటు కల్పించడం వివాదానికి దారితీస్తోంది. ఇప్పటికే పొలిటికల్ సైన్స్ పాఠ్యపుస్తకాల కమిటీలో ఆర్ఎస్ఎస్ తో ప్రత్యక్ష, పరోక్ష సంబంధాలున్న సభ్యులను నియమించారన్న ఆరోపణల నేపథ్యంలో తాజా నియామకాలు కేంద్రంలోని మోదీ ప్రభుత్వ విద్యా విధానంపై మరిన్ని ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి.

జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) 11, 12 తరగతుల కోసం కొత్త ఎకనామిక్స్, ఇంగ్లీష్ లాంగ్వేజ్ అండ్ లిటరేచర్ పాఠ్యపుస్తకాలను రూపొందించేందుకు రెండు కొత్త కమిటీలను ఏర్పాటు చేసింది. అయితే ఈ కమిటీల్లో ప్రధాని ఆర్థిక సలహా మండలి సభ్యులతో పాటు ఆర్ఎస్ఎస్ అనుబంధ విద్యార్థి సంఘం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) మాజీ జాతీయ మీడియా కన్వీనర్‌కు స్థానం కల్పించడం చర్చనీయాంశంగా మారింది. జాతీయ విద్యా విధానం2020 కింద ఈ కమిటీలను ఏర్పాటు చేశారు. గత నెలలో 11, 12 తరగతుల పొలిటికల్ సైన్స్ పాఠ్యపుస్తకాల కోసం ఏర్పాటు చేసిన కమిటీలో కనీసం నలుగురు సభ్యులకు ఆరఎసఎస్‌తో ప్రత్యక్షం గా లేదా పరోక్షంగా సంబంధా లున్నట్టు వార్తలు వచ్చాయి. ఇప్పుడు ఎకనా మిక్స్, ఇంగ్లీష్ పాఠ్యపుస్తకాల కమిటీల్లోనూ అధికార, ఆరఎసఎస్ అనుబంధ నేపథ్యం కలిగిన వ్యక్తులకు చోటు దక్కడం అనేక విమర్శలకు దారితీస్తోంది.

ఎకనామిక్స్ పాఠ్యపుస్తకాల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన 14 మంది సభ్యుల కమిటీకి ప్రధాని ఆర్థిక సలహా మండలి (పీఎం - ఈఏసీ) సభ్యుడు సంజీవ్ సన్యాల్ నేతృత్వం వహించనున్నారు. అదే మండలికి చెందిన మరో సభ్యురాలు షమికా రవి కూడా కమిటీలో సభ్యురాలిగా ఉన్నారు. ఇక ఇంగ్లీష్ లాంగ్వేజ్ అండ్ లిటరేచర్ పాఠ్యపుస్తకాల కమిటీలో ఢిల్లీలోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హిందీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న సాకేత్ బహుగుణకు సభ్యత్వం ఇచ్చారు. బహుగుణ ఢిల్లీ యూనివర్సిటీలో విద్యార్థిగా ఉన్న సమయంలో ఆరఎసఎస్ అనుబంధ ఏబీవీపీతో పనిచేశారు. 2014లో ఏబీవీపీ ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్నారు. అనంతరం సంస్థ జాతీయ మీడియా కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వహించారు.

2017లో ఢిల్లీ యూనివర్సిటీ రామ్‌జాస్ కాలేజీ వివాదం సమయంలో బహుగుణ ఏబీవీపీ ప్రముఖ ప్రతినిధుల్లో ఒకరిగా వ్యవహరించారు. అప్పటి జేఎన్‌యూ విద్యార్థి ఉమర్ ఖలీద్ పాల్గొనాల్సిన సెమినార్‌ను ఏబీవీపీ సభ్యుల నిరసనల నేపథ్యంలో రద్దు చేశారు. ఆ తర్వాత ఢిల్లీ యూనివర్సిటీలో ఘర్షణలు చోటుచేసుకోవడం, భావప్రకటనా స్వేచ్ఛ, క్యాంపస్ రాజకీయాలపై దేశవ్యాప్తంగా చర్చ జరగడం తెలిసిందే. ఏబీవీపీపై అప్పట్లో వచ్చిన హింస ఆరోపణలను బహుగుణ సమర్థించారు. ఏబీవీపీ సభ్యుల నుంచే బెదిరింపులు వచ్చాయన్న ఆరోపణలను కూడా ఆయన ఖండించారు.

17 మంది సభ్యులతో కూడిన ఇంగ్లీష్ పాఠ్యపుస్తకాల కమిటీకి హైదరాబాద్‌లోని ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (ఇఫ్లూ) వైస్ చాన్స్‌లర్ ఎన్. నాగరాజు అధ్యక్షత వహించనున్నారు. ఈ కమిటీలో త్రివిక్రమ కుమారి జమ్వాల్ కూడా సభ్యురాలిగా ఉన్నారు. ఆమె మేవార్ రాజకుటుంబానికి చెందిన వ్యక్తి. 2017లో ఆమె కుటుంబం తరఫున ఆమె సోదరుడు అప్పటి ప్రధాని మోడీకి లేఖ రాస్తూ సంజయ్ లీలా భన్సాలీ చిత్రం 'పద్మావతి'కి సర్టిఫికేషన్, విడుదలను నిలిపివేయాలని కోరారు. కొత్త పాఠ్యపుస్తకాల్లో సమానత్వం, సమ్మిళితత్వం, విద్యార్థుల వయస్సుకు తగిన బోధనా పద్ధతులు, విలువల విద్య, సమాచారసాంకేతిక పరిజ్ఞానం, భారతీయ జ్ఞాన వ్యవస్థలు, పర్యావరణ విద్య వంటి అంశాలను చేర్చాలని ఎన్‌సీఈఆర్‌టీ కమిటీలకు సూచించింది. పాఠ్యపుస్తకాలు సిద్ధమైన తర్వాత సాంస్కృతిక మూలాలతో అనుసంధానం, భారతీయ జ్ఞాన వ్యవస్థలు, సమ్మిళితత్వం, విద్యా సాంకేతికత, మూల్యాంకనం వంటి అంశాలు సరిగా ప్రతిబింబించాయో లేదో సమీక్షిస్తామని ఎన్‌సీఈఆర్‌టీ తెలిపింది. ఎకనామిక్స్ కమిటీ తన పనిని 2027 ఫిబ్రవరి నాటికి పూర్తి చేయాల్సి ఉండగా, ఇంగ్లీష్ లాంగ్వేజ్ అండ్ లిటరేచర్ కమిటీ 2027 సెప్టెంబర్ నాటికి పాఠ్యపుస్తకాల రూపకల్పన పూర్తి చేయాలని నిర్ణయించారు.

అయితే వరుసగా పాఠ్యపుస్తకాల అభివృద్ధి కమిటీల్లో ఆర్ఎస్ఎస్ అనుబంధ నేపథ్యం కలిగిన వ్యక్తులు, కేంద్ర ప్రభుత్వ సలహా వ్యవస్థలోని సభ్యులకు చోటు కల్పిస్తుండటంపై విద్యావర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. విద్యను రాజకీయ, సైద్ధాంతిక ప్రభావాల నుంచి దూరంగా ఉంచాల్సిన సమయంలో పాఠ్యపుస్తకాల రూపకల్పనలో ఒకే భావజాలానికి దగ్గరగా ఉన్న వ్యక్తులకు ప్రాధాన్యం ఇస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పాఠ్యపుస్తకాలు పాఠాలు నేర్పే పుస్తకాలు మాత్రమే కావనీ, ఒక తరం ఆలోచనా విధానాన్ని ప్రభావితం చేసే ప్రధాన సాధనాలని విద్యావేత్తలు గుర్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మోడీ ప్రభుత్వ హయాంలో ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాల మార్పులు, కమిటీల నియామకాలు విద్యా సంస్కరణల కోసమా లేక అధికార పార్టీ మాతృసంస్థ ఆరఎసఎస్ భావజాలాన్ని భవిష్యత్ తరాలకు చేరవేసే ప్రయత్నమా అన్న ప్రశ్న మరింత బలపడుతోంది.

## ఇండోనేషియాలో ఘోర నౌక ప్రమాదం

- **130 మంది గల్లంతు**
- **కొనసాగుతున్న గాలింపు చర్యలు**
- **బంధువుల ఆవేదనలు, ఆక్రందనలు**




**తూర్పు జావా, సెప్టెంబరు 13 :** ఇండోనేషియాలో ఘోర నౌకా ప్రమాదం జరిగింది. 213 మంది ప్రయాణికులు, 30 మంది సిబ్బందితో కలిపి మొత్తం 243 మందితో ప్రయాణిస్తున్న 'వర్గో ట్రాన్స్‌పోర్ట్ 8' అనే నౌక జావా సముద్రంలో మునిగిపోయింది. ఈ పెను విషాదంలో ఇప్పటివరకు 107 మందిని సహాయక బృందాలు సురక్షితంగా కాపాడగా, ఆరుగురి మృతదేహాలను వెలికితీశాయి. మరో 130 మంది ఆచూకీ ఇంకా తెలియరాలేదు. వారి కోసం సముద్రంలో గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

వివరాల్లోకి వెళితే, తూర్పు జావాలోని సురబయ నుంచి శనివారం బయలుదేరిన ఈ నౌక, దక్షిణ కాలిమంటన్‌లోని బంజర్‌మాసిన్‌కు వెళుతోంది. ఆదివారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో కెప్టెన్ నుంచి అధికారులకు చివరి సందేశం అందింది. సముద్రంలో దాదాపు 3 మీటర్ల ఎత్తున అలలు ఉవ్వెత్తున ఎగిసిపడుతున్నాయని, దీంతో నౌక ఒకవైపునకు ఒరిగిపోతోందని ఆయన తెలిపారు. ఆ తర్వాత కొద్దిసేపటికే నౌకతో సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి. బంజర్‌మాసిన్ రేవుకు సుమారు 148 కిలోమీటర్ల దూరంలో ఈ దుర్ఘటన జరిగినట్లు అధికారులు నిర్ధారించారు.

సమాచారం అందుకున్న వెంటనే సహాయక చర్యలు ప్రారంభమయ్యాయి. నౌకాదళానికి చెందిన నౌకతో సహా నాలుగు నౌకలు, ఒక హెలికాప్టర్, సమీపంలోని టగ్‌బోట్ల సహాయంతో గల్లంతైన వారి కోసం గాలిస్తున్నారు. కాపాడిన వారిని సమీపంలోని తూర్పు జావా పోర్టుకు తరలిస్తున్నారు. మరోవైపు, బంజర్‌మాసిన్‌లోని త్రిశక్తి పోర్టు వద్ద గల్లంతైన వారి బంధువులు వందలాదిగా గుమిగూడారు. ప్రయాణికుల జాబితాలను చూస్తూ తమ వారి క్షేమ సమాచారం కోసం తీవ్ర ఆవేదనతో ఎదురుచూస్తున్నారు.

వేలాది ద్వీపాలతో కూడిన ఇండోనేషియాలో రవాణాకు ఫెర్రీలపైనే ఎక్కువగా ఆధారపడతారు. అయితే, భద్రతా లోపాల కారణంగా ఇక్కడ తరచూ ఇలాంటి సముద్ర ప్రమాదాలు జరగడం ఆందోళన కలిగిస్తోంది. అంతేకాకుండా, అధికారిక రికార్డుల్లో ఉన్న ప్రయాణికుల సంఖ్యకు, వాస్తవంగా నౌకలో ఉన్నవారి సంఖ్యకు తేడా ఉండటం ఇక్కడ సర్వసాధారణమని, దీంతో గల్లంతైన వారి కచ్చితమైన సంఖ్యను నిర్ధారించడం కష్టంగా మారిందని అధికారులు పేర్కొంటున్నారు.




## జోమాటో అదనపు చార్జీలు

- **క్యాష్ ఆన్ డెలివరీపై బాదుడు**

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 13 (ఎ.ఎం.ఎస్) :** ప్రముఖ ఫుడ్ డెలివరీ యాప్ జొమాటో వినియోగదారులపై మరోసారి ఆర్థిక భారం మోపింది. క్యాష్ ఆన్ డెలివరీ (సీఓడీ) విధానంలో ఆర్డర్ చేసే కస్టమర్లపై అదనంగా రూ.5 వసూలు చేస్తోంది. ప్రస్తుతం ఈ చార్జీలు కంపెనీ బిల్లులో స్పష్టంగా కనిపిస్తున్నాయి. కంపెనీ ఆదాయాన్ని మరింత పెంచుకోవడంతో పాటు, డిజిటల్ చెల్లింపుల వైపు వినియోగదారులను మళ్లించే ఉద్దేశంతోనే జొమాటో ఈ నిర్ణయం తీసుకున్నట్టు మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. ఆన్‌లైన్ ద్వారా ముందుగానే చెల్లింపు చేసే వారికి ఈ అదనపు ఛార్జీల నుంచి మినహాయింపు లభిస్తుంది. ఇప్పటికే ఫుడ్ ఆర్డర్లపై ప్లాట్‌ఫాం ఫీజు, రెస్టారెంట్ ప్యాకేజింగ్ ఛార్జీలు, జీఎస్‌టి వసూలు చేస్తున్న జొమాటో.. తాజాగా సీఓడీ చార్జీలను కూడా కలపడంతో వినియోగదారులపై భారం మరింత పెరగనుంది. కొద్ది రోజులకు ముందే జొమాటో తన ప్లాట్‌ఫాం ఫీజును రూ.12.50 నుంచి రూ.14.90కి పెంచిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఫుడ్ డెలివరీ రంగంలో పోటీ తీవ్రతరమవుతోంది. మార్కెట్లో కొత్త కంపెనీలు ప్రవేశిస్తుండటంతో పాటు, లాభాలను ఆర్జించే లక్ష్యంతో జొమాటో ఈ రకమైన రుసుములను క్రమంగా అమలు చేస్తోంది. డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించడమే ప్రధాన లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది.

## గుండా చట్టం దుర్వినియోగం




- **యూపీ ప్రభుత్వ తీరుపై అలహాబాద్ హైకోర్టు ఆగ్రహం జాగ్రత్తగా ఉపయోగించాలంటూ హితవు**

**అలహాబాద్, సెప్టెంబరు 13 (ఎ.ఎం.ఎస్) :** ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం గూండా చట్టాన్ని దుర్వినియోగం చేస్తోందని అలహాబాద్ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. కఠినమైన ఈ చట్టాన్ని ప్రజలను వేధించే ఒక సాధనంగా రాష్ట్ర ప్రభుత్వం ఉపయోగిస్తున్నట్లు తమ వద్దకు వచ్చిన కేసులను చూస్తుంటే అర్థమవుతోందని పేర్కొంది. గూండా చట్టమనేది అత్యంత శక్తివంతమైన చట్టమని, దీన్ని అత్యంత జాగ్రత్తగా ప్రయోగించాల్సి వుంటుందని, స్పష్టమైన కేసుల్లో, శాంతి భద్రతలను పరిరక్షించేందుకే ఉపయోగించాలని జస్టిస్ సుభాష్ విద్యార్థి నేతృత్వంలోని లక్నోబెంచ్ వ్యాఖ్యానించింది. జహీద్ అలీ అనే వ్యక్తిని గూండాగా పేర్కొంటూ, ఆరు మాసాల పాటు ఆయనను జిల్లా నుండి బహిష్కరిస్తూ గోండా జిల్లా మేజిస్ట్రేట్ ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేస్తూ న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. జిల్లా మేజిస్ట్రేట్ తీసుకున్న నిర్ణయాన్ని సమర్ధిస్తూ డివిజనల్ కమిషనర్ జారీ చేసిన అప్పిలేట్ ఆర్డర్‌ను కూడా కోర్టు కొట్టివేసింది. 2010 నాటి కేసులో జాహిద్ అలీని నిర్దోషిగా విడుదల చేశారని, తదనంతరం అతన్ని 'గూండా'గా ప్రకటించడానికి ఆ కేసును ప్రాతిపదికగా ఉపయోగించలేమని కోర్టు పేర్కొంది. 2020లో మరో క్రిమినల్ కేసు నమోదైందని, 2026లో అలీని గూండాగా ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేశారని, ఈ రెండింటికీ మధ్య దాదాపు ఆరేళ్ల అంతరం వుందని కోర్టు పేర్కొంది. ఈ రెండింటి మధ్య హేతుబద్ధమైన సంబంధం లేదని స్పష్టం చేసింది. ఒక క్రిమినల్ కేసులో జోక్యం వున్నంత మాత్రాన అలీని క్రిమినల్ నేరాలకు పాల్పడే లేదా నేరాలకు ప్రేరేపించే నేరస్తుడిగా పేర్కొనలేమని కోర్టు పేర్కొంది. గూండా చట్టాన్ని అమలు చేయడానికి ప్రాతిపదికగా బీట్ సమాచారం నివేదికను చూపించగా, దాన్ని కూడా బెంచ్ తిరస్కరించింది. ఆ సమాచారం ప్రాతిపదికగా క్రిమినల్ కేసు నమోదు కాలేదని, పైగా తన వాదన వినిపించుకునే అవకాశాన్ని అలీకి ఇవ్వలేదని, సహజ న్యాయ సూత్రాన్ని జిల్లా మేజిస్ట్రేట్ ఉల్లంఘించారని బెంచ్ పేర్కొంది.

## బ్రిక్స్ మరింత బలోపేతం..

- **ఇదో చారిత్రక సమావేశం**
- **సదస్సును ప్రారంభిస్తూ ప్రధాని మోడీ పిలుపు**
- **బ్రిక్స్ కూటమి ఎవరికీ వ్యతిరేకం కాదని స్పష్టీకరణ**
- **గ్లోబల్ గవర్నెన్స్ మెరుగుకు 10 సూత్రాలు**



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 13 (ఎ.ఎం.ఎస్) :** గ్లోబల్ సౌత్ దేశాలు 'నియమాలను నిర్దేశించే శక్తిగా మారాలి' అని ప్రధాని నరేంద్ర మోడీ పిలుపునిచ్చారు. ఇకపై ఈ దేశాలు నియమాలను పాటించే దేశాలుగా కాకుండా వాటిని నిర్దేశించే శక్తిగా, నిర్ణయాక క్రమంలో భాగస్వామిగా మారాలన్నారు. ప్రతి ఒక్క దేశానికీ తన స్వరం వినిపించే అవకాశం వుండాలి, ప్రతి సభ్య దేశానికీ వాటా వుండాలి. మానవాళి అభివృద్ధికి ప్రతి ఒక్కరి ప్రయత్నం, కృషి కీలకమేనని అన్నారు. ఇక్కడ భారత మంటపంలో బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు2026ను భారత ప్రధాని నరేంద్ర మోడీ అధికారికంగా ప్రారంభిం చారు. ఈ సందర్భంగా మోడీ ప్రారంభోపన్యాసం చేస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు.

అంతర్జాతీయ వేదికపై బ్రిక్స్ ఒక విశిష్టతను సంపాదించుకుందన్నారు. ఈ కూటమి ఏ ఒక్కరికీ వ్యతిరేకం కాదని ప్రధాని ఉద్ఘాటించారు. అంతర్జాతీయంగా నెలకొన్న ఘర్షణలు, సమస్యల పరిష్కారం దిశగా బాధ్యతలు తీసుకునేందుకు భారత్ సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. మారుతున్న ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా గ్లోబల్ గవర్నెన్స్ మెరుగుపరచడానికి 10 సూత్రాలతో కూడిన ఒక సమగ్ర రోడ్‌మ్యాప్‌ను ప్రధాని మోడీ ఈ సందర్భంగా ప్రతిపాదించారు. "ఈ ఏడాది బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలను చేపట్టిన భారత్‌కు ప్రజలు, వారి సంక్షేమం, మానవత్వంతో కూడిన విధానాలు, వైఖరే ప్రధానం" అని మోడీ స్పష్టం చేశారు. స్థితిస్థాపకత (ఎలాంటి ఒడిదుడుకులు ఎదురైనా ఎదుర్కొనే శక్తి సామర్థ్యాలు), ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత ఈ సదస్సు ప్రధాన లక్ష్యాలని అన్నారు. ఈ ప్రాధాన్యతలను దృష్టిలో పెట్టుకుని బ్రిక్స్ సహకారాన్ని ప్రతి ఒక్క సామాన్యుడితో అనుసంధానిం చడానికే తాము చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ దార్శనికత తోనే 30 నగరాల్లో 350కిపైగా సమావేశాలు నిర్వహించామన్నారు. బ్రిక్స్ ఏర్పాటు చేసి ఇప్పటికి రెండు దశాబ్దాలు పూర్తయినందున ఈ ఏడాది ఇది చారిత్రక సమావేశమన్నారు. బ్రిక్స్ సభ్యదేశాల ప్రజలకు మనం భరోసా కల్పించాలి. పరస్పర సహకారంతో బ్రిక్స్ దేశాలు మరింత అభివృద్ధి చెందాలన్నారు. ముఖ్యంగా అంతర్జాతీయంగా ఈనాడు మానవాళి ఎదుర్కొంటున్న పలు సమస్యలకు, ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఘర్షణలకు మనం పరిష్కారం చూపించాల్సి వుందన్నారు.

ప్రతి ఒక్కరి కన్నా ముందుండాలనే లక్ష్యంతోనే, ఆ ఆలోచనా క్రమంతోనే మనం పనిచేయాలన్నారు. మనం వేసే ప్రతి అడుగులోనూ మానవాభివృద్ధే కీలకం కావాలన్నారు. జీవితంలో మనం యువతగా కన్న కలలకు బాధ్యత కూడా తోడయ్యే దశ ఇదని అన్నారు. మానవ జీవితంలో 20 ఏళ్ళ వయస్సు అనేది పరిణితి చెందే దశ, నేడు బ్రిక్స్ కూడా సరిగ్గా ఇలాంటి పరిణితి చెందిన దశలోనే ఉంది. మనం ఒకరి దృక్పథాలను మరొకరం గౌరవించుకుంటూ, ఏకాభిప్రాయంతో ముందుకు సాగుతున్నాం. మన విధానం ఎవరికీ వ్యతిరేకం కాదు. అందరినీ కలుపుకుపోవడమే మన లక్ష్యం. బ్రిక్స్ దేశాల ఐక్యతను, ఏకాభిప్రాయాన్ని ఇప్పుడు ప్రపంచ వేదికపై స్పష్టమైన ఫలితాలుగా మార్చాల్సిన సమయం ఆసన్నమైందని ప్రధాని మోడీ పేర్కొన్నారు. రాబోయే 20ఏళ్ళకు సరికొత్త, ప్రతిష్ఠాత్మకమైన ఎజెండాను రూపొందించాలని బ్రిక్స్ దేశాలకు పిలుపునిచ్చారు. బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలు ఏటా మారుతున్నప్పటికీ, దానివల్ల మన అభివృద్ధికి ఆటంకం కలగరాదు, ఇందుకోసం మన ఒక ప్రత్యేకమైన పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. దీని వల్ల ఫలితాలను నిరంతరం పర్యవేక్షించడానికి వీలు కలుగుతుందన్నారు.

బ్రిక్స్‌ను మరింత బలోపేతం చేయడంతోపాటు, ప్రపంచ సంస్కరణల కోసం కూడా మనం మార్గాన్ని సుగమం చేయాలన్నారు. "ప్రస్తుత ప్రపంచ పాలనా విధానం (గ్లోబల్ గవర్నెన్స్) నిర్మాణం ఒక పిరమిడ్‌లా ఉంది. అధికారం, నిర్ణయాధికారాలు కేవలం పైనున్న కొన్ని దేశాల చేతుల్లోనే కేంద్రీకృతమై ఉన్నాయి. కింది శ్రేణిలో ఉన్న దేశాలు ఆ నిర్ణయాల వల్ల ప్రభావిత మవుతున్నప్పటికీ, వాటిని మార్చగల శక్తి వాటికి లేదు. అందుకే ఈ పద్ధతి మారాలి. ఇందుకోసం సంస్క రణలు చేపట్టాలి." అని మోడీ పేర్కొన్నారు. అంతర్జాతీయ ఆర్థిక సంస్థల్లో ఓటింగ్ అధికారాలు, నాయకత్వ పదవులు, విధాన ప్రాధాన్యతలనేవి ఆర్థిక వాస్తవికతలకు అనుగుణంగా వుండాలని స్పష్టం చేశారు.



## భారత సంతతి మహిళ దారుణ హత్య

- **అమెరికాలో దుర్ఘటన**
- **తనకు తాను కాల్చుకున్న నిందితుడు**

**వాషింగ్టన్, సెప్టెంబరు 13 :** అమెరికాలో భారత సంతతికి చెందిన మహిళ దారుణ హత్యకు గురయ్యారు. కాలిఫోర్నియాలోని శాక్రమెంటోలో నివాసముంటున్న 38 ఏళ్ల షాలినీ ఠాకూర్‌ను, గత ఏడాది కాలంగా వేధిస్తున్న ఓ యువకుడు నడిరోడ్డుపై కాల్చి చంపాడు. అనంతరం నిందితుడు కూడా తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘోర ఉదంతం స్థానికంగా తీవ్ర కలకలం సృష్టించింది. ఆర్డెన్ఆర్కేడ్ ప్రాంతంలోని పనేరా బ్రెడ్ రెస్టారెంట్ వెలుపల మంగళవారం ఈ ఘటన చోటుచేసుకుంది. 22 ఏళ్ల రోహిత్ అనే నిందితుడు షాలినీని వెంబడించి, అందరూ చూస్తుండగానే ఆమెపై పలుమార్లు కాల్పులు జరిపాడు. తీవ్ర గాయాలపాలైన ఆమె అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు.

హత్య అనంతరం నిందితుడు ఘటనా స్థలం నుండి పరారయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు హైవే50 వద్ద అతడిని గుర్తించి చుట్టుముట్టారు. ఆ సమయంలో రోహిత్ తన వద్దనున్న తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. నిందితుడిపై తాము ఎటువంటి కాల్పులు జరపలేదని పోలీసు అధికారులు స్పష్టం చేశారు. దాదాపు ఏడాది కాలంగా రోహిత్ తన కుమార్తెను నిరంతరం వేధిస్తున్నాడని షాలినీ తల్లి సుధేష్ కుమారి ఆవేదన వ్యక్తం చేశారు. తనను పెళ్లి చేసుకోవాలని రోహిత్ ఆమెపై తీవ్ర ఒత్తిడి తెచ్చాడని, అయితే వయసులో వ్యత్యాసం ఉండటంతో షాలినీ అందుకు నిరాకరించిందని తెలిపారు. అతడి వేధింపుల కారణంగా తన కుమార్తె గత కొంతకాలంగా తీవ్ర భయాందోళనల మధ్య గడిపిందని ఆమె కన్నీటిపర్యంతమయ్యారు.

## కుంచించుకుపోయిన బుధుడు

- **గత అంచనాల కంటే 30 శాతం అధికంగా సంకోచం**
- **శాస్త్రవేత్తల తాజా అధ్యయనం వెల్లడి**
- **23 కిలోమీటర్ల వరకు తగ్గి ఉండొచ్చని అంచనా**

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 13 (ఎ.ఎం.ఎస్):** సౌర కుటుంబంలో అతి చిన్న గ్రహమైన బుధుడు గతంలో భావించిన దానికంటే మరింతగా కుంచించుకుపోయి ఉండొచ్చని తాజా శాస్త్రీయ అధ్యయనం వెల్లడించింది. గ్రహం లోపలి భాగం క్రమంగా చల్లబడటం వల్ల ఏర్పడిన సంకోచానికి సంబంధించిన అనేక భౌగోళిక ఆనవాళ్లు ఉల్కాపాతం వల్ల ఏర్పడిన భారీ శిథిలాల కింద దాగిపోయి ఉండవచ్చని పరిశోధకులు గుర్తించారు. దీంతో బుధుడి వ్యాసం ఇప్పటివరకు అంచనా వేసిన దానికంటే 30 శాతం ఎక్కువగా, గరిష్ఠంగా 23 కిలోమీటర్ల వరకు తగ్గి ఉండొచ్చని వారు చెప్తున్నారు.

సౌర కుటుంబంలోని అతి చిన్న, సూర్యుడికి అత్యంత సమీపంలో ఉన్న బుధ గ్రహం అది ఏర్పాటైన నాటి నుంచి క్రమంగా కుంచించుకుపోతూనే ఉందని శాస్త్రవేత్తలు ఇప్పటికే గుర్తించారు. అయితే ఈ సంకోచం గత అంచనాల కంటే మరింత ఎక్కువగా ఉండొచ్చని తాజా అధ్యయనం వెల్లడించింది. బుధుడి వ్యాసం ఏకంగా 23 కిలోమీటర్ల వరకు తగ్గి ఉండొచ్చనీ, ఇది గత లెక్కల కంటే సుమారు 30 శాతం అధికమని పరిశోధకులు తెలిపారు. జియోఫిజికల్ రీసెర్చ్ లెటర్స్ పత్రికలో ప్రచురితమైన ఈ అధ్యయనం బుధుడి ఉపరితలంపై ఉన్న సంకోచ ఆనవాళ్లను కొత్త కోణంలో పరిశీలించింది. సుమారు 4,900 కిలోమీటర్ల వ్యాసం మాత్రమే ఉన్న బుధ గ్రహానికి 23 కిలోమీటర్ల సంకోచం కూడా గణనీయమైన మార్పేనని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. బుధ గ్రహం సుమారు 450 కోట్ల సంవత్సరాల క్రితం ఏర్పడింది. అప్పటి నుంచి దాని లోపల ఉన్న భారీ, వేడిగా ఉండే ఇనుప కేంద్రకం క్రమంగా చల్లబడుతోంది. వేడి తగ్గడంతో కేంద్రకం సంకోచించగా, దాని ప్రభావం గ్రహంలోని మాంటిల్, ఉపరితల పొరలపై పడుతోంది. దీంతో బుధుడి బయటి పొరలు బిగుసుకుపోయి, ఉపరితలంపై ముడతలు, పగుళ్లు, ఇతర భౌగోళిక నిర్మాణాలు ఏర్పడుతున్నాయి.

అయితే బుధుడి ఉపరితలం అత్యంత గరుకుగా, అనేక భారీ గుంతలతో నిండి ఉండటం వల్ల ఈ సంకోచానికి సంబంధించిన కొన్ని ఆనవాళ్లు స్పష్టంగా కనిపించకుండా పోయాయని తాజా పరిశోధన వివరిస్తోంది. ముఖ్యంగా గ్రహశకలాలు, ఇతర ఖగోళ వస్తువులు ఢీకొనడంతో ఏర్పడిన పెద్ద గుంతల నుంచి ఎగిసిపడిన శిథిలాలు కొన్ని ప్రాంతాలను కప్పివేసి ఉండవచ్చని పరిశోధకులు భావిస్తున్నారు. ఈ అధ్యయనానికి నాయకత్వం వహించిన గాకు నిషియామా బృందం బుధుడిపై ఉన్న పగుళ్లు, సంకోచానికి సంబంధించిన ఇతర భౌగోళిక నిర్మాణాల మ్యాప్‌లను తాజా ఉపరితల గరుకుదనం మ్యాప్‌లతో పోల్చింది. అత్యంత గరుకుగా ఉన్న ప్రాంతాల్లో సంకోచం వల్ల ఏర్పడిన ముడతలు, ఇతర నిర్మాణాలు తక్కువగా కనిపించాయని వారు గుర్తించారు. దీంతో అక్కడ సంకోచ ఆనవాళ్లు అసలు లేవని కాకుండా, పెద్ద గుంతల నుంచి వచ్చిన శిథిలాల కింద అవి దాగిపోయి ఉండవచ్చనే నిర్ధారణకు వచ్చారు. ఈ దాగిపోయిన ప్రాంతాలను కూడా లెక్కలోకి తీసుకున్న తర్వాత బుధుడు ఇప్పటివరకు భావించిన దానికంటే ఎక్కువగా కుంచించుకుపోయి ఉండొచ్చని పరిశోధకులు అంచనా వేశారు.

ఈ పరిశోధన ప్రాధాన్యం మరింత పెరగడానికి మరో కారణం



కూడా ఉంది. యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ, జపాన్ స్పేస్ ఏజెన్సీలు సంయుక్తంగా చేపట్టిన బెపికొలంబో అంతరిక్ష మిషన్ త్వరలో బుధుడి కక్ష్యలోకి ప్రవేశించనుంది. ఇటీవలే ఈ వ్యోమనౌక బుధుడికి మరింత చేరువైంది. నవంబర్‌లో బుధుడి కక్ష్యలోకి ప్రవేశించిన తర్వాత ఈ మిషన్‌కు చెందిన రెండు వ్యోమనౌకలు విడిపోయి గ్రహంపై మరింత విస్తృత పరిశీలనలు చేపట్టనున్నాయి. బెపికొలంబో మిషన్‌లో భాగమైన నిషియామా మాట్లాడుతూ... వ్యోమనౌకలోని లేజర్ పరికరాలు బుధుడు వాస్తవానికి ఎంత మేరకు కుంచించుకుపోయాడో మరింత కచ్చితంగా తెలుసుకునేందుకు సహాయపడతాయని తెలిపారు. గతంలో నాసాకు చెందిన మెసెంజర్ వ్యోమనౌక 2010లలో బుధుడిని పరిశీలించి కీలక సమాచారం అందించింది. అంతకుముందు 1970లలో నాసా మారినర్ 10 వ్యోమనౌక మాత్రమే బుధుడిని సందర్శించింది. మెసెంజర్ సేకరించిన సమాచారంతో చేసిన అంచనాల కంటే కూడా బుధుడి సంకోచం ఎక్కువగా ఉండే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. బెపికొలంబో నుంచి అందనున్న తాజా పరిశీలనలు ఈ అంశంపై మరింత స్పష్టత ఇవ్వనున్నాయి.

బుధుడు ఎలా ఏర్పడ్డాడు? కాలక్రమంలో దాని లోపలి భాగంలో ఎలాంటి మార్పులు జరిగాయి? దాని ఉపరితలం ఎందుకు ఇలా ముడతలు పడింది? వంటి ప్రశ్నలకు తాజా అధ్యయనం, బెపికొలంబో మిషన్ కలిసి సమాధానాలు అందించే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. "బుధుడి పరిణామానికి సంబంధించిన వాస్తవిక చిత్రానికి మేము మరింత దగ్గరవుతున్నామనే ఉత్సాహం ఉంది" అని గాకు నిషియామా వివరించారు. బెపికొలంబో నుంచి అందనున్న తాజా సమాచారం బుధుడు ఎంత మేరకు కుంచించుకుపోయాడో మాత్రమే కాకుండా, దాని లోపలి నిర్మాణం, కోట్లాది సంవత్సరాల పరిణామ గాథపై కూడా కొత్త విషయాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

## లాస్ ఏంజిల్స్ లో రెచ్చిపోయిన అల్లరిమూకలు

**వాషింగ్టన్, సెప్టెంబరు 17 :** అమెరికాలోని లాస్ ఏంజిల్స్‌లో అల్లరిమూకలు రెచ్చిపోయారు. రూ.50 కోట్లు విలువైన 'వేమో' సెల్ఫ్ డ్రైవింగ్ కార్లకు నిప్పుపెట్టారు. నిరసనల వేళ విరుచుకుపడి విండ్‌స్క్రీన్‌లు పగలగొట్టి, గ్రాఫిటీ రాసి తగలబెట్టారు. భద్రతా కారణ దృష్ట్యా గూగుల్ మాతృ సంస్థ 'ఆల్ఫాబెట్' సర్వీసులను రద్దు చేసింది. అల్లరిమూకలను గుర్తించేందుకు లాస్ ఏంజిల్స్ పోలీసులు సీసీటీవీ దృశ్యాలను విశ్లేషిస్తున్నారు.

## పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**నేషనల్ డిఫెన్స్ అకాడమీ పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించిన కలెక్టర్**

**హనుమకొండ, సెప్టెంబర్ 13 (వుదయం జిల్లా ప్రతినిధి) :**

హనుమకొండ సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నావల్ అకాడమీ పరీక్ష ఆదివారం ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు జరిగే పరీక్ష ప్రారంభం కాగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి పరిశీలించారు. యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో పరీక్షల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షా కేంద్రంలో పరీక్ష జరుగుతున్న తీరును కలెక్టర్ పరిశీలించారు. పరీక్ష రాసేందుకు ఎంతమంది అభ్యర్థులు హాజరయ్యారని జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పరీక్ష నిర్వహణ తీరును, పటిష్ట ఏర్పాట్లను, పరీక్షా కేంద్రంలో కల్పించిన తాగునీరు, విద్యుత్, తదితర సదుపాయాలను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పరీక్షా నిర్వహణకు సంబంధించి నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ, ప్రశాంత వాతావరణంలో పరీక్షల నిర్వహణ సమర్థవంతంగా కొనసాగించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి, అదనపు తహసిల్దార్ రవి, ఇతర అధికారులు ఉన్నారు.

## ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టే ప్రసక్తే లేదు: కొండా దంపతులు



**రాబోయే ఎన్నికల్లో వరంగల్ ఈస్ట్ టికెట్ నాదే: కొండా సురేఖ**

**వరంగల్, సెప్టెంబర్ 13 (వుదయం ప్రతినిధి) :**

వరంగల్ లోని ఎం కె నాయుడు హోటల్‌లో వరంగల్ తూర్పు నియోజకవర్గ కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తలు, అభిమానులతో మాజీ మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి ఆదివారం రోజున విస్తృత సమావేశం నిర్వహించారు. మంత్రి పదవి నుంచి సురేఖను తొలగించిన తర్వాత తొలిసారిగా నిర్వహించిన సమావేశానికి కాంగ్రెస్ పార్టీ మాజీ కార్పొరేటర్లు, నియోజకవర్గ ముఖ్య నేతలు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. ఎమ్మెల్సీ కొండా మురళి మాట్లాడుతూ.. కొండా సురేఖను సారీ చెప్పాలని కొందరు సూచించినప్పటికీ, పదవి ఉన్నా లేకున్నా ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. "కొండా సురేఖ గెలుపు వెనుక రాహుల్ గాంధీ పాత్ర ఉంది. రాహుల్ గాంధీని ప్రధానిగా చేయడమే మా ప్రధాన లక్ష్యం. పదవులు వస్తుంటాయి, పోతుంటాయి, కృతజ్ఞత అనేది మా రక్తంలో కుటుంబంలో ఉంది. మేము ఎట్టి పరిస్థితుల్లోనూ కాంగ్రెస్ పార్టీని వీడేది లేదు" అని తేల్చిచెప్పారు. అనంతరం మాజీ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. పదవి నుంచి తొలగించిన తర్వాత ఆందోళనలు చేయాలని కొందరు కార్యకర్తలు కోరినప్పటికీ, పార్టీ అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉండాలని నచ్చజెప్పినట్లు తెలిపారు. నా మాట విని పార్టీకి కట్టుబడిన కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. ప్రస్తుత రాజకీయాల్లో అవకాశవాదం ఎక్కువైందని, ఉదయం ఒక పార్టీలో ఉండి సాయంత్రానికి మరో పార్టీలోకి మారే సంస్కృతి పెరిగిందని విమర్శించారు. "గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి కోసం మంత్రి పదవికి రాజీనామా చేశాను. ఎలాంటి మచ్చ లేకుండా పదవి నిర్వహించాను" అని వివరించారు.
వచ్చే ఎన్నికల్లో వరంగల్ తూర్పు నుంచే పోటీ అకారణంగా తనను పదవి నుంచి తొలగించారనే వేదన ఉందని, అయితే పదవి అనేది కేవలం ఒక అలంకారం మాత్రమేనని అన్నారు. త్వరలో జరగబోయే గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో వరంగల్ తూర్పు పరిధిలోని 24 డివిజన్లను గెలుచుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో వంద శాతం కాంగ్రెస్ టికెట్ నాకే వస్తుందని, వరంగల్ తూర్పు నుంచే పోటీ చేసి గెలుస్తానని స్పష్టం చేశారు.
చివరగా సోనియా గాంధీ, రాహుల్ గాంధీ నాయకత్వం వర్ధిల్లాలని వారు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ కార్పొరేటర్లు, ముఖ్య కార్యకర్తలు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వెంకన్న మూడ్ కు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి ఆచార్య పట్టా




**రాఘవాపురం తండా బిడ్డ అరుదైన ఘనత - మోతె మండలంలో తొలిసారి**

**సూర్యాపేట, సెప్టెంబర్ 13 (వుదయం ప్రతినిధి):**

సూర్యాపేట జిల్లా మోతె మండలం రాఘవాపురం నాలుగు రహదారుల కూడలి తండాకు చెందిన వెంకన్న మూడ్ కు ఎంతో పేరుగాంచిన ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి విద్యుత్తు ప్రసార తంత్ర జ్ఞాన శాస్త్ర విభాగంలో పరిశోధన పట్టా లభించింది. ఆదివారం ఆయన జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఇటీవల హైదరాబాద్ లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరిగిన పట్టభద్రుల వేడుకలో తెలంగాణ రాష్ట్ర అధిపతి, ఉస్మానియా విశ్వవిద్యాలయ ముఖ్య పాలకుని చేతుల మీదుగా పట్టాను అందుకున్నట్లు తెలిపారు.
ఆచార్యుడు పి చంద్రశేఖర్ పర్యవేక్షణలో "రిస్క్ గొట్టపు నిర్మాణంపై బహుళ దశల సమాంతరతపై ఏసిప్ రూపకల్పన" అనే అంశంపై పరిశోధన పూర్తి చేసి పట్టా సాధించినట్లు తెలిపారు. ఆయన సాధించిన ఈ గొప్ప విజయం కుటుంబ సభ్యులతో పాటు రాఘవాపురం నాలుగు రహదారుల కూడలి తండాకు, మోతె మండలానికి ఎంతో గర్వకారణమని పలువురు గిరిజన నాయకులు తెలిపారు.
వ్యవసాయ కుటుంబం నుండి వచ్చి పట్టా సాధించడం వెనుక కుటుంబ సభ్యుల తోడ్పాటు, మిత్రులు, తోటివారు, శ్రేయోభిలాషుల ప్రేరణే కారణమని వారు పేర్కొన్నారు. రాఘవాపురం నాలుగు రహదారుల కూడలి తండా, మోతె మండలం నుండి ఈ విభాగంలో పట్టా సాధించిన తొలి వ్యక్తిగా వెంకన్న నిలిచారని తెలిపారు. అనంతరం పలువురు దుశ్శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

## ఎస్ ఐ ఆర్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి



**అధికారులకు కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశం**

**కరీంనగర్, సెప్టెంబర్ 13 (వుదయం ప్రతినిధి) :**

సర్ ప్రక్రియను అధికారులు సిబ్బంది పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలో ఒక్క అనర్హుడికి చోటు లేకుండా.. ఒక్క అర్హుడి పేరు గల్లంతు కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా స్పష్టం చేశారు. ఓటర్ల జాబితాను దోషరహితంగా, పారదర్శకంగా రూపొందించేందుకు చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (SIR2026) ప్రక్రియను ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పకడ్బందీగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఓటర్ల వివరాల పరిశీలనలో ఏమాత్రం పొరపాట్లకు తావివ్వకుండా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు. ఓటర్ల జాబితాలో గుర్తించిన వ్యత్యాసాలు, అన్‌మ్యాప్డ్ ఓట్లు, ఇతర మార్పులకు సంబంధించి సంబంధిత ఓటర్లకు అవసరమైన నోటీసులను వెంటనే అందజేయాలని బిఎల్ఓలను ఆదేశించారు. నోటీసుల అనంతరం చేపట్టే క్షేత్రస్థాయి విచారణలను పారదర్శకంగా నిర్వహించి, సంబంధిత నివేదికలను నిర్ణీత గడువులోగా సమర్పించాలని సూచించారు. జిల్లాలో రెండు లక్షల 70 వేల మందికి దరఖాస్తులు అందించాల్సి ఉండగారు 2,24,263 మంది ఓటర్లకు నోటీసులు అందించామని తెలిపారు.. దాదాపు లక్ష మంది వరకు నోటీసులకు సమాధానాలు ఇచ్చినట్లు తెలిపారు. నోటీసులు అందుకున్న ఓటర్లు తమ ఓటు హక్కును నిర్ధారించుకునేందుకు ఎన్నికల సంఘం గమనికలో సూచించిన గుర్తింపు కార్డులను అధికారులకు సమర్పించాలన్నారు.
దరఖాస్తులు పెండింగ్‌లో ఉండొద్దు
కొత్త ఓటర్ల నమోదుకు సంబంధించిన ఫారం6, ఓటర్ల జాబితాలో పేరు తొలగింపు లేదా ఆక్షేపణలకు ఫారం 7, పేరు, చిరునామా తదితర వివరాల మార్పులు, సవరణలకు ఫారం8 ద్వారా వచ్చిన దరఖాస్తులను ఎలాంటి పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిశీలించాలని తహశీల్దార్లను కలెక్టర్ ఆదేశించారు. నిబంధనల ప్రకారం వాటిని పరిష్కరించి, అర్హత ఉన్న ప్రతి దరఖాస్తుదారుడికి న్యాయం జరిగేలా చూడాలని స్పష్టం చేశారు. ప్రత్యేక ప్రచార దినాల్లో స్వీకరించిన దరఖాస్తులను కూడా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల నుంచి అందిన దరఖాస్తులు,
అభ్యర్థనలు, సవరణలకు సంబంధించిన వివరాలను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం తదుపరి చర్యలు చేపట్టాలని తెలిపారు.
బిఎల్ఓ ల పనిపై క్రాస్ వెరిఫికేషన్
బిఎల్ఓ, సూపర్‌వైజర్లు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తూ బిఎల్ఓ లు నిర్వహించిన పనులను క్రాస్ వెరిఫికేషన్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఓటర్ల వివరాల పరిశీలన, అన్‌మ్యాప్డ్ ఓట్ల గుర్తింపు, నోటీసుల జారీ, దరఖాస్తుల పరిష్కారం వంటి ప్రతి దశలోనూ పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ఎన్నికల విధుల్లో అలసత్వం లేదా నిర్లక్ష్యం వహించే వారిపై నిబంధనల ప్రకారం క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు.
ప్రతి ఓటరూ జాబితాను పరిశీలించుకోవాలి
ఓటర్ల జాబితా సవరణలో అధికారుల పాత్రతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. 18 ఏళ్లు నిండిన అర్హులైన యువతతో పాటు ప్రతి ఓటరూ తమ పేరు ఓటర్ల జాబితాలో ఉందో లేదో పరిశీలించుకోవాలని కోరారు. పేరు, చిరునామా, ఇతర వివరాల్లో ఏవైనా తప్పులు లేదా మార్పులు ఉంటే వెంటనే ఎన్నికల సిబ్బంది దృష్టికి తీసుకురావాలని సూచించారు.
కొత్తగా ఓటరు నమోదుకు ఫారం6, పేరు తొలగింపు లేదా ఆక్షేపణలకు ఫారం7, వివరాల మార్పులు, సవరణలకు ఫారం 8 ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తులను సమర్పించుకోవచ్చని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండటం.. అనర్హుల పేర్లు తొలగించడం.. నమోదైన వివరాల్లో తప్పులు లేకుండా చూడటమే SIR ప్రక్రియ లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు. అధికారులు, ఎన్నికల సిబ్బంది సమన్వయంతో పనిచేస్తేనే దోషరహిత, పారదర్శక ఓటర్ల జాబితా సాధ్యమవుతుందని, అందుకు ఓటర్లు కూడా తమ వివరాలను పరిశీలించుకుని సహకరించాలని కోరారు. SIR ప్రక్రియ పూర్తయ్యే వరకు ఇదే స్థాయిలో అప్రమత్తంగా పనిచేయాలని అట్టి ప్రకటన లో వెల్లడించారు.

## జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ జాతీయ లోక్ అదాలత్



**యాదాద్రి భువనగిరి జిల్లా, సెప్టెంబర్13(వుదయం):.**

జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా జిల్లాలోని అన్ని కోర్టులలో శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో భోనగిరి కోర్టు ఆవరణలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ అధ్యక్షులు జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీ ఎ. జయరాజు వారి సూచనలతో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయమూర్తి మాట్లాడుతూ ఈ సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా మూడవ జాతీయ లోక్ అదాలత్ ను నిర్వహిస్తున్నట్లు, ఈ లోక్ అదాలత్ లో 8 సివిల్ కేసులు, క్రిమినల్ కేసులు, ట్రాఫిక్ చలాన కేసులు మొత్తంగా 2541, 101 పి ఎల్ సి కేసులు, ఇచాలాన కేసులు 15873 మొత్తంగా 18523 కేసులు పరిష్కరింబడ్డాయని, జిల్లాలోని న్యాయమూర్తులు, న్యాయవాదులు, జిల్లా పోలీసు యంత్రాంగం, కోర్టు సిబ్బంది కృషిచేసారని, కొన్ని కేసులలో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా కూడా బాధితులను ప్రవేశపెట్టి కేసులును పరిష్కరించినట్లు తెలిపి నవంబర్ 21వ తేదిన చెక్ బౌన్స్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక లోక్ అదాలత్నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ లోక్ అదాలత్ కార్యక్రమములో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి వి. మాధవి లత, ఇంచార్జి మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి మిలింద్ కాంబ్లి అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఆరిఫ్, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి జి. స్వాతి, రెండవతరగతి మేజిస్ట్రేట్ జ్యోతిరావు, భువనగిరి బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్. విద్యాసాగర్, కార్యదర్శి యాదగిరి,లోక్ అదాలత్ సభ్యులు, న్యాయవాదులు, పోలీస్ యంత్రాంగం, కక్షిదారులు పాల్గొన్నారు.

## భారతీయ సంస్కృతిని, ప్రపంచవ్యాప్తంగా. విస్తృత పర్చేందుకు సాంస్కృతిక సహకార, స్నేహ సంఘం ఇస్కఫ్ కృషి



**హైకోర్టు న్యాయవాది, ఇస్కఫ్ రాష్ట్ర అధ్యక్షులు కడారు ప్రభాకర్ రావు**

**నల్గొండ జిల్లా వుదయం ప్రతినిధి సెప్టెంబర్ 13**

నల్గొండ పట్టణ కేంద్రంలో ఐఎంఏ హాల్లో ఇస్కఫ్ నల్గొండ జిల్లా మహాసభలు డాక్టర్ ఏ సి హెచ్ పుల్లారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన బ్రిక్స్ దేశాలు ఆంధ్ర రాజ్యాల దురాక్రమలను ప్రశ్నించడం ను హర్షించారు. అభివృద్ధి చెందుతున్న దేశాలకు సైతం అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ, ప్రపంచ బ్యాంకులలో తగిన స్థానం కోరటం సహితమైనది కాదన్నారు. గత 80 సంవత్సరాలుగా ఇస్కాఫ్ దేశ సమైక్యత, సమగ్రత కోసం కృషి చేస్తుందన్నారు. ఇటీవల వెనుజుల అధ్యక్షులు మదురోని అక్రమంగా అమెరికా సైన్యం అరెస్టు చేసి న్యూయార్క్ జైల్లో నిర్బంధించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఐ ఏ ఎల్ రాష్ట్ర నాయకులు, ప్రముఖ న్యాయవాది మల్లెపల్లి ఆదిరెడ్డి మాట్లాడుతూ ఇరాన్ పై అకారణంగా అమెరికా యుద్ధం ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండించారు. అంతర్జాతీయంగా ప్రపంచ దేశాల శాంతి అలీన ఉద్యమ బలోపేతం, పాలస్తీనా, ఇరాక్ సరిహద్దు వివాదాల వంటి వాటిపై ఇస్కాఫ్ పోరాడిందన్నారు. ఈ కార్యక్రమంలో ఇస్కాఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ గోపాల్, వర్కింగ్ ప్రెసిడెంట్ పి దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షులు కారింగు బిక్షమయ్య, కరీం, కోశాధికారి అవ్వ విజయలక్ష్మి ,న్యాయవాదులు మునగాల నారాయణరావు, గుండె వెంకటేశ్వర్లు, కట్ట అనంతరెడ్డి, కస్తాల సర్పంచ్ ఎల్. సత్యం, ఐఎంఏ పట్టణ అధ్యక్షులు ఆర్ రమేష్ తదితరులు ప్రసంగించారు. అనంతరం ఇస్కాఫ్ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షులుగా ప్రముఖ న్యాయవాది మల్లెపల్లి ఆదిరెడ్డి, జిల్లా అధ్యక్షులుగా డాక్టర్ ఏ సి హెచ్ పుల్లారావు, ప్రధాన కార్యదర్శిగా కస్తాల సర్పంచ్ ఎల్. సత్యం, కోశాధికారిగా బి రామలింగం లతో పాటు 35 మందితో జిల్లా కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు

## ఏజెన్సీ ప్రాంత ఆదివాసీ గిరిజన కుటుంబాలకు వినాయక చవితి పండుగ శుభాకాంక్షలు



**ఐటీడీఏ పీవో బి. రాహుల్, సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట**

**భద్రాచలం 13 సెప్టెంబర్ (వుదయం ప్రతినిధి:**

ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసీ గిరిజన గ్రామాలలో నివసిస్తున్న గిరిజన కుటుంబాలతో పాటు వివిధ గిరిజన గ్రామాలలో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది, రెవెన్యూ మరియు గిరిజన సంక్షేమ శాఖల ఉద్యోగులు, గిరిజన విద్యార్థినీ విద్యార్థులు, ఐటీడీఏ, సబ్ కలెక్టర్ కార్యాలయాలలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బందికి వినాయక చవితి పండుగ సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట ఆదివారం సంయుక్తంగా ఒక ప్రకటనలో తెలిపారు. వినాయక చవితి పండుగను ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు. విఘ్నాలను తొలగించి, ప్రజలకు జ్ఞానం, ఆరోగ్యం, సుఖసంతోషాలు ప్రసాదించే విఘ్నేశ్వరుడిని భక్తిశ్రద్ధలతో పూజించడం మన సంప్రదాయంలో ఎంతో విశిష్టమైనదని పేర్కొన్నారు. కులమతాలకు, ప్రాంతీయ తారతమ్యాలకు అతీతంగా ప్రజలందరూ ఐకమత్యంతో, పరస్పర స్నేహ భావంతో పండుగను జరుపుకోవాలని వారు సూచించారు. ఇంటిల్లిపాది కలిసి నియమనిష్ఠలతో గణనాథుడిని పూజిస్తూ కుటుంబ సభ్యులందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని వారు ఆకాంక్షించారు. ఏజెన్సీ ప్రాంతంలోని ప్రతి గిరిజన గ్రామంలో పండుగ వాతావరణం నెలకొని, ప్రజలందరి జీవితాల్లో వినాయకుడి ఆశీస్సులతో కొత్త ఉత్సాహం, ఆనందం నిండాలని వారు కోరుకున్నారు. విద్యార్థినీ విద్యార్థులు కూడా విద్యాభ్యాసంలో ఉన్నత శిఖరాలను అధిరోహించి, తమ తల్లిదండ్రులకు, గురువులకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.
అధికారులు, ఉద్యోగులు తమ విధులను నిర్వర్తించడంతో పాటు పండుగ సందర్భంగా ప్రజలకు అందుబాటులో ఉండి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సహకారం అందించాలని వారు సూచించారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి, పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తూ ప్రకృతికి హాని కలగకుండా పండుగను జరుపుకోవాలని వారు పిలుపునిచ్చారు. గణేష్ మండపాల వద్ద శాంతిభద్రతలు, పరిశుభ్రత, విద్యుత్ భద్రత వంటి అంశాలపై నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భక్తులు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా పరస్పర సహకారంతో పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని తెలిపారు. విఘ్నేశ్వరుడి కృపతో ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసీ గిరిజన కుటుంబాలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆరోగ్యం, శాంతి, అభివృద్ధి వెల్లివిరియాలని వారు ఆకాంక్షించారు. గిరిజన గ్రామాల్లో ప్రజల మధ్య సోదరభావం, ఐక్యత మరింత బలపడాలని, ప్రతి కుటుంబం సంతోషంగా ఉండాలని కోరుకుంటూ ఏజెన్సీ ప్రాంత ప్రజలందరికీ మరోసారి వినాయక చవితి పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు ఐటీడీఏ పీవో బి. రాహుల్, సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట తెలిపారు.

## వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో, ప్రశాంతంగా జరుపుకోవాలి : కలెక్టర్ సత్య శారద



**వరంగల్ జిల్లా సెప్టెంబర్ 13. (వుదయం) :**

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద జిల్లా ప్రజలకు, ప్రజాప్రతినిధులు, అధికారులు, మీడియా ప్రతినిధులకు శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి, సౌభాగ్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కోరారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, మట్టి గణపతి విగ్రహాలను ఏర్పాటు చేసి పూజించాలని సూచించారు. పర్యావరణానికి హాని కలిగించే విగ్రహాలు, రసాయనిక రంగుల వినియోగాన్ని నివారించాలని కోరారు. విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో జిల్లాలో పంటలు సమృద్ధిగా పండి రైతులు సుభిక్షంగా ఉండాలని కలెక్టర్ ఆకాంక్షించారు. పండుగ వేడుకలను ప్రశాంత వాతావరణంలో, పరస్పర సహకారంతో నిర్వహిస్తూ నిబంధనలు పాటించాలని, సమాజంలో సోదరభావం, ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు.

## రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ శాపం పట్టుకుంది



**మాజీ మంత్రి జగదీష్ రెడ్డి**

**నల్గొండ జిల్లా వుదయం వార్త ప్రతినిధి సెప్టెంబర్ 13**

నల్లగొండ పట్టణ కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి. సూర్యాపేట జగదీష్ రెడ్డి సాగర్ ఆయకట్టు కింద పూర్తి స్థాయిలో మొత్తం నాట్లు వేయండి... రైతులారా నీళ్ల కోసం మిము పేగులు తెగే దాకా కొట్లాడుతాం. పంటలకు నీళ్లు ఇచ్చి తీరాలి.. ఎడమ కాల్వకు ,వరద కాల్వకు ఏ ఎమ్ పి ఆర్ కింద,లో లెవల్ కింద ఎస్ ఎల్ బి సి కింద మొత్తం ఆయకట్టు కు నీళ్లు ఇవ్వాల్సిందే.. లేదంటే బరాబర్ కొట్లాడుదాం... ఎట్లా నీళ్లు ఇవ్వరో చూస్తాం,,ఈ ప్రభుత్వం అంతు చూస్తాం...ఖబడ్దార్ ముఖ్యమంత్రి మా నీళ్లు మాకు ఇవ్వాలి... వీల్లు దున్నపోతుల లాగా నిద్ర పోతున్నారు.. మంత్రులకు సోయి లేదు.. ఇక బడిత పూజ చేయాలి.. తెగించి కొట్లాడాలి 200 టీఎంసీలు లు శ్రీశైలం లో నాగార్జున లో మన నీళ్లు ఉన్నయ్...ఆ నీళ్లు మనవే... మన హక్కు.. ఆ నీళ్లు మాకు ఇయ్యాలి. కేసీఆర్ కేటీఆర్ నాయకత్వం లో ఎంత వరకు అయినా కోటాడుతాం....పేగులు తెగే దాకా కొట్లాడుదాం..ఆంధ్ర నీటి దోపిడిపై ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం కె ఆర్ ఎం బి కి లేఖ కూడా రాయలేదు... ప్రభుత్వం కి ఎలాంటి భాద్యత లేదు....వెలిగొండ ప్రాజెక్టు ద్వారా పోతిరెడ్డి ద్వారా చేస్తున్న నీటి దోపిడీని అరికట్టాలి అని కె ఆర్ ఎం బి కి లేఖ రాయాలి. ఈ చేతకాని దద్దమ్మల వల్ల వ్యవసాయం ఆగం అయింది. సాగర్ ఆయకట్టు కింద వెంటనే నీటి విడుదల షెడ్యూల్ విడుదల చేయండి.. ఎడమ కాల్వకు ఏప్పటివరకు నీరు ఇస్తారో ప్రభుత్వం స్పష్టం చేయాలి. ఇప్పటికే ప్రకటించారు.. పాదయాత్ర చేస్తామని.. ఎడమ కాల్వకు షెడ్యూల్ ప్రకటించకపోతే కేటీఆర్ పాదయాత్ర చేస్తారు.ఇర్రిగేషన్ మంత్రి ఉత్తమ్ కల్వకుర్తి లిఫ్ట్ ప్రారంభం చేస్తే భట్టి విక్రమార్క నెమో అక్కడ కరంట్ కట్ చేస్తున్నాడు... కరంట్ బిల్స్ కట్టలేక కల్వకుర్తి లిఫ్ట్ బంద్ చేశారు.. ఎంత దుర్మార్గం ఇది.. మహబూబ్నర్ జిల్లా కు ఉరి వేశారు...ఇర్రిగేషన్ లిఫ్ట్ లకు నీళ్లు ఇయ్యలేని దద్దమ్మ ఈ ముఖ్యమంత్రి...ఈ జిల్లా మంత్రులకు భాద్యత లేదు..వీళ్లకు నీళ్ల గురించి తెలియదు...కోమటిరెడ్డి కి అయితే కనీస అవగాహన లేదు.. అన్ని కమిషన్ లు,కాంట్రాక్టు లే ఆయన పని...మా హయాంలో ఉదయ సముద్రం కళకళలాడేలా చేసామ్... ఇప్పుడు పడావు పడింది.. కాంగ్రెస్ వచ్చింది రైతులకు ఉరి వేశారు. తెలంగాణ లో వ్యవసాయం మొత్తం సర్వనాశనం అయిందిమాజీ మంత్రి జగదీష్ రెడ్డ ఏఎంసీ మాజీ చైర్మన్ చీరా పంకజ్ యాదవ్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి నిరంజన్ వలి, జిల్లా గ్రంథాలయ మాజీ మాజీ మల్లికార్జున రెడ్డి, సింగం రామ్మోహన్ నగర పార్టీ అధ్యక్షులు బోనగిరి దేవేందర్ తిప్పర్తి మండల పార్టీ అధ్యక్షుడు పల్ రెడ్డి రవీందర్ రెడ్డి కార్పొరేటర్లు మారగోని భవాని గణేష్ పెరిక యాదయ్య, దొడ్డి రమేష్, మాజీ కౌన్సిలర్ రావుల శ్రీనివాస్ రెడ్డి, జమాల్ ఖాద్రి మాజీ ఎంపీపీ బొజ్జ వెంకటయ్య, ఏ కన్నారావు కాసం శేఖర్, గుండెబోయిన జంగయ్య గంజి రాజేందర్ పెండం ధనుంజయ, తదితరులు ఉన్నారు

## పరీక్షల రాష్ట్ర పరిశీలకులను మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా కలెక్టర్



**హనుమకొండ టౌన్, సెప్టెంబర్ 13 (వుదయం ప్రతినిధి) :**

జిల్లాలోని యూనివర్సిటీ ఆర్ట్స్ సైన్స్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నావల్ అకాడమీ, వడ్డేపల్లి లోని పింగిలి ప్రభుత్వ బాలికల డిగ్రీ పీజీ కళాశాలలో నిర్వహించే కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ పరీక్షల రాష్ట్ర పరిశీలకులుగా నియమితులైన కేకేవిన్ సురేష్ బాబును హనుమకొండలోని హోటల్ హరిత కాకతీయ వద్ద హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పరీక్ష కేంద్రాలలో నిర్వహణ ఏర్పాట్లకు సంబంధించిన అంశాలపై చర్చించారు.

## పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులనే ప్రతిష్ఠించాలి



**– జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**

**హనుమకొండ, సెప్టెంబర్ 13 (వుదయం జిల్లా ప్రతినిధి) :**

వినాయక చవితి వేడుకల్లో పర్యావరణ హితమైన మట్టి వినాయక విగ్రహాలనే ప్రతిష్టించి ప్రకృతి వనరులను కాపాడాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదివారం మున్సిపల్ గెస్ట్ హౌస్ సమీపంలో శివకుమార్ అనే వ్యక్తి ఏర్పాటు చేసిన మట్టి గణపతి విగ్రహాల స్టాల్‌ను కలెక్టర్ సందర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.
ఈ సందర్భంగా తయారీ విధానాన్ని పరిశీలించిన కలెక్టర్, గత 12 ఏళ్లుగా విగ్రహాలను తయారు చేస్తున్న శివకుమార్‌ను అభినందించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... చెరువు మట్టితో చేసిన విగ్రహాల వల్ల పర్యావరణానికి హాని ఉండదని, నిమజ్జనం తర్వాత ఆ మట్టిని చెట్లకు, పొలాలకు వాడుకోవచ్చని తెలిపారు. మట్టి విగ్రహాలపై ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణకు కృషి చేసే వారికి జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేస్తూ, పర్యావరణహితంగా పండుగను జరుపుకోవాలని కోరారు.

## లోక్ అదాలత్ ద్వారా 8,288 కేసులు పరిష్కారం




**వరంగల్ క్రైం, సెప్టెంబర్ 13 (వుదయం ప్రతినిధి) :**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ వ్యాప్తంగా శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కు విశేష స్పందన లభించిందని వీటి ద్వారా 8,288 కేసులు పరిష్కారమయ్యాయని, సైబర్ క్రైమ్ కేసుల్లో 93 లక్షలకు పైగా రిఫండ్ మొత్తాన్ని బాధితులకు అందజేయాల్సిందిగా కోర్టు ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని, నిన్న నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్ ద్వారా రాజీకి అవకాశం ఉండి పరిష్కరించిన మొత్తం కేసుల్లో కేసుల్లో ఎఫ్ఐఆర్ కేసులు 1595, ఈ పెట్టి కేసులు 2171, మోటార్ వెహికల్ చట్టం కేసులు4522, సైబర్ కేసులు 134 పరిష్కరించడం ద్వారా బాధితులకు సంబంధించి వివిధ బ్యాంక్ ఖాతాల్లో నిలుపుదల చేసిన 93,30,616/ రూపాయలు బాధితులకు అందజేయాల్సిందిగా కోర్టు ఉత్తర్వులు వెలుబడించింది.రాజీ మార్గం రాజా మార్గమని, లోక్ అదాలత్ ద్వారా ఇరు వర్గాలకు న్యాయం జరుగుతుందని అవగాహన కల్పించి కేసుల పరిష్కారానికి కృషి చేసిన పోలీస్ అధికారులను,
సిబ్బందిని పోలీస్ కమిషనర్ అభినందించారు. అదేవిధంగా లోక్ అదాలత్ సద్వినియోగానికి సహకరించిన న్యాయవాదులు, కక్షిదారులు, న్యాయ సేవాధికారులకు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు.

## భక్తి, శాంతియుతతో వినాయక చవితి వేడుకలు జరుపుకోవాలి



**మట్టి గణపతుల ఏర్పాటుతో పర్యావరణ పరిరక్షణకు చేయూతనివ్వాలి**

**– కమిషనర్ టి. వెంకన్న**

**వరంగల్ టౌన్, సెప్టెంబర్ 13 (వుదయం ప్రతినిధి) :**

విఘ్నేశ్వరుని ఆశీస్సులతో నగర ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరియాలని జిడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న ఆకాంక్షించారు. వినాయక చవితి సందర్భంగా వరంగల్ మహా నగర ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు,
అధికారులకు, మీడియా ప్రతినిధులకు ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో, ప్రశాంత వాతావరణంలో పండుగను జరుపుకోవాలని కోరారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, రసాయనిక రంగులు, పర్యావరణానికి హాని కలిగించే విగ్రహాలను నివారించి మట్టి గణపతి విగ్రహాలను ఏర్పాటు చేసి పూజించాలని సూచించారు. పండుగ వేడుకలను పరస్పర సహకారంతో, ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ శాంతియుతంగా నిర్వహించి నగరంలో సోదరభావం, ఐక్యతను చాటాలని కమిషనర్ పిలుపునిచ్చారు.

# వినాయక చవితి ప్రశాంతంగా జరుపుకోవాలి

- జిల్లా ప్రజలకు కలెక్టర్ రాజర్షి షా శుభాకాంక్షలు

**ఆదిలాబాద్,సెప్టెంబర్ 13 (వుదయం ప్రతినిధి):**



వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ రాజర్షి షా జిల్లా ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి, సౌభాగ్యం, ఆయురారోగ్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. వినాయక ఉత్సవాలను భక్తిశ్రద్ధలు, ఐకమత్యంతో ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి, పర్యావరణహిత నిమజ్జనానికి ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఉత్సవాల సందర్భంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. విద్యుత్, అగ్నిప్రమాదాల నివారణకు అవసరమైన భద్రతా చర్యలు పాటించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. నిమజ్జన కార్యక్రమాలను అధికారుల సూచనల మేరకు నిర్దేశిత ప్రదేశాల్లో సురక్షితంగా నిర్వహించాలని కోరారు. విఘ్నేశ్వరుని కృపాకటాక్షాలతో జిల్లా ప్రజలందరికీ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సర్వతోముఖ అభివృద్ధి, శ్రేయస్సు చేకూరాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

# గణేశ్ ఉత్సవాల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

- మండపాల నిర్వాహకులకు డీఎస్పీ శ్రీనివాసులు హెచ్చరిక.

**వేములవాడ సెప్టెంబర్ 13 (వుదయం ప్రతినిధి) :**



గణేశ్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని డీఎస్పీ శ్రీనివాసులు సూచించారు. మండపాల నిర్వాహకులు పోలీసు, విద్యుత్, అగ్నిమాపక శాఖల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. వేములవాడ పట్టణంలోని మహాదేవ్ ఫంక్షన్ హాల్‌లో వేములవాడ రూరల్ పోలీసులు గణేశ్ మండపాల నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ విగ్రహ ప్రతిష్ఠాపన నుంచి నిమజ్జనం వరకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వాహకులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండపాల వివరాలను పోలీసు శాఖ రూపొందించిన ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రజా రవాణా, అత్యవసర వాహనాలకు ఇబ్బంది కలగకుండా మండపాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రతి మండపం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతోపాటు 24 గంటలూ వాలంటీర్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మండపాల వద్ద అగ్నిప్రమాదాల నివారణకు అగ్నిమాపక పరికరాలు, నీరు, ఇసుక అందుబాటులో ఉంచాలన్నారు. భక్తుల కోసం క్యూలైన్లు ఏర్పాటు చేసి తగినంత మంది వాలంటీర్లను నియమించాలని చెప్పారు.

**డీజేలకు అనుమతి లేదు..**

మండపాలు, శోభాయాత్రల్లో డీజేలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. విద్యాసంస్థలు, ఆసుపత్రులు, ప్రార్థనా మందిరాలు, వృద్ధులు, చిన్నారులకు ఇబ్బంది కలగకుండా పోలీసుల అనుమతితో పరిమిత శబ్దంతో స్పీకర్లు వినియోగించాలని సూచించారు. రాత్రి 10 గంటల తర్వాత స్పీకర్ల వినియోగం చేయరాదన్నారు. మండపాల వద్ద మద్యం సేవించడం, జూదం, అసభ్యకర కార్యక్రమాలు, ఇతరుల మనోభావాలను కించపరిచే ప్రసంగాలు, పాటలు, ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడం నిషేధమని తెలిపారు. అనుమానాస్పద వస్తువులు, బ్యాగులు లేదా వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 112కు లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులను నమ్మకుండా, అనుమానాలుంటే పోలీసులను సంప్రదించాలని కోరారు. గణేశ్ నిమజ్జన శోభాయాత్రను మధ్యాహ్నం నుంచే ప్రారంభించి, నిర్దేశిత సమయానికి నిమజ్జనం పూర్తయ్యేలా పోలీసులకు సహకరించాలని డీఎస్పీ సూచించారు. శోభాయాత్రలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూడాలని, ఇతరులపై రంగులు చల్లడం, అభ్యంతరకర నినాదాలు చేయడం, టపాసులు పేల్చడం వంటివి చేయరాదన్నారు. మద్యం సేవించి శోభాయాత్రలో పాల్గొనడం నిషేధమని స్పష్టం చేశారు. మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, వారికి ఇబ్బంది కలిగించే చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శోభాయాత్రకు వినియోగించే వాహనాలు మంచి స్థితిలో ఉండాలని, డ్రైవర్లకు డ్రైవింగ్ లైసెన్సుతో పాటు వాహనానికి సంబంధించిన పత్రాలు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. మండపాల్లో పాయింట్ బుక్స్ ఏర్పాటు చేసుకోవాలని, పోలీసులు తనిఖీలకు వచ్చినప్పుడు సహకరించాలని కోరారు.

**విద్యుత్ భద్రతపై అప్రమత్తత..**

విద్యుత్ శాఖ ఏఈ ప్రవీణ్ మాట్లాడుతూ...మండపాల ఏర్పాటు సమయంలో విద్యుత్ వైర్లకు తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చిన్నారులు విద్యుత్ తీగలు అందకుండా చూడాలని, విద్యుత్ శాఖ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ఈ సమావేశంలో వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై ప్రశాంత్‌రెడ్డి, అగ్నిమాపక శాఖ సిబ్బంది, గణేశ్ మండపాల నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



**కరీంనగర్ సెప్టెంబర్ 13 (వుదయం ప్రతినిధి):**

పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని భగత్ నగర్ ఆర్యవైశ్య అభ్యుదయ సంఘం అధ్యక్షుడు కొల్లూరు హరిప్రసాద్ అన్నారు. వినాయక చవితిని పురస్కరించుకుని సంఘం ఆధ్వర్యంలో స్థానిక భగత్ సింగ్ విగ్రహం వద్ద ఆదివారం ఉచితంగా మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల పర్యావరణానికి తీవ్ర హాని జరుగుతుందన్నారు. తల్లిదండ్రుల సేవే మాధవ సేవ అని చాటిచెప్పిన విఘ్నేశ్వరుని మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని, తల్లిదండ్రులను దైవంగా భావించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు పెద్ది వెంకటరమణ, ఎల్లెంకి వైకుంఠం, కొండూరి ప్రసాద్, అల్లాడి రంగయ్య, సుధాకర్, రవి, రవీందర్, సత్యనారాయణ తదితరులు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# 18 ఏళ్ల సమస్యలకు తిరోధ్యానం

**ఒకటవ డివిజన్ అభివృద్ధికి గౌరవ ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ దత్తత కారణం : కార్పొరేటర్ మడిపెల్లి విజయ మల్లేష్**



**పెద్దపల్లి సెప్టెంబర్ 13 (వుదయం ప్రతినిధి)**

గత 18 సంవత్సరాలుగా ఎలాంటి అభివృద్ధికి నోచుకోక తీవ్ర నిర్లక్ష్యానికి గురైన రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 1వ డివిజన్‌ను గౌరవ శాసనసభ్యులు రాజ్ ఠాకూర్ గారు దత్తత తీసుకొని,కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనలో అద్భుతంగా తీర్చిదిద్దారని 1వ డివిజన్ కార్పొరేటర్ మడిపెల్లి విజయ మల్లేష్ తెలిపారు. డివిజన్ రూపురేఖలను మార్చివేసి ప్రజల కష్టాలను తీర్చినందుకు ఎమ్మెల్యే గారికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మడిపెల్లి విజయ మల్లేష్ మాట్లాడుతూ.. దశాబ్దాల తరబడి పేరుకుపోయిన సమస్యలకు కాంగ్రెస్ పాలనలోనే శాశ్వత పరిష్కారం లభించిందన్నారు. డివిజన్ పరిధిలోని అంతర్గత రహదారులను సిసి రోడ్లుగా మార్చడమే కాకుండా,మురుగునీటి పారుదలకు సరైన ఓపెన్ డ్రైనేజీ వ్యవస్థను నిర్మించాము. విద్యుత్ సమస్యల పరిష్కారానికి నూతన విద్యుత్ స్తంభాలు,అధునాతన వీధి లైట్లు మరియు ప్రధాన కూడళ్లలో హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేసి డివిజన్‌ను వెలుగుమయం చేశామని.ప్రతీ ఇంటికి శుద్ధమైన తాగునీటిని అందించేందుకు మిషన్ భగీరథ'పథకం ద్వారా కొత్త నల్లా కనెక్షన్లను విజయవంతంగా ఏర్పాటు చేశామని.ప్రజాక్షేమమే ధ్యేయంగా,ఇచ్చిన మాట ప్రకారం 1వ డివిజన్‌ను మోడల్ డివిజన్‌గా తీర్చిదిద్దడంలో నిరంతరం సహకరిస్తున్న రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ గారికి ఒకటవ డివిజన్ ప్రజల తరఫున,కాంగ్రెస్ పార్టీ తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు విజయ మల్లేష్ పేర్కొన్నారు.

# లోక్ అదాలత్‌లో 12,638 కేసుల పరిష్కారం

- సైబర్ బాధితులకు రూ.2.79 లక్షలు తిరిగి ఇప్పించేందుకు కోర్టు ఆదేశాలు.

**రాజన్న సిరిసిల్ల, సెప్టెంబరు 13 (వుదయం ప్రతినిధి):**



జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా జిల్లావ్యాప్తంగా రాజీకి అవకాశం ఉన్న పలు కేసులను పరిష్కరించినట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. కేసుల పరిష్కారానికి కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఆయన అభినందించారు. జిల్లాలో అండర్ ఇన్వెస్టిగేషన్, కోర్టు విచారణలో ఉన్న 228 కేసులు, 56 పెట్టీ కేసులు, 823 డ్రంకెన్ డ్రైవ్ కేసులు, 11,456 ట్రాఫిక్ చలాన్ కేసులు, 75 సైబర్ క్రైమ్ కేసులు పరిష్కారమైనట్లు ఎస్పీ వెల్లడించారు. మొత్తం 12,638 కేసులు పరిష్కారమైనట్లు తెలిపారు. లోక్ అదాలత్ సందర్భంగా సైబర్ నేరాల బాధితులకు సంబంధించిన వివిధ బ్యాంకు ఖాతాల్లో నిలుపుదల చేసిన రూ.2,79,030 మొత్తాన్ని బాధితులకు తిరిగి అందజేయాలని కోర్టు ఆదేశాలు జారీ చేసినట్లు ఎస్పీ తెలిపారు. 'రాజీ మార్గమే రాజమార్గం' అనే భావనతో ప్రజలకు అవగాహన కల్పిస్తూ కేసుల పరిష్కారానికి కృషి చేసిన కోర్టు మానిటరింగ్ ఎస్ఐ శ్రావణ్ యాదవ్, కోర్టు మానిటరింగ్ కానిస్టేబుళ్లు, వివిధ పోలీస్‌స్టేషన్ల కోర్టు కానిస్టేబుళ్లు,

పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.లోక్ అదాలత్ విజయవంతం కావడానికి సహకరించిన న్యాయవాదులు, కక్షిదారులు, జిల్లా

# సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో గ్రాండ్ పేరెంట్స్ డే...

**జగిత్యాల సెప్టెంబర్ 13 (వుదయం ప్రతినిధి)**

తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్షులు హరి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు నిర్వహించారు ఆదివారం జిల్లా కేంద్రంలోని అసోసియేషన్ కౌన్సిలింగ్ కార్యాలయంలో ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పలువురు గ్రాండ్ పేరెంట్స్ ను సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ వారి సంఘ ప్రతినిధులు వారి మనుమలు మనుమరాళ్లు పట్టు శాలువాలు కానుకలతో సన్మానించారు ఆనంతరం సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ మాట్లాడుతూ గ్రాండ్ పేరెంట్స్ మమ



కారానికి మార్గదర్శకులన్నారు ఉమ్మడి కుటుంబాలు తగ్గిపోయిన ప్రస్తుత కాలంలో తాతయ్య తాతమ్మ నానమ్మ అమ్మమ్మల తో మనుమలు మనుమరాళ్ళ అనుబంధాలు క్రమంగా తగ్గుతున్నాయని పాత తరం సాంప్రదాయాలు నైతిక విలువలు సంస్కృతి పిల్లల సమక్షంలో చర్చించాలన్నారు

అప్పటి గ్రాండ్ పేరెంట్స్ కాలపు నైతిక విలువలు అనుబంధాలు అర్థం చేసుకుంటే ఈ తరంలో తల్లిదండ్రుల నిరాధరణ కేసులు ఉండవన్నారు ఈ కార్యక్రమంలో టాస్క రాష్ట్ర ఉపాధ్యక్షులు పిసి హన్మంత్ రెడ్డి.జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం కోశాధికారి వెల్మల ప్రకాష్ రావు ఉపాధ్యక్షులు బొల్లం విజయ్ ఎండి యాకుబ్ కె సత్యనారాయణ జగిత్యాల డివిజన్ అధ్యక్షులు రాజేశ్వర్ కోరుట్ల అధ్యక్షులు పబ్బా శివానందం ధర్మపురి నియోజకవర్గం అధ్యక్షులు కండ్ల గంగాధర్ కరుణ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

# ప్రకృతిని కాపాడుకుందాం



- మట్టి గణపతులను పూజిద్దాం సీఐ రామ్ నరసింహ రెడ్డి

**ధర్మపురి,సెప్టెంబర్ 13 (వుదయం ప్రతినిధి):**

పర్యావరణ పరిరక్షణలో భాగంగా ధర్మపురి పట్టణంలో బీజేపీ రాష్ట్ర నాయకులు దామెర.రాం సుధాకర్ రావు ఆధ్వర్యంలో ఉచిత మట్టి గణపతుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ధర్మపురి సీఐ రాం నరసింహ రెడ్డి, ఎస్సై సదా కర్ ముఖ్య అతిథులుగా హాజరై భక్తులకు మట్టి విగ్రహాలను అంద జేశారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రసాయన రంగు ల విగ్రహాలతో నీటి వనరులు కలుషితమవుతున్నాయని,ప్రజలంతా పర్యావరణ హిత మైన మట్టి గణపతులను ప్రతిష్ఠించి సంప్రదాయాన్ని కాపాడు కోవాలని పిలుపునిచ్చారు.బీజేపీ నాయకులు మాట్లాడుతూ వినాయక చవితి పండుగ ను ప్రకృతికి హాని కలగకుండా జరుపుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.మట్టి గణపతి పర్యావరణానికి మేలు అనే సందేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మట్టి విగ్రహాలను తీసుకోవడం అభినంద నీయమన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు గాజు.భా స్కర్,జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి శ్రీనివాస్,ఎండోమెంట్ రాష్ట్ర జెయింట్ కన్వీనర్ బొగ రవికుమార్, విశ్వహిం దూ పరిషత్ జిల్లా కన్వీనర్ కస్తూరి రాజన్న, సీనియర్ నాయకులు బందారి లక్ష్మణ్,పల్లర్ల సురేందర్,పట్టణ ప్రధాన కార్యదర్శులు తిరుమందాస్ సత్యనా రాయణ,సంఘీ. మాధవ్,కో కన్వీనర్ కల కోట రాజు,బీజేవైఎం నాయకులు మండలజీ సూరజ్, తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు భరోసా...

- ఎన్‌హెచ్-63 గ్రీన్‌ఫీల్డ్ హైవేలో భూములు కోల్పోనివ్వను...
- మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు...

**మంచిర్యాల/సెప్టెంబర్ 13 (వుదయం ప్రతినిధి)**

ఎన్‌హెచ్ 63 గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం కోసం భూములు కోల్పోతున్న లక్సెట్టిపేట్, హాజీపూర్ మండలాలకు చెందిన సుమారు 150 మంది రైతులు మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావును కలిసి తమ సమస్యలను వివరించారు.ఇప్పటికే ఎల్లంపల్లి ప్రాజెక్టు కారణంగా తమ భూములను, జీవనాధారాన్ని కోల్పోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం తమ వద్ద ఉన్న కొద్దిపాటి భూమిని కూడా గ్రీన్‌ఫీల్డ్ హైవే కోసం తీసుకుంటే తమ కుటుంబాల జీవనం ప్రశ్నార్థకంగా మారుతుందని తెలిపారు. తమ భూములను తీసుకోకుండా చూడాలని ఎమ్మెల్యేను కోరారు.రైతుల సమస్యలను విన్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు స్పందిస్తూ.. రైతుల భూములు కోల్పోకుండా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. రైతుల సమక్షంలోనే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, రైతులను ఇబ్బందులకు గురిచేయవద్దని, నోటీసుల ప్రక్రియను నిలిపివేయాలని



ఆదేశించారు.అలాగే ప్రతి గ్రామంలో గ్రామ సభలు నిర్వహించి రైతుల అభిప్రాయాలను తెలుసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రతి గ్రామ సభకు తాను స్వయంగా హాజరవుతానని ఎమ్మెల్యే తెలిపారు. రైతుల సమస్య పరిష్కారం కోసం తాను అండగా ఉంటానని స్పష్టం చేశారు.ఎమ్మెల్యే హామీతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. తమ సమస్యను అర్థం చేసుకుని అండగా నిలిచిన ప్రేమ్‌సాగర్‌రావుకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

# పాత మంచిర్యాలలో కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన...

- రూ.30 లక్షలతో నిర్మాణం..
- మట్టి వినాయక విగ్రహాల పంపిణీ చేసిన ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు...

**మంచిర్యాల/ సెప్టెంబర్ 13 (వుదయం ప్రతినిధి)**

మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 14వ డివిజన్ పాత మంచిర్యాలలో గల శ్రీ రామాలయం-శివాలయం-భక్త ఆంజనేయ స్వామి దేవస్థానం ప్రాంగణంలో దాదాపు రూ.30 లక్షల వ్యయంతో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే



మాట్లాడుతూ పవిత్రమైన రామాలయం ప్రాంగణంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు.అనంతరం కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో తయారు చేసిన మట్టి వినాయక విగ్రహాలను ఎమ్మెల్యే భక్తులకు పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణకు దోహదపడే మట్టి వినాయక విగ్రహాలను ప్రోత్సహించడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, స్థానిక కార్పొరేటర్ తూముల నరేష్, డివిజన్ నాయకులు, స్థానిక ప్రజలు ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావును శాలువాతో సన్మానించారు.కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు చిట్ల సత్యనారాయణ, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, మంచిర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ రామగిరి బానేష్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ సల్ల మహేష్, కార్పొరేటర్లు, జిల్లా నాయకులు, డివిజన్ నాయకులు, మార్కెట్ డైరెక్టర్లు, సింగిల్ విండో డైరెక్టర్లు, కాంగ్రెస్ కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# జన్నారం అటవీ డివిజన్ లో ట్రైనీ ఎఫ్ఆర్ఓ ల క్షేత్ర పర్యటన



**జన్నారం, సెప్టెంబర్ 13 (వుదయం విలేఖరి)**

జన్నారం అటవీ డివిజన్ పరిధిలోని కవ్వాల్ టైగర్ రిజర్వ్ అటవీ ప్రాంతంలో తెలంగాణ ఫారెస్ట్ అకాడమీ, దూలపల్లి లో శిక్షణ పొందుతున్న సుమారు 40మంది రేంజ్ అధికారి శిక్షణార్థులు డిప్యూటీ డైరెక్టర్ మంజుల ఆధ్వర్యంలో క్షేత్ర పర్యటన నిర్వహించారు.ఈ రేంజ్ అధికార శిక్షణార్థులు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిశా, కేరళ మరియు కర్ణాటక రాష్ట్రాలకు చెందినవారు ఉన్నారు .ఈ క్షేత్ర పర్యటనలో భాగంగా వారు గొండుగూడ గేట్ నుండి బైసన్ కుంట వరకు కాలినడకన అటవీ ప్రాంతంలో పర్యటించారు. కవ్వాల్ టైగర్ రిజర్వ్ లోని అటవీ పర్యావరణం, వన్యప్రాణుల ఆవాసాలు, జీవవైవిధ్యం, అటవీ సంరక్షణ మరియు క్షేత్రస్థాయిలో అటవీ సిబ్బంది నిర్వహిస్తున్న విధులను ప్రత్యక్షంగా పరిశీలించారు.మరియు వివిధ మొక్కలు, జంతు జాతుల గురించి, అడవులలోని జీవ వైవిధ్యం గురించి మరియు అటవీ, వన్యప్రాణుల నిర్వహణ గురించి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా వారికి ఎఫ్డిఓ రాంమోహన్ బీట్ శిక్షణార్థులు క్షేత్రస్థాయి అటవీ నిర్వహణ, రక్షణ చర్యలు మరియు వన్యప్రాణుల సంరక్షణకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు.ఈ క్షేత్ర పర్యటన ద్వారా వివిధ రాష్ట్రాలకు చెందిన శిక్షణ ఎఫ్ఆర్ఓ లకు కవ్వాల్ టైగర్ రిజర్వ్ లోని అటవీ వన్యప్రాణులు, వన్యప్రాణుల సంరక్షణ,అదేవిధంగా, రేంజ్ అధికారి శిక్షణార్థులు డాగ్ స్క్వాడ్ ను కూడా సందర్శించి, అటవీ నేరాల నిర్మూలన, అక్రమ దోపిడీ మరియు వన్యప్రాణుల సంబంధిత నేరాల గుర్తింపులో శిక్షణ పొందిన స్నిఫర్ డాగ్స్ నిర్వహిస్తున్న కీలక పాత్ర, వాటికి అందిస్తున్న శిక్షణ మరియు విధుల నిర్వహణ విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ ఆర్ ఓ బాబా ఖాదర్ వలీ, ఇన్చార్జి డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ మమత, సెక్షన్ ఆఫీసర్ శంకర్, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.


# మట్టి గణపతిని పూజిద్దాం

**పర్యావరణాన్ని కాపాడుకుందాం***
**మట్టి వినాయకుడి విగ్రహాల పంపిణి...**
**పెద్దపల్లి సెప్టెంబర్ 13 (వుదయం ప్రతినిధి)**

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పెద్దపల్లి పట్టణ కేంద్రంలో మున్సిపల్ ఆధ్వర్యంలో పలువురు ప్రజా ప్రతినిధులతో కలిసి నియోజకవర్గ ప్రజలందరికి మట్టి వినాయకుడి విగ్రహాలను అందజేసిన తదుపరి వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన గౌరవ ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు శ్రీ. చింతకుంట విజయరమణ రావు గారు..ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయరమణ రావు గారు మాట్లాడుతూ...పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా రసాయన విగ్రహాలకు బదులు మట్టి వినాయక విగ్రహాలనే ఉపయోగించాలని, వాటి వాడకాన్ని ప్రోత్సహిస్తూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్,నుగుల్లా మల్లయ్య,కౌన్సిలర్లు మరియు కమిషనర్ మరియు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..



# కోరుట్లలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



**కోరుట్ల సెప్టెంబర్ 13 (వుదయం ప్రతినిధి)**

పర్యావరణ పరిరక్షణలో భాగంగా లయన్స్ క్లబ్ ఆఫ్ కోరుట్ల ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు మట్టి వినాయక విగ్రహాలను ఉపయోగించడం ద్వారా పర్యావరణ కాలుష్యాన్ని నివారించవచ్చని నిర్వాహకులు తెలిపారు మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ లయన్స్ క్లబ్ ఆఫ్ కోరుట్ల తరపున కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కోరుట్ల అధ్యక్షులు గుంటుక మహేష్ కార్యదర్శి బెజ్జంకి శ్రీనివాస్ రావు కోశాధికారి పొలాస రవీందర్ లయన్ కుందారపు మహేందర్ లయన్ అడెపు మధు లయన్ కొమ్ముల జీవన్ రెడ్డి లయన్ పడాల నారాయణ గౌడ్ లయన్ ఎలేటి లక్ష్మారెడ్డి లయన్ జగపతి రెడ్డి లయన్ నల్ల గంగాధర్ లయన్ చెన్న శ్రీనివాస్ కుమార్ లయన్ పటుకూరి రవికుమార్ రెడ్డి లయన్ కుదేలా రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు

# ఘనంగా గురు రత్న అవార్డుల ప్రదానం

**ఆర్మూర్, సెప్టెంబర్ 13, వుదయం ప్రతినిధి :**

ఉపాధ్యాయుల సేవలు, అంకితభావం, విద్యారంగంలో వారు చేస్తున్న విశిష్ట కృషిని గుర్తిస్తూ గురు రత్న అవార్డు-2026 కార్యక్రమాన్ని ఆర్మూర్‌లోని లిల్లిపుట్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఘనంగా నిర్వహించారు.ఇటీవల నిర్మల్‌లో నిర్వహించిన గురు రత్న అవార్డు కార్యక్రమం అనంతరం, ఆర్మూర్‌లో పాఠశాల కరస్పాండెంట్ రామకృష్ణ, ప్రిన్సిపాల్ దాస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు అవార్డులు అందజేసి సన్మానించారు. అవార్డు గ్రహీతలకు గురు రత్న పురస్కారంతో పాటు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల కృషిని గుర్తించి ప్రోత్సహించడం ద్వారా విద్యారంగంలో మరింత సేవ చేయడానికి స్ఫూర్తి లభిస్తుందని తెలిపారు.“మంచి ఉపాధ్యాయుడు విద్యార్థి జీవితాన్ని మార్చగల శక్తి.” అని పేర్కొన్నారు.



# ఎమ్మెల్యే ను కలిసిన హరిజన మత్స్య శాఖ సొసైటీ సభ్యులు

**దండేపల్లి: సెప్టెంబర్ 13 (వుదయం విలేకరి)**

దండేపల్లి మండలంలోని రెబ్బెనపల్లి హరిజన మత్స్య శాఖ సొసైటీ ఎన్నికల్లో విజయం సాధించిన అధ్యక్షులు మొదంపల్లి లింగయ్య ఉపాధ్యక్షులు కుశానపల్లి రాజం,ప్రధాన కార్యదర్శి కుశానపల్లి నర్సయ్య, డైరెక్టర్లు రాజయ్య, రాజలింగు ఆదివారం మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు మర్యాదపూర్వకంగా కలిశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు ఎన్నికల్లో నూతనంగా గెలిచిన వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కందుల అశోక్,ఉప సర్పంచ్ ఊరటి వినోద్ కుమార్,మాజీ సర్పంచ్ కొట్టె సత్తయ్య ,మార్కెట్ కమిటీ తాజా మాజీ డైరెక్టర్స్ కొట్టె శ్రీనివాస్,బండ రాకేశ్, PACS డైరెక్టర్ జాడి పోచయ్య,అంబేద్కర్ సంఘ సభ్యులు కుష్ణపల్లి చిన్నయ్య,శేర్ల మురళి, కుశనపల్లి రంజిత్,కుష్ణపల్లి పెద్ద చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.





# జూరాలకు జల కళ తగ్గుతోంది!

- ఎగువ నుంచి పడిపోతున్న ఇన్‌ఫ్లో.. 3 వేల క్యూసెక్కులకే పరిమితం
- 6,327 క్యూసెక్కుల నీటి విడుదల.. 9.173 టీఎంసీలకు చేరిన నిల్వ

**గద్వాల సెప్టెంబర్ 13 (వుదయం బ్యూరో)**

జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న నీటి ప్రవాహం క్రమంగా నీరుగారు తోంది. రోజురోజుకూ ఇన్‌ఫ్లో తగ్గుతుండ టంతో జూరాల ప్రాజెక్టులో జలకళ తగ్గు తోంది. ప్రస్తుతం ప్రా జెక్టుకు 3 వేల క్యూసె క్కులకు పైగా మాత్రమే నీరు వచ్చి చేరు తోంది. ఈ విషయాన్ని ప్రాజెక్టు అధికారి సుదర్శ న్ యాదవ్ వెల్లడించారు. ప్రాజెక్టులో ప్రస్తుతం 9.173 టీఎంసీల నీటి నిల్వ ఉంది. జూరాల పూర్తిస్థాయి నీటిమ ట్టం 318.28 మీటర్లు కాగా.. ప్రస్తుతం 317.33 మీటర్ల వద్ద నీటిమట్టం కొన సాగుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే ప్రవాహం మరింత తగ్గితే ప్రాజెక్టు నీటి నిల్వలపై ప్రభావం పడే అవకాశం ఉందని పరిస్థితి స్పష్టం చేస్తోంది. మరోవైపు ప్రాజెక్టు నుంచి 6,327 క్యూ సెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తు న్నారు. వస్తున్న నీటికంటే విడుదల చేస్తున్న నీటి పరిమాణం ఎక్కువగా ఉండటంతో జూరాల నీటి నిల్వలు, నీటిమట్టంపై పరిస్థితిని అధికారులు నిశితంగా గమని స్తున్నారు. ఎగువ నుంచి ఇన్‌ఫ్లో ఏ మేరకు కొనసాగు తుందన్నది రానున్న రోజుల్లో కీలకంగా మారనుంది.

# 12 ఏళ్లుగా ఎదురుచూపులేనా..?



- ఉద్యమ కళాకారులకు ఉద్యోగాలు కల్పించాలి
- నిరుద్యోగ కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎర్రవల్లి శ్రీనివాస్

**వుదయం, సిద్దిపేట ప్రతినిధి**

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమ కళా కారులకు తెలంగాణ సాంస్కృతిక సారథిలో తక్షణమే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సిద్దిపేట జిల్లా నిరుద్యోగ కళాకారుల సంఘం అధ్యక్షుడు ఎర్రవల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు.ఈ మేరకు ఆదివారం సిద్దిపేటలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు.రాష్ట్రం ఏర్పడి పన్నెండు న్నర సంవత్సరాలు గడిచినా ఉద్యమ కళాకారుల సమస్యలు పరిష్కారం కాలే దన్నారు. ఉద్యమ సమయంలో పాటలు, డప్పులు, ధూంధాం ప్రదర్శనలతో ప్రజ ల్లో చైతన్యం తీసుకొచ్చిన కళాకారులు నేడు ఉపాధి లేక ఇబ్బందులు పడుతు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఉద్యమ కళాకారుల సమస్యలపై శాసనమండలి లో ప్రస్తావించిన విజయశాంతి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చొరవ తీసుకుని సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దృష్టికి సమస్య ను తీసుకెళ్లాలని కోరారు.ఇక హామీలు కాకుండా కార్యాచరణ ప్రకటించి ఉద్యో గాల భర్తీ ప్రక్రియ ప్రారంభించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్ర మంలో రాష్ట్ర కార్యదర్శి పిన్నింటి దాసు, జిల్లా ఉపాధ్యక్షుడు తునికి రాజు తదిత రులు పాల్గొన్నారు.

# నాయక నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబవుతున్న మండపాలు

**పెద్ద శంకరంపేట (వుదయం ) సెప్టెంబర్ 13.**



వినాయక చవితి పండుగను పురస్కరిం చుకొని. పెద్ద శంకరంపేట తో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో వినాయక నవరాత్రి ఉత్సవాల నిర్వ హణ కోసం వినాయక మండపాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తు న్నారు. యువజన సంఘాల ఆధ్వర్యం లో. పలు ఆలయాలలో గ్రామాలలో వాడ వాడల పలు ప్రధాన ప్రాంతాలలో వినాయక మండపాల పనులు ము మ్మరంగా సాగుతున్నాయి. కొత్త కొత్త సెట్టింగ్ లతో ఒకరికి మించి ఒకరు వినాయక మండపాలను విద్యుత్ దీపాలతో దేవతామూర్తుల సెట్టింగ్లతో ఎంతో అందంగా అలంకరిస్తున్నారు. వినాయక నవరాత్రి ఉత్సవాలను ఎంతో వైభవంగా నిర్వహించేందుకు ఆయా మండపాల నిర్వాహకులు ఏర్పాట్లు చే స్తున్నారు. వినాయక నవరాత్రి ఉత్సవా లో ప్రజలు ఆయా మండపాలను దర్శిం చుకుని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించేలా చర్యలు చేపడుతున్నారు.

# ఆర్టీసీలో మారుతున్న సమీకరణాలు!

- ఎంప్లాయిస్ యూనియన్‌కు పెరుగుతున్న కార్మిక బలం
- ఎన్ఎంయూ నుంచి వరుస చేరికలు.. మహబూబ్‌నగర్ రీజియన్‌లో హోరెత్తిన సమావేశం

**గద్వాల సెప్టెంబర్ 13 (వుదయం కరస్పాండెంట్)**

టీజీఎస్ఆర్టీసీలో కార్మిక సంఘాల మధ్య సమీకరణాలు వేగంగా మారు తున్నాయా? మహబూబ్‌నగర్ రీజియన్‌లో చోటుచేసు కుంటున్న పరిణామా లు అవుననే సంకేతాలు ఇస్తున్నాయి. గద్వాల డిపో ఆధ్వర్యంలో ఆదివారం ని ర్వహించిన ఎంప్లాయిస్ యూనియన్ విస్తృతస్థాయి సమావేశానికి భారీగా తరలివచ్చిన కార్మికులు యూనియ న్‌కు తమ మద్దతును చాటారు. ఇదే సమయంలో ఎన్ఎంయూ నుంచి పలువురు కార్మికులు ఎంప్లాయిస్ యూనియన్‌లో చేరడం ప్రాధాన్యత సంతరించుకుంది. రీజియన్ స్థాయిలో నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యద ర్శి ఈదురు వెంకన్న, రాష్ట్ర కమిటీ సభ్యులు హాజరై కార్మికుల సమస్యలు, సంఘటనా బలం, భవిష్యత్ కార్యాచ రణపై దిశానిర్దేశం చేశారు. చేరికలతో పెరిగిన జోష్ ఎన్ఎం యూ నుంచి పలువురు కార్మికులు ఎంప్లాయిస్ యూనియన్‌లో చేరడంతో సమావేశం లో ఉత్సాహం నెలకొంది..కొత్తగా చేరిన కార్మికులకు నాయకులు కండువాలు కప్పి ఆహ్వానించారు. ఒక్కొక్కరిగా కార్మికు లు యూనియన్‌లోకి వస్తుండ టంతో రీజియన్‌లో సంఘటనా సమీక రణాలు మారుతున్నాయని నాయకులు పేర్కొన్నారు. కార్మికుల అండ.. గెలుపే లక్ష్యం ధీమా కార్మికుల నుంచి వస్తున్న స్పందన, ఇతర సంఘాల నుంచి జరుగుతున్న చేరికలు, విస్తృత స్థాయిలో జరుగుతున్న సమావేశాలతో ఎంప్లాయిస్ యూనియన్‌లో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. రానున్న ఎన్ని కల్లో కార్మికుల మద్దతుతో ఎంప్లాయిస్ యూనియన్ విజయాన్ని నమోదు చేస్తుందని నాయకులు ధీమా వ్యక్తం చేశారు.కార్మికులే మా బలం.. ఐక్యతే మా ఆయుధం.. గెలుపే మా లక్ష్యం" అంటూ నాయకులు, కార్మికులు నిన దించారు.



# విద్యార్థి నేస్తం విశ్వనాథ్‌కు గౌరవ డాక్టరేట్

- మూడున్నర దశాబ్దాల విద్యా సేవలకు అరుదైన గౌరవం
- యువతకు మార్గదర్శకత్వం.. సామాజిక సేవలకు గుర్తింపుగా ప్రతిష్ఠాత్మక డాక్టరేట్

**వికారాబాద్ సెప్టెంబర్ 13 (వుదయం బ్యూరో)**



మూడున్నర దశాబ్దాలుగా విద్య, యువత, సామాజిక సేవా రంగాల్లో విశేష సేవలు అందిస్తున్న ప్రముఖ వి ద్యావేత్త "విద్యార్థి నేస్తం" విశ్వనాథ్‌కు గౌరవ డాక్టరేట్ లభించింది..గాంధేయ తత్వం, శాంతి, మానవతా విలువల విభాగంలో అందించే గౌరవ డాక్టరే ట్‌ను ఆయన అందుకున్నారు. భువనే శ్వర్‌లో మహాత్మా గాంధీ గ్లోబల్ పీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో హర్యానా, హిమాచల్ ప్రదేశ్ మాజీ గవర్నర్ బండారు దత్తా త్రేయ చేతుల మీదుగా విశ్వనాథ్ గౌరవ డాక్టరేట్‌ను స్వీకరించారు. విద్యార్థులకు కెరీర్ అవగాహన, మార్గ దర్శకత్వం, నైపుణ్యాభివృద్ధి, సామాజిక చైతన్యం కల్పించే కార్యక్రమాలను విశ్వనాథ్ నిరంతరం కొనసాగిస్తు న్నారు. యువతను దేశ నిర్మాణంలో భాగస్వాములను చేయాలనే లక్ష్యంతో ఆయన చేస్తున్న సేవలకు ఈ గౌరవం గుర్తింపుగా నిలిచింది. ఈ సందర్భం గా బండారు దత్తాత్రేయ విశ్వనాథ్‌ను అభినందిస్తూ విద్యార్థులు, యువత కోసం ఆయన అందిస్తున్న సేవలను ప్ర శంసించారు. పలువురు విద్యావేత్తలు, విద్యారంగ ప్రముఖులు, సామాజికవే త్తలు, అభిమానులు విశ్వనాథ్‌కు అభి నందనలు తెలిపారు. ఈ గౌరవం తనపై మరింత బాధ్యతను పెంచిందని విశ్వ నాథ్ తెలిపారు. యువతకు మరింత మెరుగైన మార్గదర్శకత్వం అందిస్తూ, దేశ నిర్మాణంలో వారి భాగస్వామ్యాన్ని పెంచే దిశగా తన సేవలను మరింత విస్తృతం చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా విశ్వవి ద్యాలయం ఆర్ట్స్ కళాశాల మాజీ ప్రిన్సి పాల్ ప్రొఫెసర్ చింతా గణేష్, డాక్టర్ పి. మురళీ మనోహర్, సమీక్ష ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ నటరాజ్, ప్రముఖ సామాజికవేత్త బాల్దా అశోక్, విద్యావేత్త గోవర్ధన్, సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ ఉమామహేశ్వర దేవస్థానం అభివృద్ధిని చూసి ఓర్వలేకనే అసత్య ఆరోపణలు

**అచ్చంపేట సెప్టెంబర్ 13: (వుదయం ప్రతినిధి )**

శ్రీ ఉమా మహేశ్వర దేవస్థానం అభివృ ద్ధి ని చూసి ఓర్వలేక కొందరు అసత్య ప్రచారం చేస్తున్నారని వాటిని నమ్మ కూడదు అని పాలక మండలి సభ్యులు కోరారు.

**ఆదివారం విలేకరుల సమావేశం లో మాట్లాడుతూ**

భక్తుల సౌకర్యార్థం కొరకు కొండపైకి ప్రత్యేక బస్సులు ఎక్కడ కూడా అవినీతి అక్రమాలకు తావు లేకుండా పూర్తిగా ఆన్లైన్ సర్వీస్ నల్లమల దేవాలయ పర్యా టక ప్రాంతం అభివృద్ధికి అందరూ సహ కరించాలని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ సహకారంతో ఉమామహే శ్వర దేవాలయం మరింతగా అభివృద్ధి జరుగుతుందని అన్నారు.దేవాలయా లపై అనవసర అసత్య ఆరోపణలు చేస్తే తగిన భక్తులే బుద్ధి చెప్తారని శ్రీ ఉమామహేశ్వర దేవస్థానం పాలక మండలి సభ్యులుదాశరథి పవన్గండి కోట దశరథం మంత్రు నాయక్కాంగ్రెస్ పార్టీ నాయకులుచింతల రాజగోపాల్, ఎల్లికంటి శ్రీనివాస్ స్పష్టం చేశారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ పేరుతో కొంతమంది వ్యక్తులు నాయకులుగా చలామణి అవుతూ, శ్రీ ఉమామహేశ్వర దేవస్థానం వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక అనవసర మైన, అసత్య ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు..

అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ సహకారంతో, దేవస్థానం చైర్మన్ బిరం మాధవరెడ్డి ఆధ్వర్యంలో శ్రీ ఉమామహేశ్వర దేవస్థానంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి శ్రీ ఉమామహేశ్వర దేవస్థానం అభివృద్ధికి సుమారు రూ.4 కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నవి పే ర్కొన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం, దేవాదాయ శాఖ ఆధ్వర్యం లో పలు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు..ముఖ్యంగా కొండపై ఉన్న దేవాలయానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేయడం జరి గిందని, దీనిపైకూడాకొంతమందికావా



లనే అనవసర రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు.భక్తుల సౌకర్యార్థం దేవ స్థానం వద్ద ఆన్‌లైన్ సేవలు, దేవాదాయ శాఖకు సంబంధించిన సేవలు, ఇతర మౌలిక వసతులుఅందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారుదేవస్థానం చైర్మన్ బిరం మాధవరెడ్డి గారు ఆలయ అభివృద్ధినే ప్రధాన లక్ష్యంగా చేసుకుని అనునిత్యం పనిచేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఎంపీమల్లు రవి,, మంత్రులు, ప్రభుత్వ శాఖల సహ కారంతో దేవస్థానాన్ని మరింత అభివృ ద్ధి చేసి, ఉమామహేశ్వరాన్ని ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతంగా అభి వృద్ధి చేయడానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.బస్సుల ఏర్పాటు, టికెట్ల విషయంలో కొంతమంది కావాలనే ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఆరో పణలు చేయడం సరికాదని అన్నారు. భక్తుల సౌకర్యం కోసం చేపట్టిన ప్రతి కార్యక్రమాన్ని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు.

భక్తులు నుంచి వచ్చినటువంటి విరాళా లను ఆన్లైన్లో నమోదు చేసి వారికి రసీదు ఇవ్వడం జరుగుతుంది.అంతా పక్కా పారదర్శకంగా ఉంది ప్రజలకు వాస్త వాలను వివరించి తప్పుడు ప్రచారాన్ని తిప్పికొడతామని ఈ సందర్భంగాతెలి యజేస్తున్నాం ..ఈ కార్యక్రమంలో, శివ, వినోద్, వెంకటేష్, అంజి పాల్గొన్నారు

# అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్నాడని పథకం ప్రకారమే హత్య

**నాగర్ కర్నూల్, సెప్టెంబర్ 13 (వుదయం బ్యూరో) :**

వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భర్తను భార్య తన ప్రియుడితో కలిసి పథకం ప్రకారమే హత్య చేయిం చిందని డీఎస్పీ బుర్రి శ్రీనివాసులు తెలిపారు.ఆదివారం నాగర్ కర్నూల్ లోని డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కేసు వివరాలను వెల్లడించారు.

**డీఎస్పీ మాట్లాడుతూ..**

నాగర్ కర్నూల్ పట్టణంలోని రాంనగర్ కాలనీకి చెందిన మహమ్మద్ కరీం (43) భార్య సలీమా బేగం (36)కు వన పర్తి జిల్లా రేవల్లి మండలం నాగాపూర్ గ్రామానికి చెందిన గౌస్ పాషా (29) తో గత రెండేళ్లుగా అక్రమ సంబంధం ఉందన్నారు. ఈ విషయాన్ని గమనిం చిన కరీం భార్యను మందలించడంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవన్నారు. పలుమార్లు కుటుంబ పెద్దలు పంచాయతీ చేసి సర్దిచెప్పినా వారి ప్రవర్తనలో మార్పు రాలేదన్నారు. రెండు నెలల క్రితం పెద్ద మనుషులు పంచాయతీ పెట్టి గౌస్ పాషాను మం దలించారని, దీంతో ఆగ్రహించిన గౌస్ పాషా కరీంను చంపుతానని బెదిరించి అదే రోజు కత్తిని కొనుగోలు చేసి ఇంట్లో దాచుకున్నాడని డీఎస్పీ తెలిపారు.

**వాట్సాప్ కాల్ లో ప్లాన్...**

సలీమా, గౌస్ పాషాలు వాట్సాప్ కాల్స్ ద్వారా తరచూ మాట్లాడుకుంటూ హత్యకు పక్కా ప్లాన్ వేశారన్నారు. ఆస్తి సలీమా పేరున ఉండటంతో భర్తను అడ్డు తొలగిస్తే ఆస్తిని అనుభవించవచ్చు, తమ సంబంధాన్ని కొనసాగించవచ్చని భా వించారన్నారు.సెప్టెంబర్ 7న సలీమా నెల్లూరు దర్గాకు వెళ్తున్న విషయాన్ని గౌస్ కు చెప్పిందని, ఇంట్లో ఎవరూ లేని సమయంలో హత్య చేయాలని నిర్ణయిం చుకున్నారని చెప్పారు. పథకం ప్రకారం సెప్టెంబర్ 9న రాత్రి 7.30 గంటలకు గౌస్ సలీమాకు ఫోన్ చేసి హత్య చేస్తా నని చెప్పి, సెప్టెంబర్ 10 తెల్లవారుజా మున 2.30 గంటలకు కత్తి, గ్లౌజులు, బట్టలతో వచ్చి కరీం ఇంటి డోర్ బెల్ కొ




ట్టాడన్నారు. నిద్రమత్తులో కరీం తలుపు తీయగానే కత్తితో గొంతుకోసి హత్య చేసి పారిపోయాడన్నారు. తిరిగి వెళ్తూ మార్గమధ్యంలో పొదల్లో కత్తి, బట్టలు, చెప్పులు పడేశాడన్నారు.సెప్టెంబర్ 10 మధ్యాహ్నం మృతుడి తమ్ముడు ఎండి. హుస్సేన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. అనుమా నంతో సలీమాను అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం ఒప్పుకుం దని, ఆమె ఇచ్చిన సమాచారంతో గౌస్ పాషాను అదుపులోకి తీసుకోగా నేరం అంగీకరించాడని తెలిపారు.నిందితులిద్ద రినీ అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించామ ని డీఎస్పీ తెలిపారు. ఈ కేసును ఛేదించిన సీఐ అశోక్ రెడ్డి, ఎస్ఐ వెంకట్ రెడ్డి, ఐడీ పార్టీ సిబ్బంది వెంకటేష్, భీముడు, రమేష్ లను అభినందించారు.ఈ మీడియా సమావేశంలో సీఐ అశోక్ రెడ్డి, ఎస్ఐ వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి దశ నుండే క్రీడలపై ఆసక్తి పెంపొందించాలి






- సమాజం నుండి మాదకద్రవ్యాలను తరిమికొట్టాలి..
- ప్రతి విద్యార్థి క్రీడా స్ఫూర్తి పెంపొందించుకోవాలి..
- క్రీడలు.. క్రీడాకారుల అభివృద్ధికి సంపూర్ణ సహకారం
- పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి..
- పటాన్చెరులో ఘనంగా ప్రారంభమైన కీర్తిశేషులు గూడెం విష్ణువర్ధన్ రెడ్డి స్మారక ప్రథమ జాతీయస్థాయి ఓపెన్ కరాటే, కుంగ్ ఫూ ఛాంపియన్షిప్ పోటీలు..
- లాంఛనంగా ప్రారంభించిన ఎమ్మెల్యే జిఎంఆర్
- వివిధ రాష్ట్రాల నుండి హాజరైన క్రీడాకారులు

ఎమ్మెల్యే జిఎంఆర్ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు..

కృతజ్ఞతలు తెలిపిన క్రీడాకారులు.. తల్లిదండ్రులు..

**పటాన్చెరు సెప్టెంబర్ 13 వుదయం ,**



ప్రస్తుత పోటీ ప్రపంచంలో మానసిక ప్రశాంతత, శారీరక ధారుడ్యత కోసం వి ద్యార్థి దశ నుండి క్రీడలపై ఆసక్తి పెంపొం దించేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని.. నియోజకవర్గంలో క్రీడలు, క్రీడాకారుల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మల్టీపర్పస్ ఫంక్షన్ హాలులో ఎమ్మెల్యే జిఎంఆర్ సౌజన్యంతో ఛాంపియన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గూడెం విష్ణువర్ధన్ రెడ్డి స్మారక ప్రథమ జాతీయ స్థాయి కరాటే, కుంగ్ ఫూ ఛాంపియన్ షిప్ పోటీలకు ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరై.. లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ పటాన్చెరు కేంద్రంగా జాతీయ స్థాయిలో కరాటే, కుంగ్ ఫూ పోటీలు నిర్వహించడం సంతోషకరంగా ఉందన్నారు. వివిధ రాష్ట్రాల నుండి సుమారు 2000 మంది క్రీడాకారులు టోర్నమెంట్ కు హాజరు కావడం పటాన్చెరు నియోజకవర్గం యొక్క ఖ్యాతిని నలుదిశలా చాటి చెప్పినట్లు అయ్యిందని అన్నారు. చిన్ననాటి నుండి తనకు క్రీడలు అంటే ఎంతో మక్కువ అని, నియోజకవర్గ స్థాయిలో క్రీడలు, క్రీడాకారుల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని తెలిపారు. దశాబ్దాల చరిత్ర కలిగిన పటాన్చెరు పట్టణంలోని మైత్రి మైదానాన్ని ఆధునికరించడంతో పాటు.. ఏడాది పొడవునా వివిధ క్రీడ అంశాల్లో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ స్థాయి క్రీడాకారుల కోసం నియోజకవర్గ వ్యాప్తంగా మూడు మినీ స్టేడియాలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు.ప్రస్తుత సమాజంలో మాదకద్రవ్యాలు అత్యంత ప్రమాదకరంగా మారాయని. సమాజం నుండి వాటిని తరిమి కొట్టడంలో ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థి దశ నుండి పిల్లలకు వాటి దుష్పరిమానాలను వివరించాలని కోరారు. విద్యార్థులు చదువుతోపాటు, క్రీడల పైన ఆసక్తి పెంచుకొని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని కోరారు.

**క్రీడాకారులకు ఎటువంటి**

సహకారం కావాలన్న తనను సంప్రదిం చాలని కోరారు. జాతీయస్థాయి పోటీలు నిర్వహణకు సంపూర్ణ సహకారం అందించిన ఎమ్మెల్యే జిఎంఆర్ కు ని ర్వాహకులు, క్రీడాకారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు నర్రా బిక్షపతి, వెంకటేష్, రామ్మోహన్, షకీల్, చంద్ర కుమార్, కరాటే మాస్టర్లు లక్ష్మణ్, రాజు, వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన క్రీడాకారు లు, తల్లిదండ్రులు, అకాడమీ మాస్టర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు చెప్పిన ఎస్పీ

**నారాయణపేట సెప్టెంబర్ 13(వుదయం ప్రతినిధి)**

గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నారాయణపేట జిల్లా ప్రజలందరికీ జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ హార్టికల్ శుభా కాంక్షలు తెలిపారు. గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావర ణంలో ఆనందోత్సాహాలతో నిర్వహిం చుకోవాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు. గణేష్ మండపాల నిర్వాహకు లు విగ్రహ ప్రతిష్టాపన నుంచి నిమజ్జ నం వరకు అన్ని జాగ్రత్తలు పాటించా లని ఎస్పీ సూచించారు. మండపాలను ఏర్పాటు చేసే సమయంలో ట్రాఫిక్‌కు ఎలాంటి ఆటంకం కలగకుండా చూ సుకోవాలని తో పాటు, స్థల యజమానుల అనుమతి తీసుకోవాలని, విద్యుత్ వైర్లు మరియు కనెక్షన్ల విషయంలో అప్రమ త్తంగా ఉండాలని, ఫైర్ సేఫ్టీ చర్యలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. గణేష్ విగ్రహ ప్రతిష్టాపనకు పోలీస్ పోర్టల్ లో నమోదు చేసుకొని ఇన్ఫర్మే న్ ఇవ్వాలని శోభాయాత్రలు, నిమజ్జన కార్యక్రమాలకు ముందుగానే పోలీసుల అనుమతి తీసుకోవాలని, నిమజ్జన మా ర్గాన్ని పోలీసులకు తెలియజేయాలని అందుకు పోలీసు శాఖ ప్రతిష్ట బందోబ స్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. సౌండ్ సిస్టమ్స్ ప్రభుత్వం నిర్దేశించిన పరిమితుల్లోనే వినియోగిం చాలని, డీజే లకు ఎలాంటి అనుమతి లేదని, రాత్రి 10 గంటల తర్వాత లౌ డ్‌స్పీకర్ల వినియోగం పూర్తిగా నిషేధ మని స్పష్టం చేశారు.మహిళలు, భక్తుల భద్రత దృష్ట్యా మండపాల వద్ద సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని పోలీసు లతో సమన్వయం చేసుకోవాలని, ప్రతి గణేష్ మండపం వద్ద విధిగా పాయింట్ పుస్తకం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పోలీసు అధికారులు మం డపాలను తనిఖీ చేసినప్పుడు పాయింట్ పుస్తకంలో వివరాలు నమోదు చేసి సంతకం చేస్తారని తెలిపారు.అనుమా నాస్పదంగా కనిపించే బ్యాగులు, ప్లాస్టిక్ సంచులు లేదా ఇతర వస్తువులు ఎక్కడై నా కనిపిస్తే వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ తాకకుండా వెంటనే సమీప పోలీసుల కు సమాచారం అందించాలని ఎస్పీ సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాలు, వదంతులను నమ్మవద్దని, ఏదైనా అనుమానా స్పద సమాచారం ఉంటే ముందుగా పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు.అన్ని మతాల ప్రజలతో సఖ్యత గా, పరస్పర గౌరవంతో ఉత్సవాలను నిర్వహించుకోవాలని, పర్యావరణ పరి రక్షణ కోసం మట్టి విగ్రహాలను వినియో గించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు. గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా, ఆనందంగా జరుపుకొని నారాయణ పేట జిల్లాను సామరస్యానికి ప్రతీ కగా నిలబెట్టాలని, ప్రజలంద రూ పోలీసు శాఖకు సహకరించాలని ఎస్పీ అన్నారు.

# తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి



- సంగారెడ్డి జిల్లా బిజెపి ఓ.బీ.సీ. అధ్యక్షుడు కోణం విట్టల్

**పెద్ద శంకరంపేట సెప్టెంబర్ 13 (వుదయం ) ప్రతినిధి**

సెప్టెంబర్ 17వ తేదీన తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని సంగా రెడ్డి జిల్లా బిజెపి ఓబీసీ అధ్యక్షుడు కోణం విఠల్ డిమాండ్ చేశారు.ఆదివారం పెద్ద శంకరంపేటలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ నాయకత్వం లో చేపట్టిన ఆపరేషన్ పోలో తెలంగాణ ప్రజల పోరాట ఫలితంగా హైదరాబాద్ రాష్ట్రం భారతదేశంలో విలీనం కావడం జరిగిందని పేర్కొన్నారు.. ఈ చారిత్రక ఘట్టాన్ని గుర్తు చేసుకుంటూ తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం అధి కారికంగా నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇప్పటివరకు ప్రభుత్వాలు తెలంగాణ విమోచన దినో త్సవం అధికారికంగా నిర్వహించకపో వడం పట్ల ఆయా పార్టీ నాయకులను విమర్శించారు.. ఈ కార్యక్రమంలో మండల బిజెపి అధ్యక్షుడు శ్రావణ్ కుమార్ ప్రధాన కార్యదర్శి ఎం కృష్ణ. బీజేవైఎం అధ్యక్షులు బుగుడాల కృష్ణ . తదితరులు పాల్గొన్నారు.

# చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

**మిరుదొడ్డి, సెప్టెంబర్ 13, వుదయం :**



చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాద వశాత్తు బావిలో పడి మృతి చెందిన ఘటన సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం కొండాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది.సర్పంచ్ జిగిరి అమర్, గ్రామస్తుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎండి సాదాత్ (37) ఆదివారం గ్రామంలోని వ్యవసాయ బావి వద్ద చేపల వేటకు వెళ్లాడు. ప్రమా దవశాత్తు బావిలో పడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సర్పంచ్ అమర్ సంఘటనా స్థలానికి చేరుకుని గ్రామ స్తులు, పోలీసుల సహాయంతో మృతదే హాన్ని బయటకు తీశారు. అనంతరం మృతదేహాన్ని పంచనామా నిమిత్తం దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించా రు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సాదాత్ మృతితో కుటుంబ సభ్యులు, గ్రామస్తు లు విషాదంలో మునిగిపోయారు. పేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమం

**బిజినపల్లి, సెప్టెంబర్ 13 (వుదయం ప్రతినిధి) :**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మది నాన్ని పురస్కరించుకుని బిజినపల్లి మండల కేంద్రంలో సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని ఘనంగా ని ర్వహించారు.

మండల కన్వీనర్ కురవి శ్రీకాంత్ శర్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా ప్రధాన కార్యదర్శి, జిల్లా సేవా సంకల్ప్ అభియాన్ కన్వీన ర్ నాగేందర్ గౌడ్ హాజరయ్యారు.ఈ సందర్భంగా నాగేందర్ గౌడ్ మాట్లాడు తూ.. బీజేపీ ఆధ్వర్యంలో సేవా సంకల్ప్ అభియాన్ సెప్టెంబర్ 17 నుండి అక్టో బర్ 17 వరకు నెల రోజుల పాటు కొ నసాగుతుందని తెలిపారు. ప్రజా సేవ, సామాజిక సేవ, ఆరోగ్యం, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తా మన్నారు.మండల కన్వీనర్ శ్రీకాంత్ శర్మ మాట్లాడుతూ.. మండలంలో సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమాలను వి జయవంతం చేసేందుకు ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని కోరారు. "ప్రజా సేవే లక్ష్యం సమాజ అభివృద్ధే సంకల్పం" స్ఫూర్తితో కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని పిలుపుని చ్చారు.ఈ కార్యక్రమంలో కోకన్వీనర్లు, జిల్లా కార్యదర్శి చంద్రకళ, బాలస్వామి, సంతోష్ కుమార్, మండల ప్రధాన కా ర్యదర్శి ఆంజనేయులు, మండల పదాధి కారులు, వివిధ మోర్చాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ప్రేమ పెళ్లి.. పగతో ఇల్లు ధ్వంసం!



- **యువకుడి ఇంటిపై విరుచుకుపడ్డ ఏడుగురు**
- **పోలీసుల ఉక్కుపాదం.. అరెస్టు చేసి రిమాండ్‌కు తరలింపు**

**గద్వాల సెప్టెంబర్ 13 (వుదయం కరస్పాండెంట్)**

ప్రేమించి పెళ్లి చేసుకున్నాడనే కారణంతో యువకుడిపై కక్ష పెంచుకున్న కొందరు అతడి ఇంటినే ధ్వంసం చేశారు. గద్వాల మండలం రేపల్లి గ్రామంలో ఈ నెల 10న చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఘటనపై కఠినంగా స్పందించిన పోలీసులు ఏడుగురు నిందితులను అరెస్టు చేసి న్యాయ రిమాండ్‌కు తరలించారు. యువకుడి ప్రేమ వివాహాన్ని జీర్ణించుకోలేక ఇంటిపై దాడికి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఈ ఘటనకు సంబంధించి టీ. వీరన్న, పరశురాములు అలియాస్ పరుష, వెంకటేష్ అలియాస్ టీ. వెంకటేష్ నాయుడు, పరశురాములు, రామాంజనేయులు, గోపాల్, తిమ్మన్న అలియాస్ తిమ్మప్పలను శనివారం సాయంత్రం అరెస్టు చేసినట్లు గద్వాల డీఎస్పీ మొగిలయ్య వెల్లడించారు. ఇంటిపై దాడి.. కేసులు నమోదు యువకుడు తనకు నచ్చిన వ్యక్తిని వివాహం చేసుకున్నాడనే కారణంతో అతడి ఇంటిపై దాడి చేసి ధ్వంసం చేసిన ఘటనపై గద్వాల రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. నిందితులపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు డీఎస్పీ తెలిపారు. కోర్టు రిమాండ్ అరెస్టు చేసిన ఏడుగురిని అలంపూర్ జేఎఫ్‌సీఎం కోర్టులో హాజరు పరిచారు. కేసును పరిశీలించిన న్యాయమూర్తి నిందితులకు న్యాయ రిమాండ్ విధించారు. ఘటన వెనుక ఉన్న పూర్తి కారణాలు, మరెవరైనా ఇందులో భాగస్వాములుగా ఉన్నారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ప్రేమ వివాహం చేసుకున్నాడన్న కారణంతో చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని ఇంటిని ధ్వంసం చేయడంపై పోలీసులు కఠినంగా వ్యవహరించడంతో నిందితులను రిమాండ్‌కు తరలించారు.

# పాలనపై ప్రశ్నిస్తే ఎందుకీ ఉలికిపాటు?



- **బీఆర్ఎస్ నేతల దిష్టిబొమ్మల దగ్ధాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం ....**
- **విలేకరుల సమావేశంలో బిఆర్ఎస్ మండలాధ్యక్షులు రమణ గౌడ్**

**వుదయం న్యూస్ శివ్వంపేట, సెప్టెంబర్ 13 ...**

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో పూర్తిగా విఫలమైందని ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ నేతలు ప్రశ్నిస్తే అధికార కాంగ్రెస్ పార్టీ నేతలు ఎందుకు ఉలికి పడుతున్నారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణ గౌడ్ విమర్శించారు. ఆదివారం దొంతి గ్రామంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శివంపేటలో కాంగ్రెస్ నాయకులు ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతల దిష్టిబొమ్మల దగ్ధం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తున్న బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ నాయకులు దిష్టిబొమ్మలు దగ్ధం చేయడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందుకు తీసుకెళ్తున్న బీఆర్ఎస్ నాయకులను చూసి కాంగ్రెస్ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే ప్రతిపక్ష గొంతును అణచివేయాలనే ఉద్దేశంతోనే దిష్టిబొమ్మల దహనానికి పాల్పడుతున్నారని అన్నారు. వెయ్యి రోజుల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం సాధించిన విజయాలేమిటో ప్రజలకు వివరించాలని, ఇచ్చిన హామీల అమలుపై సమాధానం చెప్పాలని రమణ గౌడ్ డిమాండ్ చేశారు. దిష్టిబొమ్మలు దగ్ధం చేయడం ద్వారా బీఆర్ఎస్ లేవనెత్తుతున్న ప్రజా సమస్యలను పక్కదారి పట్టించలేరని స్పష్టం చేశారు. ప్రజల తరపున బీఆర్ఎస్ నిరంతరం ప్రశ్నిస్తూనే ఉంటుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఫోరం మండల అధ్యక్షులు పవన్ గుప్తా, రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షులు నాగేశ్వరరావు, బీఆర్ఎస్ నాయకులు యాదగౌడ్, సింగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, బుద్ధుల బిక్షపతి, జగన్ రెడ్డి, వారాల శ్యామ్, కైఫ్, వంజరి రాహుల్, శ్రీకాంత్ రెడ్డి, పిట్ల కృష్ణ, మంగలి రమేష్, సుకుమార్, జంగం స్వామి, ముత్యాలు, గ్రామస్థులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# అకాల వర్షానికి జర్నలిస్ట్ ఇల్లు ధ్వంసం



- **పైకప్పు కూలి ఇంటి సామాగ్రి ధ్వంసం నిరాశ్రయులైన కుటుంబం....**
- **ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి.....**

**వుదయం న్యూస్ శివ్వంపేట సెప్టెంబర్ 13....**

మెదక్ జిల్లా శివ్వంపేట మండల కేంద్రంలో అకాల వర్షం బీభత్సం సృష్టించింది. స్థానికంగా నివాసం ఉంటున్న జర్నలిస్ట్ సంపత్ కుమార్,ఇల్లు ఆదివారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి ధ్వంసమైంది.భారీ వర్షం కారణంగా ఇంటి పైకప్పు ఒక్కసారిగా కూలిపోయింది. దీంతో ఇంట్లో ఉన్న బట్టలు, నిత్యావసర సరుకులు, ఎలక్ట్రానిక్ వస్తువులు, ఇతర గృహోపకరణాలు పూర్తిగా తడిసి ధ్వంసమయ్యాయి. అదృష్టవశాత్తు ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది.ఈ ఘటనతో జర్నలిస్ట్ సంపత్ కుమార్ కుటుంబం ఒక్కసారిగా నిరాశ్రయులైంది. నివాసం ఉండేందుకు స్థలం లేక కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. జరిగిన నష్టంతో వారు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.విషయం తెలుసుకున్న స్థానికులు, తోటి జర్నలిస్టులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.సంబంధిత రెవెన్యూ శాఖ అధికారులు వెంటనే స్పందించి నష్టాన్ని అంచనా వేసి, ప్రభుత్వం ద్వారా తగిన పరిహారం అందించి జర్నలిస్ట్ కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు, జర్నలిస్టులు కోరుతున్నారు.

# మట్టి గణపతి మహాగణపతి



**సంగారెడ్డి వుదయం**

వాసవి మా ఇల్లు స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఐబి వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో శ్రీ జ్యోతిర్వాస్తు విద్యాపీఠం వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ డాక్టర్ శ్రీమహేశ్వర శర్మ సిద్ధాంతి మట్టి వినాయక విగ్రహాలను ఆదివారం పంపిణీ చేశారు. సిద్ధాంతి మాట్లాడుతూ గత 18 సంవత్సరాలుగా వాసవి మా ఇల్లు వ్యవస్థాపకులు తోపాజి అనంత కిషన్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేయడం అభినందనీయమని చెప్పారు. 5,250 మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేసినట్లు తెలిపారు . ప్రతి ఒక్కరు మట్టి వినాయక విగ్రహాలని పూజించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు తోపాజి అనంత కిషన్, ప్రధాన కార్యదర్శి పుల్లూరి ప్రకాష్, ఉపాధ్యక్షులు మ్యాడం రాధా కిషన్, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు కొంపల్లి విద్యాసాగర్, సభ్యులు చందా శ్రీధర్, ఇరుకుల ప్రదీప్ కుమార్, జూలకంటి రామకృష్ణ, మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి అనుముల సంతోష్,

# ఇంటిగ్రేటెడ్ స్కూల్ కోసం తీసుకున్న పేదల భూములకు నష్టపరిహారం ఇవ్వాలి

- **దళిత, పేద రైతుల భూములకు నష్టపరిహారం చెల్లించాలి**
- **తాండూర్ ఎమ్మెల్యేకు రైతులు, ప్రజాసంఘాల నాయకుల వినతి**
- **భూమికి భూమి లేదా ఎకరానికి రూ.50 లక్షలు చెల్లించాలి: తాండూర్ ఎమ్మెల్యేకు రైతులు, ప్రజాసంఘాల నాయకుల వినతి**

**తాండూర్ సెప్టెంబర్ 13 (వుదయం ప్రతినిధి)**

తాండూరు నియోజకవర్గం లోని యాలాల మండలం దౌలాపూర్ రెవెన్యూ గ్రామ పరిధిలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం కోసం తీసుకున్న దళిత, పేద రైతుల భూములకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని రైతులు, ప్రజాసంఘాల నాయకులు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డిని ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా కేవీపీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఉప్పలి మల్కయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు యు. బుగ్గప్ప, ఎంఆర్‌పీఎస్ జిల్లా నాయకులు డప్పు మహేందర్ మాట్లాడుతూ.. యాలాల మండలం దౌలాపూర్ రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 73లో చెన్నారం, దౌలాపూర్ గ్రామాలకు చెందిన దళితులు, వడ్డె కులాలకు చెందిన పేద రైతులకు 1980లో అప్పటి ప్రభుత్వం సాగు చేసుకోవడానికి భూములు పంపిణీ చేసిందన్నారు. 11 కుటుంబాలకు సుమారు 25 ఎకరాల భూమిని పంపిణీ చేయగా, అప్పటి నుంచి రైతులు ఆ భూములను సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారని తెలిపారు.అయితే రైతులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం పేరుతో వారి పొలాల నుంచి ఎర్రమట్టిని పూర్తిగా తరలించారని, దీంతో భూములు సాగుకు పనికిరాకుండా పోయాయని వారు ఆరోపించారు. భూములు తీసుకున్నప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి నష్టపరిహారం చెల్లించకపోవడం ద్వారా పేద రైతులకు అన్యాయం జరుగుతోందన్నారు.2013 భూసేకరణ చట్టం ప్రకారం భూములు సేకరిస్తే ప్రస్తుత మార్కెట్ విలువకు అనుగుణంగా నష్టపరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. భూసేకరణ చట్టానికి విరుద్ధంగా రెవెన్యూ అధికారులు వ్యవహరించడం సరికాదని, పాలకుల సహకారంతో అధికారులు కాంట్రాక్టర్లకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి వెంటనే ఈ సమస్యపై జోక్యం చేసుకుని ప్రభుత్వంతో మాట్లాడి దళిత, పేద రైతులకు భూమికి భూమి ఇవ్వడంతో పాటు, ప్రత్యామ్నాయం లేని పక్షంలో ఎకరానికి రూ.50 లక్షల నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని రైతులు, ప్రజా సంఘాల నాయకులు కోరారు.ఈ కార్యక్రమంలో రైతులు వెంకటయ్య, బాలరాజ్, పెద్ద వెంకటయ్య, చంద్రమ్మ, శ్రీనివాస్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు



# తప్పుడు గణాంకాలతో మాలలను వంచించడమే

- **MCF డివిజన్ సమావేశంలో నేతల ధ్వజం**
- **అందోల్‌లో మాల కోఆర్డినేషన్ ఫోరం (MCF) డివిజన్ స్థాయి భేటీ**
- **రోస్టర్ పాయింట్లు, అశాస్త్రీయ విధానాలపై మాల మేధావుల తీవ్ర ఆగ్రహం**
- **సామాజిక న్యాయాన్ని కాపాడే వరకు ఐక్య ఉద్యమం: MCF పిలుపు**

**వట్టిపల్లి సెప్టెంబర్13 (వుదయం ప్రతి-నిధి) సంగారెడ్డి జిల్లా, అందోల్:**

తెలంగాణలో ఎస్సీ ఉపవర్గీకరణ పేరిట ప్రభుత్వం అనుసరిస్తున్న ఏకపక్ష విధానాలు, తప్పుడు గణాంకాలు మాలలకు తీవ్ర అన్యాయం చేస్తున్నాయని మాల కోఆర్డినేషన్ ఫోరం (MCF) స్పష్టం చేసింది. సంగారెడ్డి జిల్లా అందోల్‌లో MCF ఆధ్వర్యంలో నిర్వహించిన డివిజన్ స్థాయి సమావేశంలో మాలల హక్కులు, రోస్టర్ పాయింట్ల సవరణపై తీవ్రస్థాయిలో చర్చించారు. రాజ్యాంగ నిబంధనలు, సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని నేతలు మండిపడ్డారు. శాస్త్రీయత లేని రోస్టర్ పాయింట్లతో నష్టంతెలంగాణ షెడ్యూల్డ్ క్యాస్ట్స్ రిజర్వేషన్స్ యాక్ట్ 2025 ప్రకారం గ్రూప్I కి 1%, గ్రూప్II కి 9%, గ్రూప్III కి 5% కేటాయించినప్పటికీ... జీ.ఎంఎస్. నెం.10 ద్వారా రోస్టర్ పాయింట్లలో మాలలకు 22వ పాయింట్ కేటాయించడం శాస్త్రీయంగా లేదని వక్తలు ఆక్షేపించారు. వాస్తవంగా 21 పాయింట్ల తర్వాతే మాలలకు అవకాశం దక్కేలా చేయడం వల్ల తీవ్ర వంచన జరుగుతోందని తెలిపారు. సుప్రీంకోర్టు 2024 తీర్పు ప్రకారం ఉపవర్గీకరణ కచ్చితమైన "Quantifiable, Verifiable & Authenticated Data" (నిరూపించదగిన ఆధారాలు) ఆధారంగా జరగాలని ఉన్నా, ప్రభుత్వం ఎలాంటి శాస్త్రీయ పద్ధతులు పాటించలేదని ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎం.ఎఫ్. గోపి, న్యాయవాది శకుంతల తీవ్రంగా ఖండించారు.



**తప్పుడు జనాభా లెక్కలతో కుట్ర**

ప్రభుత్వం చూపించిన 13.75 లక్షల జనాభా లెక్కలు వాస్తవ విరుద్ధమని, క్షేత్రస్థాయిలో మాలల జనాభా 31 లక్షలకు పైగా ఉందని నేతలు స్పష్టం చేశారు. ఆకర్ కమిటీ నివేదిక పేరుతో కొన్ని శాఖల్లో 27,000 మంది మాల ఉద్యోగులు అధికంగా ఉన్నారంటూ వారి స్థానంలో ఇతర ఉపకులాలకు ఉద్యోగాలు ఇవ్వాలని చూడటం దుర్మార్గపు చర్యగా అభివర్ణించారు. తప్పుడు గణాంకాలతో మాలా సమాజాన్ని ఆర్థికంగా, సామాజికంగా అణచివేసే కుట్రలను తిప్పికొడతామని హెచ్చరించారు.

ప్రధాన డిమాండ్లు:

ప్రభుత్వం వెంటనే సమగ్రమైన ఎంపీరికల్ డేటాను (Empirical Data) బహిరంగపరచాలి.

రాష్ట్రంలోని ప్రతి ఉపకుల జనాభా, విద్య, ఉద్యోగ ప్రాతినిధ్య గణాంకాలను విడుదల చేయాలి.మాలలకు తీవ్ర నష్టం కలిగిస్తున్న రోస్టర్ పాయింట్లను తక్షణమే సవరించాలి.ఈ కార్యక్రమంలో డివిజన్‌లోని వివిధ ప్రాంతాల నుంచి మాల సంఘాల నాయకులు, మేధావులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణపై చర్చించారు.

# వినాయక చవితి విశిష్టత

- **విఘ్నేశ్వరుని దివ్య జనన వృత్తాంతం* ...**
- **శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్....**

**వుదయం న్యూస్ శివ్వంపేట సెప్టెంబర్ 13...**

మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలోని గూడూరు గ్రామంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఫౌండర్ శివకుమార్ గౌడ్ వినాయక చవితి . వినాయక చవితి ప్రాముఖ్యత గురించి ఇలా వివరించారు.భద్రపద మాస శుద్ధ చతుర్థి నాడు జరుపుకునే వినాయక చవితి అత్యంత పవిత్రమైన పండుగ.

సమస్త విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుని పూజించి, ఏ పని ప్రారంభించినా అది విజయవంతంగా పూర్తవుతుంది.

**శ్రీ విఘ్నేశ్వరుని జన్మ వృత్తాంతం:**

**పార్వతీదేవి శరీర నలుగు పిండి:**

ఒకరోజు పార్వతీదేవి స్నానానికి వెళ్తూ, తన శరీర నలుగు పిండితో ఒక బాలుని రూపాన్ని మలచి, దానికి ప్రాణం పోసింది.

ఆ బాలుడిని గుమ్మం వద్ద కాపలాగా ఉంచి, ఎవరినీ లోపలికి రానివ్వవద్దని ఆదేశించింది.

**పరమశివుని ఆగమనం:***

అదే సమయంలో పరమశివుడు అక్కడికి రాగా, ఆ బాలుడు పరమశివుడిని లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నాడు.

తన దారిని అడ్డుకున్న బాలుడిపై శివునికి కోపం వచ్చి, తన త్రిశూలంతో ఆ బాలుని శిరచ్ఛేదం చేశాడు.

**గజాసురుని శిరస్సు:**

జరిగిన దారుణాన్ని చూసి పార్వతీదేవి తీవ్ర దుఃఖానికి గురైంది.

దేవి ఆవేదనను చూసి శివుడు ప్రసన్నుడై, ఉత్తర దిక్కుగా తలపెట్టి నిద్రపోతున్న ఏనుగు తలను తెప్పించి బాలుని దేహానికి అమర్చి పునర్జీవితుడిని చేశాడు.

**ధిపతిగా పట్టాభిషేకం:**

సమస్త దేవతలు ఆ బాలుడిని ఆశీర్వదించి, విఘ్నాలకు అధిపతిగా "విఘ్నేశ్వరుడు" అని నామకరణం చేశారు.

**వినాయక చవితి పూజా ఫలితం:**

ఈ రోజున భక్తిశ్రద్ధలతో స్వామివారిని పూజించి, కుడుములు, ఉండ్రాళ్లు నైవేద్యంగా సమర్పిస్తే సమస్త విఘ్నాలు తొలగి సుఖసంతోషాలు కలుగుతాయి.

వినాయక చవితి పూజ ముగింపులో చదువుకునే పవిత్రమైన *శ్రీ విఘ్నేశ్వర వ్రత కథ (శమంతకోపాఖ్యానం).

శ్రీ విఘ్నేశ్వర వ్రత కథ శమంతకోపాఖ్యానం

**కథా ప్రారంభం:**

ఒకానొక రోజు పరమశివుడు విఘ్నేశ్వరునికి సమస్త విఘ్నాలకు అధిపత్యం ప్రసాదించాడు. ఆ రోజు భాద్రపద శుద్ధ చతుర్థి. సమస్త దేవతలు వినాయకునికి రకరకాల కుడుములు, ఉండ్రాళ్లు, నైవేద్యాలు సమర్పించి పూజించారు.

**చంద్రుని పరిహాసం & శాపం:**

నైవేద్యాలు ఎక్కువగా స్వీకరించిన వినాయకుడు నడుస్తుండగా, అది చూసి ఆకాశంలో ఉన్న చంద్రుడు వినాయకుని వంకర రూపాన్ని, పెద్ద బొజ్జను చూసి నవ్వాడు.

తనను పరిహసించిన చంద్రునికి వినాయకుడు ఆగ్రహించి — "ఈ రోజు నుండి భాద్రపద శుద్ధ చతుర్థి నాడు నిన్ను ఎవరు చూసినా వారు నిందల పాలవుతారు" అని శాపం ఇచ్చాడు.


**లోకంలో కలకలం:***

చంద్రుని శాపం వల్ల ప్రజలు, దేవతలు చతుర్థినాటి చంద్రుడిని చూడటానికి భయపడిపోయారు. లోకంలో ఉపద్రవం రాకుండా బ్రహ్మదేవుని ఆజ్ఞతో దేవతలందరూ వినాయకుడిని ప్రార్థించి శాపవిమోచనం వేడుకున్నారు.

దయగల గణపతి శాపాన్ని సడలిస్తూ — "ఎవరైతే భాద్రపద శుద్ధ చతుర్థి నాడు నన్ను భక్తితో పూజించి, ఈ వ్రత కథను చదువుకుని అక్షతలు తలపై వేసుకుంటారో, వారు పొరపాటున చంద్రుడిని చూసినా నిందలపాలు కారు" అని అభయమిచ్చాడు.

**శమంతకమణి కథ & శ్రీకృష్ణుని నింద:**

ద్వాపర యుగంలో సత్రాజిత్తు అనే యాదవుడు సూర్యభగవానుని మెప్పించి "శమంతకమణి"ని పొందుతాడు. ఆ మణి రోజూ ఎనిమిది బరువుల బంగారాన్ని ఇస్తుంది. ఒకరోజు సత్రాజిత్తు సోదరుడు ప్రసేనుడు ఆ మణిని మెడలో వేసుకుని వేటకు వెళ్లి సింహం చేతిలో హతుడవుతాడు. ఆ సింహాన్ని చంపి జాంబవంతుడు మణిని తన కుమార్తె జాంబవతికి ఆటవస్తువుగా ఇస్తాడు. భాగవతంలో శ్రీకృష్ణుడు శమంతకమణిని కోరాడని, ఆయనే ప్రసేనుడిని చంపి మణిని దొంగిలించాడని మధురలో అపవాదు వ్యాపిస్తుంది. కారణం శ్రీకృష్ణుడు భాద్రపద శుద్ధ చతుర్థి నాటి చంద్రుడిని నీటి పాత్రలో చూసి ఉండటమే!



**నిందానివారణ & విజయం:**

శ్రీకృష్ణుడు తనపై పడిన అపవాదును పోగొట్టుకోవడానికి అడవికి వెళ్లి, జాంబవంతుని గుహను కనుగొంటాడు. జాంబవంతునితో 21 రోజులు ఘోరంగా యుద్ధం చేస్తాడు. శ్రీకృష్ణుడిని శ్రీరాముని అవతారంగా గుర్తించిన జాంబవంతుడు శమంతకమణితో పాటు తన కుమార్తె జాంబవతిని ఇచ్చి వివాహం జరిపిస్తాడు.

మణిని సత్రాజిత్తుకు తిరిగి ఇచ్చి తనపై పడిన నిందను బాపుకున్న శ్రీకృష్ణుడు, వినాయకుడిని ప్రార్థించి సమస్త లోకానికి ఈ వ్రత విధానాన్ని ఉపదేశించాడు.

**వ్రత ఫలశ్రుతి:**

*ఈ కథను విని, అక్షతలు తలపై వేసుకున్న వారికి ఎలాంటి అపనిందలు, విఘ్నాలు కలగవు. సమస్త శుభాలు సిద్ధమిస్తాయి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రస్తుత సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# గౌడ సంఘం నూతన అధ్యక్షుడిగా సతీష్ గౌడ్

- **గౌడ సంఘం బలోపేతమే మా లక్ష్యం**

**అక్బర్ పేట భూంపల్లి సెప్టెంబర్ 13 (వుదయం ప్రతినిధి)**

గౌడ సామాజిక వర్గ సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతామని, అందరినీ కలుపుకొని సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామని అక్బర్ పేట భూంపల్లి మండలం భూంపల్లి గౌడ సంఘం నూతన అధ్యక్షుడు అతికం సతీష్‌గౌడ్ అన్నారు.సంఘం నూతన కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సమాజంలో గౌడ బంధువుల హక్కుల కోసం, వారి అభివృద్ధి కోసం కమిటీ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. సంఘం ఉపాధ్యక్షులు బాల్నెట్టి శ్రీనివాస్ గౌడ్, కోశాధికారి బాలిశెట్టి నరసింహులు గౌడ్, సభ్యులు లింగం గౌడ్, నర్సింలు గౌడ్, సురేష్ గౌడ్ తదితరులు సంఘం సభ్యులు గా ఎన్నికైనారు.

# కబడ్డీ జిల్లా స్థాయి జూనియర్ సబ్ జూనియర్ ఎంపికలు



- **ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర నాయకుడు ముచ్చర్ల జనార్ధన్ రెడ్డి**

**ఊర్కొండ న్యూస్ 13 వుదయం ప్రతినిధి**

నాగర్ కర్నూల్ జిల్లా ఊరుకొండ మండలం ఈరోజు మండల కేంద్రం లోకబడ్డి అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈరోజు ఊరుకొండ మండల కేంద్రంలో జూనియర్ బాల. బాలికల మరియు సబ్ జూనియర్ బాలికల జిల్లా కబడ్డి జట్ల ఎంపికలు నిర్వహించినారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నాగర్ క ర్నూల్ జిల్లా అధ్యక్షులు జనార్దన్ రెడ్డి ప్రధాన కార్యదర్శి యాదయ్య గౌడ్ గ్రామ సర్పంచ్ మంజుల శ్రీనివాసులు పాల్గొని ఎంపికలను ప్రారంభించారు జిల్లా 20 మండలాల నుండి దాదాపుగా 300కు పైచిలుకు క్రీడాకారులు పాల్గొన్నారు ఇక్కడ ఎంపిక చేసిన జూనియర్ బాలుర సబ్ జూనియర్ బాలికల రాష్ట్ర స్థాయి కబడ్డీ ఛాంపియన్ షిప్ సిరిసిల్ల జిల్లాలోని వేములవాడలో ఈనెల 26 నుండి 29 వరకు జరుగు రాష్ట్ర టోర్నమెంట్లో నాగర్ క ర్నూల్ జిల్లా తరపున పాల్గొంటారని జూనియర్ బాలికలు వచ్చే నెల 10 నుండి 13 వరకు ఖమ్మం జిల్లాలోని అశ్వరావుపేటలో జరుగుతున్న జూనియర్ బాలికల రాష్ట్రస్థాయి కబడ్డీ ఛాంపియన్ షిప్ లో పాల్గొంటారని ప్రధాన కార్యదర్శి యాదయ్య గౌడ్ తెలిపారు ఈ సెలక్షన్ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు మ్యకల శ్రీనివాసులు రమేష్ డా క్యా మోహన్. ప్రసాద్. వ్యాయామ ఉపాధ్యాయులు జ్యోతి .భారతి . గణేశ్వరి సుజాత తదితరులు పాల్గొన్నారు

# ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులుగా రమేష్ నియామకం

- **ప్రధాన కార్యదర్శిగా వేణు మాదిగ**

**నర్సాపూర్ సెప్టెంబర్ 13 (వుదయం న్యూస్)**

ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశం దుర్గదాస్ మాదిగ ఆధ్వర్యంలో ఆదివారం నర్సాపూర్ పట్టణంలో జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మెదక్ జిల్లా ఇన్చార్జి బొజ్జ సైదులు మాదిగ పాల్గొన్నారు వారు మాట్లాడుతూ పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశం మేరకు కుల లింగ వర్గ మార్పు కై మరో పోరాడడానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు అక్టోబర్ 7 తేదీన అమరావతిలో జరగబోయే ఎమ్మార్పీఎస్ మండల జాతీయ మాహసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు ఆదివారం నర్సాపూర్ మండలం నూతన కమిటీ ఎన్నుకున్నారు మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మంగపూర్ రమేష్ మాదిగను నియమించారుఅధికార ప్రతినిధిగా మీసాల కృష్ణమాదిగప్రధాన కార్యదర్శిగా వేణు మాదిగ ప్రధాన కార్యదర్శిగా కట్ల రాజు మాదిగ
ఉపాధ్యక్షులు బోడ శ్రీకాంత్ మాదిగ చాగంటి శ్రీనివాస్ మాదిగ మన్నిసత్తయ్య మాదిగ
కోశాధికారి కిష్టని నవీన్ మాదిగకార్యదర్శులు కృష్ణమాదిగ అశోక్ మాదిగ బోడ వెంకటేష్ మాదిగ
జాజల బిక్షపతి మాదిగసహాయ కార్యదర్శులు అబ్బుగారి రాజు మాదిగ కట నవీన్ మాదిగ కార్యవర్గ సభ్యులు ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు నీరుడు సత్యనారాయణ మాదిగ కృష్ణని సాయిలు మాదిగ వెంకట్ సందీప్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు





# ఆర్. కృష్ణయ్య 73వ జన్మదిన వేడుకలు

- **జాతీయ బీసీ సంఘం సభ్యులు కందుకూరి రాజ్ కుమార్ ఆధ్వర్యంలో...**

**తాండూరు సెప్టెంబర్ 13 వుదయం ప్రతినిధి**

జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య 73వ జన్మదిన వేడుకలను ఆదివారం తాండూరు నియోజకవర్గ బీసీ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ కార్యవర్గ సభ్యులు, తాండూరు నియోజకవర్గ కన్వీనర్ కందుకూరి రాజ్‌కుమార్ పాల్గొని ఆర్. కృష్ణయ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.కార్యక్రమానికి వివిధ కుల సంఘాల పెద్దలు, బీసీ సంఘాల నాయకులు, యువకులు, మహిళా ప్రతినిధులు పెద్దఎత్తున హాజరై వేడుకలను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా బీసీల హక్కులు, సంక్షేమం కోసం ఆర్. కృష్ణయ్య చేస్తున్న కృషిని పలువురు నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు

# వినాయక చవితి రోజే శ్రీ శ్రీ పాద వల్లభుల జయంతి వేడుకలు



- **శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శివకుమార్ గౌడ్....**

**వుదయం న్యూస్ శివ్వంపేట సెప్టెంబర్ 13...**

మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలోని గూడూరు గ్రామంలో శ్రీశ్రీశ్రీ విశ్వయోగి విశ్వంజీ మహారాజ్ దివ్య ఆశీస్సులతో గూడూరు గ్రామ వాస్తవ్యులు ప్రముఖ సంఘ సేవకులు హైకోర్టు సీనియర్ న్యాయవాది శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఫౌండర్ పెద్ద గౌని జిన్నారం శివకుమార్ గౌడ్ మాట్లాడుతూ సోమవారం భాద్రపద శుద్ధ చవితి రోజున శ్రీ శ్రీపాద వల్లభుల జయంతి కూడా ఉంటుంది. కావున ఆరోజు ఉదయం శ్రీ గురు పీఠం లోని శ్రీ శంఖు చక్ర సహిత వర సిద్ధి వినాయకుడు మరియు మట్టి వినాయకుని ప్రాణ ప్రతిష్ట చేసి గణేశ ప్రార్థనతో ప్రారంభమై గణేష షోడోపచార పూజ నిర్వహించబడుతుంది. తదుపరి శ్రీ గణేశ ఉపనిషత్తు, గణేశ తాళం, గణేశ పంచరత్న గీతం, గణేష మంగళహారతి ఉంటుంది. సోమవారం సాయంత్రం శ్రీపాద వల్లభుల స్తోత్రపటనం షోడోప్రచార పూజ దివ్య మంగళ హారతి ఉంటుంది. వినాయక చవితి తో సంబంధం: వినాయకుడు విఘ్నాలను తొలగించే వాడు. శ్రీపాద వల్లభులు కూడా భక్తుల కష్టాలని విఘ్నాలు తొలగించడానికి ఆరోజే అవతరించారు. అందుకే వినాయక చవితి రోజున శ్రీపాద వల్లభులను పూజిస్తే విఘ్నాలు తొలిగి జ్ఞానం, సంతానం, ఐశ్వర్యం, లభిస్తాయి శ్రీపాద వల్లభులు నిత్యం సజీవులు. వారు ఎక్కడికి వెళ్లలేదు. శ్రీపాద రాజ్యం శరణం ప్రపద్యే అని భక్తితో పిలిస్తే చాలు నేటికీ కురువపురములో సూక్ష్మ రూపంలో ఉండి భక్తులను కాపాడుతున్నారని భక్తుల నమ్మకం అందుకే ఈ వినాయక చవితి రోజున ఉదయం వినాయకుడి పూజ సాయంత్రం శ్రీపాద వల్లభ పూజ చేయడం మహా పుణ్య ప్రదం, తదుపరి వినాయక వ్రతము ఉంటుంది కావున భక్త మహాశయులందరూ వినాయక చవితి రోజు ఉదయం సాయంత్రం శ్రీ గురు పీఠంలో జరుగుతున్న శ్రీ వినాయకుని పూజలు మరియు సాక్షాత్తు ప్ర ప్రతమ దత్తాత్రేయ అవతారమైన శ్రీపాద వల్లభుల షోడుపచార పూజలకు విచ్చేసి పరమ పవిత్రమైన ఆ రోజున శ్రీ గురు పీఠములోని శ్రీ శంకు చక్ర సహిత వరసిద్ధి వినాయకుడు మరియు శ్రీ దత్తాత్రేయ పంచాయతనం లోని శ్రీపాద వల్లభులను దర్శించి ప్రార్థించి తరించవలసిందిగ, శ్రీ గురుపిఠం ట్రస్ట్ సభ్యులు కోరుతున్నారు.

# చిన్నంబావి మండల కేంద్రం లో సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమం



- **బిజెపి పార్టీ జిల్లా కన్వీనర్ నరేందర్ గౌడ్**
- **జిల్లా జనరల్ సెక్రెటరీ జగ్గారి శ్రీధర్ రెడ్డి**
- **బిజెపి పార్టీ మండల అధ్యక్షులు బొగ్గు కురుమయ్య**

**చిన్నంబావి మండలం 13 ( వుదయం రిపోర్టర్ )**

చిన్నంబావి మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో సేవా సంకల్పఅభియాన్ కార్యక్రమాన్ని చిన్నంబావి మండల అధ్యక్షులు బొగ్గు కురుమయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిధిగా నాగర్ కర్నూల్ జిల్లా కన్వీనర్ నరేందర్ గౌడ్ హాజరయ్యారు. బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ప్రజా సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేయాలనే సంకల్పంతో ఈ యాత్రను నిర్వహించినట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు నరేందర్ గౌడ్ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, సేవా కార్యక్రమాలు, అభివృద్ధి లక్ష్యంగా పార్టీ నిరంతరం పనిచేస్తుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని తెలిపారు.

**చిన్నంబావి మండల అధ్యక్షులు బొగ్గు కురుమయ్య మాట్లాడుతూ**

సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు, పార్టీ కార్యకర్తలు సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. ప్రజలకు అండగా నిలుస్తూ, ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని నాయకులు సూచించారు. ఈ కార్యక్రమంలో చిన్నంబావి మండల కన్వీనర్ సంపత్ కుమార్, కో కన్వీనర్ గోపి నాయుడు, బీజేపీ నాయకులు, మండల స్థాయి కార్యకర్తలు, యువకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు. చిన్నంబావి మండలంలో బీజేపీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నింపేలా సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమం కొనసాగింది.

# చక్కని ఆరోగ్యం

## ముఖానికి ఇవి వాడకూడదట..!



ముఖ సౌందర్యం కోసం ఇటు ఇంటి చిట్కాలను, అటు బయట దొరికే వివిధ ఉత్పత్తుల్ని వాడుతుంటాం. అయితే వీటిలో ముఖానికి వాడకూడని పదార్థాలు కూడా కొన్నున్నాయంటున్నారు నిపుణులు. చర్మానికి తేమనందించడానికి బాడీ లోషన్ ఉపయోగించడం మనకు అలవాటే! అయితే కొంతమంది దీన్నే ముఖానికి కూడా వాడుతుంటారు. ఫలితంగా ఇందులోని జిడ్డుదనం ముఖ చర్మ రంధ్రాల్లోకి చేరి.. క్రమంగా మొటిమలు రావడానికి దారితీస్తుందట. ఇక దీనిలో ఉండే కృత్రిమ పరిమళాలు మృదువుగా ఉండే ముఖ చర్మంపై అలర్జీలు రావడానికి కారణమవుతాయి. కాబట్టి ముఖం కోసం ప్రత్యేకంగా తయారుచేసిన బ్యూటీ ఉత్పత్తులు.. ఎంచుకోవడం ఉత్తమం అంటున్నారు నిపుణులు. ముఖానికి ఉపయోగించే స్క్రబ్స్, ఫేస్‌ప్యాక్స్.. వంటి వాటిలో నిమ్మను ఉపయోగించడం సహజమే. కొంతమందైతే నిమ్మచెక్కను నేరుగా ముఖంపై రుద్దుకుంటుంటారు. అయితే ఇందులోని కొన్ని సమ్మేళనాలు కొంతమందిలో ముఖ చర్మాన్ని మరింత సున్నితంగా మార్చుతాయట. తద్వారా ఎండలోకి వెళ్లినప్పుడు చర్మం ఇరిటేషన్‌కి గురై దురద, మంట.. వంటి సమస్యలొస్తాయని చెబుతున్నారు నిపుణులు. మొటిమలున్న చోట టూత్‌పేస్ట్ రాయమని సలహా ఇస్తుంటారు కొందరు. కానీ వద్దంటున్నారు నిపుణులు. ఎందుకంటే కొంతమందిలో ఇది అప్లై చేసిన చోట నల్ల మచ్చలు, రంగు మారడం.. వంటి సమస్యలొచ్చే అవకాశం ఉంటుందట. అలాగే ఇందులోని గాఢమైన పదార్థాల వల్ల కొంతమందిలో ఇన్ఫెక్షన్లు, అలర్జీలు కూడా రావచ్చట! ముఖంపై అవాంఛిత రోమాల్ని తొలగించుకోవడానికి చాలామంది అనుసరించే పద్ధతి వ్యాక్స్ చేసుకోవడం. దీనికోసం వ్యాక్స్ స్ట్రిప్స్ వాడుతుంటారు. అయితే చర్మతత్వాన్ని బట్టి వీటిని ఎంచుకోవాల్సి ఉంటుంది. ఈ విషయాన్ని నిర్లక్ష్యం చేస్తే మాత్రం చర్మం ఎరుపెక్కడం, దద్దుర్లు రావడంతో పాటు చర్మం మరింత సున్నితంగా మారుతుంది. తద్వారా ఎండలోకి వెళ్లినప్పుడు కందిపోవడం, ర్యాషెస్.. వంటి సమస్యలొస్తాయట. కాబట్టి ఫేషియల్ వ్యాక్స్ ఎంచుకునే ముందు చర్మతత్వాన్ని పరిగణనలోకి తీసుకోవడం, ఇంట్లో తయారుచేసుకున్న వ్యాక్స్ అయినా.. బయటి నుంచి తెచ్చిన స్ట్రిప్ అయినా.. అప్లై చేసుకునే ముందు ఓసారి ప్యాచ్ టెస్ట్ చేసుకోవడం మంచిదంటున్నారు నిపుణులు.



## నిద్రను ఆహ్వానిద్దామా!



ఆధునిక జీవనశైలి కానుకగా ఇస్తున్న సవాళ్లలో నిద్రలేమి ఒకటి. ఒకవైపు ఆఫీసు పనులు, మరోవైపు ఇంటి బాధ్యతలు, ఇంకోవైపు రేపటి ప్రణాళికలు.. అన్నీ కలిసి మన మెదడును నిరంతరం పరుగులెత్తిస్తుంటాయి. ఇక, పగలు తీసుకునే కాఫీ, టీల అలవాటు నుంచి నిద్రపోయే ముందు చూసే వెబ్ సిరీస్‌ల ఉత్కంఠ వరకూ అన్నీ నిద్రను దూరం చేసే అలవాట్లే. మరి దీనికి పరిష్కారమేంటీ అంటారా? అది మన చేతుల్లోనే ఉందంటారు నిపుణులు. వాటిల్లో మొదటిది... రాత్రి నిద్రపోవడానికి కనీసం గంట ముందు నుంచే డిజిటల్ ప్రపంచానికి దూరంగా ఉండటం. బదులుగా ఆ సమయాన్ని పుస్తక చదవడానికో, నచ్చిన సంగీతం వినడానికో కేటాయిస్తే చాలు... నిద్ర ముంచుకొస్తుంది. అలానే, పడకగదిలో వెలుతురు తగ్గించుకుని శరీరాన్ని విశ్రాంతి స్థితిలోకి తీసుకెళ్లడమూ ఎంతో అవసరం. రాత్రి పూట మసాలా, నూనె ఆహారాలకి దూరంగా ఉండి, వేడి పాలో, హెర్బల్ టీనో తాగడం వల్ల శరీరానికి ఉపశమనం. అంతేకాదు, రేపటి పనుల గురించి ఆందోళన చెందడం కంటే, వాటిని ఒక డైరీలో రాసిపెడితే మనసు తేలికపడుతుంది. శ్వాసపై దృష్టి సారిస్తూ చేసే చిన్నపాటి ధ్యానంతో కునుకు దరికి చేరేలా చేయొచ్చు. ఎందుకంటే, నిద్రని బలవంతంగా పొందలేం... మనసునూ, శరీరాన్నీ ప్రశాంతపరుచుకుంటే అదే మనల్ని ఆహ్వానిస్తుంది. కాబట్టి, ఈ రాత్రి నుంచే ఈ చిన్న మార్పులను మొదలుపెట్టి, హాయిగా కళ్లు మూసుకోండి. రేపటి కొత్త ఉదయం ఉత్సాహంతో మీకు స్వాగతం పలుకుతుంది.

## జీన్స్‌తోనే నిద్రపోతున్నారా?



సందర్భం ఏదైనా.. కొంతమంది జీన్స్‌లోనే సౌకర్యంగా ఫీలవుతారు. అయితే ఇంటికొచ్చాక ఈ దుస్తులు మార్చుకొని వదులుగా ఉండే నైట్‌వేర్ ధరించినప్పుడే సౌకర్యంగా అనిపిస్తుంది. కానీ ఒక్కోసారి అనుకోకుండా అదే జీన్స్‌లో నిద్రపోవాల్సి రావచ్చు. అయితే దీనివల్ల అసౌకర్యమే కాదు.. ఆరోగ్యపరంగానూ కొన్ని సమస్యలు తప్పవంటున్నారు నిపుణులు. మరి, అదెలాగో తెలుసుకుందాం రండి.. జీన్స్.. డెనిమ్ ఫ్యాబ్రిక్‌తో తయారవుతుంది. త్వరగా చెమటను పీల్చుకునే స్వభావం ఈ మెటీరియల్‌కు ఉండదు. అందులోనూ స్కిన్ టైట్ జీన్స్ అయితే ఇక చెప్పే పనే లేదు. ఫలితంగా జననేంద్రియాల వద్ద చెమట అలాగే ఉండిపోతుంది. ఈ తేమతోనే గంటల తరబడి ఉండిపోవడం వల్ల.. ఫంగల్ ఇన్ఫెక్షన్లకు దారితీస్తుంది. ఇది క్రమంగా ప్రత్యుత్పత్తి ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుందట. అలాగే బిగుతైన దుస్తుల వల్ల ఆయా శరీర భాగాలకు గాలి తగలక.. అక్కడి చర్మంపై దురద, దద్దుర్లు, ఎరుపెక్కడం.. వంటి సమస్యలొస్తాయి. కాబట్టి సాధ్యమైనంత తక్కువ సమయం జీన్స్ ధరించేలా చూసుకోవడం మంచిదంటున్నారు నిపుణులు. కొంతమందికి కాలంతో సంబంధం లేకుండా ఎక్కువగా చెమట పడుతుంటుంది. ఇలాంటివారు ఈ విషయంలో మరింత అలర్ట్‌గా ఉండడం మంచిదంటున్నారు. సాధారణంగా నిద్రలోకి జారుకున్న కొన్ని గంటలకు శరీర ఉష్ణోగ్రత క్రమంగా తగ్గుతూ వస్తుంది. అయితే జీన్స్ ధరించి నిద్రపోయినప్పుడు గాలి శరీరానికి తగలక.. శరీర ఉష్ణోగ్రత మరింత పెరుగుతుంది. తద్వారా నిద్రకు అంతరాయం ఏర్పడుతుందని ఓ అధ్యయనంలో తేలింది. అంతేకాదు.. జీన్స్ వంటి బిగుతైన దుస్తులు ధరించి పడుకోవడం వల్ల అసౌకర్యంగానూ అనిపిస్తుంటుంది. ఇది కూడా సుఖనిద్రను దూరం చేస్తుందని చెబుతున్నారు నిపుణులు. జీన్స్ వంటి బిగుతైన దుస్తులు ధరించి నిద్ర పోవడం వల్ల గర్భాశయం, పొత్తి కడుపు, జననేంద్రియాలపై ఒత్తిడి పడుతుంది. నెలసరి సమయంలోనూ అసౌకర్యంగా ఉంటుందంటున్నారు నిపుణులు. కాబట్టి పడుకునేటప్పుడైనా, ఇతర సమయాల్లో అయినా సాధ్యమైనంత వరకు వదులుగా ఉండే కాటన్ దుస్తులకు ప్రాధాన్యమివ్వడం మంచిదని సూచిస్తున్నారు నిపుణులు.

## డబుల్ చిన్ తగ్గాలంటే...

ఎంతందంగా తయారైనా, అద్దంలో చూసుకోగానే కనిపించే డబుల్ చిన్... మనసు కలుక్కుమనేలా చేస్తుంది. చాలామందిలో ఆత్మవిశ్వాసాన్నీ తగ్గిస్తుంది. అధిక బరువు, వయసు పెరగడం, జన్యుపరమైన కారణాలు, మెడ కండరాల బలహీనత వల్లా ఇలా జరగొచ్చు. ఏదేమైనా తగ్గించుకోవడానికి మన వంతు ప్రయత్నించాలి కదా! అందుకోసమే ఈ చిట్కాలు. చిన్ లిఫ్ట్స్: నిటారుగా నిలబడి, తలను



వెనక్కి వంచి పైకప్పు వైపు చూడండి. ఇప్పుడు పెదాలను ముందుకు చాచి, సీలింగ్‌ను ముద్దాడినట్లు చేయండి. ఈ స్థితిలో 5 సెకన్ల పాటు ఉండి, తిరిగి సాధారణ స్థితికి రండి. ఇలా రోజుకు 15 సార్లు చేయడం వల్ల గడ్డం కింద కండరాలు బిగుతుగా మారతాయి. జా క్లెంచెస్: పెదాలను మూసి, దవడ కండరాలను గట్టిగా బిగించి 5-10 సెకన్ల పాటు ఉంచండి. ఆ తర్వాత మెల్లగా రిలాక్స్ అవ్వండి. ఇలా పదిసార్లు చేయడం వల్ల దవడ కండరాలు దృఢంగా మారి, క్రమంగా డబుల్ చిన్ తగ్గుతుంది. టంగ్ స్ట్రెచ్: తల నిటారుగా ఉంచి, నాలుకను సాధ్యమైనంత వరకు బయటకు చాచండి. అదే సమయంలో పైకి చూస్తూ నాలుక కొనతో ముక్కును తాకడానికి ప్రయత్నిస్తున్నట్లుగా 5-10 సెకన్లు ఉంచండి. ఇది మెడ కండరాలను సాగదీసి కొవ్వు తగ్గడానికి తోడ్పడుతుంది.

## రోజూ చూయింగ్ గమ్‌లను అదే పనిగా నములుతున్నారా.. అయితే జాగ్రత్త..



ముఖం సన్నగా కనిపించాలన్నా, దవడ ఆకృతి (జాలైన్) స్పష్టంగా రావాలన్నా చూయింగ్ గమ్‌ను ఎక్కువసేపు నమలడం ఉపయోగపడుతుందనే అభిప్రాయం యువతలో బలంగా ఉంది. దీంతో చాలామంది రోజూ గంటల తరబడి చూయింగ్ గమ్ నమలడం అలవాటుగా మార్చుకుంటున్నారు. అయితే ఇది ముఖాన్ని సన్నగా చేయకపోగా, దవడ కీళ్లపై అనవసర ఒత్తిడి పెంచి పలు ఆరోగ్య సమస్యలకు దారితీసే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దవడను పుర్రెతో కలిపే కీళ్లను టెంపరో మ్యాండిబ్యులర్ జాయింట్ (TM Joint) అంటారు. చెవులకు ముందు భాగంలో ఉండే ఈ కీళ్లు నమలడం, మాట్లాడడం, నోరు తెరవడం-మూయడం వంటి ప్రతి కదలికలోనూ కీలక పాత్ర పోషిస్తాయి. అప్పుడప్పుడు చూయింగ్ గమ్ నమలడం వల్ల సాధారణంగా ఎలాంటి ఇబ్బంది ఉండదు. కానీ గంటల తరబడి నిరంతరం నమలడం వల్ల ఈ కీళ్లపై పదేపదే ఒత్తిడి పడుతుంది. చూయింగ్ గమ్‌ను ఎక్కువసేపు నమలడం వల్ల దవడ కండరాలు అధికంగా పనిచేయాల్సి వస్తుంది. దీంతో క్రమంగా దవడ కీళ్లలో ఒత్తిడి పెరిగి కండరాలు అలసిపోవడం, కీళ్ల పనితీరు దెబ్బతినే అవకాశం ఉంటుంది. ఈ పరిస్థితిని నిర్లక్ష్యం చేస్తే దీర్ఘకాలిక దవడ సమస్యలు తలెత్తుతాయి. దవడ కీళ్లపై అధిక ఒత్తిడి పడటం వల్ల కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. నోరు తెరిచినప్పుడు లేదా మూసినప్పుడు దవడ వద్ద క్లిక్ అనే శబ్దం వినిపించడం, దవడ బిగుసుకుపోవడం, చెవుల పక్కన లేదా కణతల వద్ద తలనొప్పి రావడం, ఆహారం నమిలేటప్పుడు నొప్పి అనిపించడం వంటి సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. చూయింగ్ గమ్ ను నమలడం వల్ల ముఖంలోని కొవ్వు కరిగి ముఖం సన్నగా మారుతుందనే అభిప్రాయానికి శాస్త్రీయ ఆధారాలు లేవు. ఇది దవడ కండరాలను కొంతవరకు బలపరుస్తుంది. కానీ శరీరంలోని ఒకే భాగంలో కొవ్వును కరిగించడం సాధ్యం కాదు. కొవ్వు తగ్గడం మొత్తం శరీర బరువు తగ్గుదలతో సంబంధం ఉన్న ప్రక్రియ. కాబట్టి చూయింగ్ గమ్‌ను ముఖానికి వ్యాయామంగా భావించడం సరైనది కాదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. దవడ కీళ్లు కూడా శరీరంలోని ఇతర కీళ్ల మాదిరిగానే పరిమితంగా ఉపయోగించినప్పుడే ఆరోగ్యంగా ఉంటాయి. అవసరానికి మించి నిరంతరం ఒత్తిడి పెడితే సమస్యలు వచ్చే ప్రమాదం ఉంటుంది. అందువల్ల అప్పుడప్పుడు చూయింగ్ గమ్ నమలడం సాధారణంగా హానికరం కాకపోయినా, అలవాటుగా గంటల తరబడి నమలడం మాత్రం మంచిది కాదని నిపుణులు సూచిస్తున్నారు.

## మెడ చుట్టూ నల్లగా..

గర్భం దాల్చినపుడు శరీరంలో జరిగే మార్పుల వల్ల కొంతమందిలో సౌందర్యపరంగా సమస్యలు తలెత్తవచ్చు. ముఖ్యంగా మెడ చుట్టూ నల్లగా తయారవడం అనేది గర్భిణులందరికీ ఎదురయ్యే సాధారణ సమస్య. అలా ఏర్పడిన నలుపుదనాన్ని ఎలా తగ్గించుకోవాలో తెలీక చాలామంది సతమతమవుతూ ఉంటారు. అయితే ఇంట్లోనే మనకు అందుబాటులో ఉన్న పదార్థాలతోనే ఈ సమస్యకు చెక్ పెట్టచ్చంటున్నారు నిపుణులు. అదెలాగో తెలుసుకుందాం రండి.. చిన్న కీరాదోసను తీసుకొని జాగ్రత్తగా తురుముకోవాలి. ఈ తురుముతో నల్లగా మారిన మెడపై పదిహేను నిమిషాల పాటు మర్దన చేసుకోవాలి. తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. కీరాదోస క్లెన్సర్‌లా పనిచేసి మెడ చర్మంపై పేరుకున్న మురికిని తొలగిస్తుందట. కీరాదోస తురుముతో రోజూ మెడ చర్మాన్ని మర్దన చేసుకుంటూ ఉంటే కొద్ది రోజుల్లోనే చక్కటి ఫలితం కనిపిస్తుందంటున్నారు నిపుణులు. టమాటో, నిమ్మరసం, తేనెతో తయారు చేసిన మిశ్రమం మెడపై ఏర్పడిన నలుపును తొలగిస్తుందట. కొద్దిగా టమాటో రసం తీసుకొని దానిలో కొన్ని చుక్కల నిమ్మరసం, కాస్త తేనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని మెడకు అప్లై చేయాలి. ఇరవై నిమిషాలు ఆరిన తర్వాత చల్లటి నీటితో శుభ్రం చేసుకుంటే చక్కటి ఫలితం ఉంటుందంటున్నారు నిపుణులు. బంగాళాదుంపను తొక్క తీసి మెత్తగా చేసుకోవాలి. దీనికి కాస్త నిమ్మరసం కూడా జత చేయాలి. ఈ మిశ్రమాన్ని మెడపై



అప్లై చేసుకొని పదిహేను నిమిషాల తర్వాత చల్లని నీటితో కడిగేసుకోవాలి. బంగాళాదుంప మంచి క్లెన్సర్‌గా పనిచేస్తుంది. ఇది నల్లగా మారిన చర్మాన్ని తిరిగి ప్రకాశవంతంగా అయ్యేలా చేస్తుంది. నిమ్మ బ్లీచింగ్ ఏజెంట్‌గా పనిచేస్తుందని చెబుతున్నారు నిపుణులు.

అయితే పైన పేర్కొన్నవన్నీ సహజసిద్ధ పదార్థాలే అయినప్పటికీ.. చర్మతత్వానికి సరిపడతాయో లేదో తెలుసుకోవడానికి ఓసారి ప్యాచ్ టెస్ట్ చేసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

## ఇవి కూడా.. ప్రొటీన్ కోసం!

ఉదయం అల్పాహారంలో భాగంగా కోడిగుడ్లు తీసుకోవడం కొంతమందికి అలవాటు. రోజంతా శక్తి స్థాయులు స్థిరంగా ఉండాలన్నా, ఎక్కువసేపు ఆకలేయకుండా బరువును అదుపులో ఉంచుకోవాలన్నా ఇందులోని ప్రొటీన్ సహాయపడుతుంది. అయితే రోజూ గుడ్లు తినీ తినీ బోర్ కొడుతుందనే వారూ లేకపోలేదు. అలాంటి వారు అయిష్టంగానో, బలవంతంగానో వీటిని తీసుకోవడం కంటే ప్రొటీన్లు అధికంగా లభించే ఇతర పదార్థాల్ని బ్రేక్‌ఫాస్ట్‌లో చేర్చుకోవడం మంచిదంటున్నారు నిపుణులు. ఇంతకీ అవేంటో తెలుసుకుందాం రండి..

యోగర్ట్‌లో ప్రొటీన్ శాతం అధికంగా ఉంటుంది. కాబట్టి ఉదయాన్నే అల్పాహారంగా ఓ కప్పు యోగర్ట్ తీసుకోవచ్చు. ఇలా ప్లెయిన్‌గా తినడానికి ఇష్టపడని వారు ఇందులో పండ్ల ముక్కలు, బాదంపప్పులు, వాల్‌నట్స్, గింజలు.. వంటివి కలుపుకొని తినచ్చు. ఫైబర్ అధికంగా ఉండే ఈ నట్స్‌ని ప్రొటీన్‌తో కలిపి తీసుకోవడం వల్ల రోజంతా ఉత్సాహంగా ఉండచ్చంటున్నారు నిపుణులు.

ప్రొటీన్లు ఎక్కువగా లభించే పదార్థాల్లో పనీర్ ఒకటి. దీంతో బుర్జీ తయారుచేసుకొని తీసుకున్నా సమాన ఫలితం ఉంటుందంటున్నారు నిపుణులు. ఉల్లిపాయ, క్యాప్సికం, పచ్చిమిర్చి, టొమాటో ముక్కల్ని నూనెలో వేయించి.. మెదిపిన పనీర్‌ని ఇందులో వేసి తయారుచేసేదే పనీర్ బుర్జీ. దీన్ని గోధుమ లేదా మల్టీ గ్రెయిన్ బ్రెడ్‌పై వేసుకొని తినచ్చు. లేదంటే కుల్చా, పరాటా, చపాతీకి కాంబినేషన్ కర్రీగా కూడా తీసుకోవచ్చట. రాత్రి పూట పెరుగు లేదా పాలల్లో కొన్ని ఓట్స్ కలపాలి. ఉదయాన్నే దీంట్లో కొన్ని నట్స్, పండ్ల ముక్కలు చల్లుకొని తింటే రుచికి రుచి.. ప్రొటీన్లూ శరీరానికి అందుతాయంటున్నారు నిపుణులు. పాలు, పెరుగు, ఓట్స్.. ఈ మూడింట్లోనూ ప్రొటీన్లు ఎక్కువగా లభిస్తాయని చెబుతున్నారు. మొలకెత్తిన గింజలతో తయారుచేసిన సలాడ్‌నీ ఉదయం అల్పాహారంగా తీసుకోవచ్చంటున్నారు నిపుణులు. పెసలు, శెనగలు, బఠానీ, బొబ్బర్లు, రాజ్మా.. వంటి ధాన్యాల్లో ప్రొటీన్లు ఎక్కువగా లభిస్తాయి. ఇవి మొలకలొచ్చాక.. వీటిలో టొమాటో, ఉల్లిపాయ ముక్కలు కలుపుకొని.. కొత్తిమీర-పుదీనా తురుముతో గార్నిష్ చేసుకొని.. కొద్దిగా నిమ్మరసం పిండి తీసుకుంటే రుచిగా ఉంటుంది. ప్రొటీన్లూ శరీరానికి అందుతాయి. పెసరపప్పును నానబెట్టి మెత్తగా రుబ్బుకొని.. కాస్త మందపాటి దోశలా వేసుకొని తయారుచేసుకొనే చిల్లా వంటకం



గురించి చాలామందికి తెలుసు. అయితే దీన్ని ప్లెయిన్‌గా తీసుకుంటే తినడం కష్టం.. కాబట్టి దోశ వేసుకొనేటప్పుడే కాస్త ఉప్పు, కారం చల్లి.. కాయగూర ముక్కలు, ఉల్లిపాయ ముక్కలు వేసి కాల్చుకుంటే ఎంతో రుచిగా ఉంటాయి. ఈ పప్పులోనూ ప్రొటీన్ అధికంగా ఉంటుంది. వేడివేడి ఈ దోశల్ని క్రీమీగా చిలికిన పెరుగు లేదంటే చట్నీతో తీసుకుంటే రుచిగా ఉంటాయి. ఇక్కడ పెసరపప్పు బదులుగా శెనగపప్పు కూడా ఉపయోగించచ్చు.

బ్రెడ్-పనీర్ బటర్.. చాలామంది దీన్ని అల్పాహారంగా తీసుకోవడం చూస్తుంటాం. ఈ బటర్‌లో ప్రొటీన్ అధికంగా లభిస్తుంది. అయితే ఇక్కడ వైట్ బ్రెడ్‌కు బదులుగా గోధుమ, మల్టీగ్రెయిన్ బ్రెడ్ తీసుకోవడం మేలంటున్నారు నిపుణులు. కావాలంటే బ్రెడ్‌పై బటర్ అప్లై చేసుకున్నాక.. పండ్ల ముక్కలు, నట్స్, తేనె.. వంటివి వేసుకొని తీసుకుంటే రుచికి రుచి.. ఆరోగ్యానికి ఆరోగ్యం..!

సత్తూ డ్రింక్ కూడా చాలామందికి తెలిసిన పానీయమే! పుట్నాల పొడిని నీటిలో కలుపుకొని.. తగినంత ఉప్పు, చిటికెడు మిరియాల పొడి వేసి, నిమ్మరసం పిండుకొని.. దీన్ని తయారుచేసుకోవాలి. ఒకవేళ తియ్యగా కావాలనుకునే వారు బెల్లం పొడి కలుపుకోవచ్చు. పుట్నాలలో ప్రొటీన్ ఎక్కువగా ఉంటుంది.. తద్వారా రోజంతటికీ కావాల్సిన శక్తిని పొందచ్చంటున్నారు నిపుణులు.




### టాటా సన్స్ లిస్టింగ్ తప్పదేమో!

నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ (ఎన్‌బీఎఫ్‌సీ) లైసెన్సును వదులుకోవడానికి టాటా సన్స్ సమర్పించిన దరఖాస్తును రిజర్వ్ బ్యాంక్ తిరస్కరించిందని, దీంతో ఆ సంస్థ లిస్టింగ్ కావడం తప్పనిసరి అవుతుందని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. అవసరమైన అర్హతా ప్రమాణాలను అందుకోవడంలో గ్రూపు విఫలమైందని, అందువల్ల డీరిజిస్ట్రేషన్ కోసం 2024 మార్చిలో దాఖలు చేసిన దరఖాస్తును తిరస్కరించినట్లు కంపెనీ కార్యదర్శి, ముఖ్య ఆర్థిక అధికారికి పంపిన లేఖలో ఆర్‌బీఐ పేర్కొంది. ఎన్‌బీఎఫ్‌సీలకు సంబంధించి అప్పర్‌లేయర్ విభాగంలో టాటా సన్స్ ఉంది. ఈ విభాగంలోని ఎన్‌బీఎఫ్‌సీలు తప్పనిసరిగా స్టాక్ ఎక్స్ఛేంజీలో నమోదుకావాల్సి ఉంటుంది. తాజా పరిణామంతో టాటా సన్స్‌కు లిస్టింగ్ తప్పనిసరి కానుంది.ఈ పరిణామాలపై స్పష్టత కోసం ఆర్‌బీఐని సంప్రదించగా ఎటువంటి స్పందన రాలేదు.

# ఏఐ స్పీడుకు కళ్లెం వేయాల్సిన టైమొచ్చింది: టెక్ దిగ్గజాలు

కృత్రిమ మేధ శరవేగంగా అభివృద్ధి చెందుతోన్న తీరు ఆందోళన కలిగిస్తోంది. రానున్న పదేళ్లలో 10 శాతానికి పైగా మనుషులు ఏఐ కారణంగా ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందని ఆంథ్రోపిక్‌కు చెందిన పరిశోధకుడు ఇవాన్ హుబింగర్ ఇటీవల పేర్కొన్న విషయం తెలిసిందే. తాజాగా ఆంథ్రోపిక్ సీఈఓ డారియో అమోడెయ్ సైతం కృత్రిమ మేధతో ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించారు. ఈ సాంకేతిక వేగానికి ఇకనైనా కళ్లెం వేయాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఏఐ సామర్థ్యాల పెంపును తగ్గించాలని కంపెనీలను కోరారు. ఓపెన్‌ఏఐ సీఈవో సామ్ ఆల్ట్‌మన్, ఎక్స్‌ఏఐ అధిపతి ఎలాన్‌మస్క్ సైతం డారియో అభిప్రాయానికి మద్దతు పలికారు.

స్వయంగా తమ సామర్థ్యాలను మెరుగుపరుచుకునే సూపర్‌ఇంటెలిజెన్స్ వ్యవస్థలను రూపొందిస్తుండడంతో.. తమను తాము మెరుగుపరుచుకునే సామర్థ్యం AI వ్యవస్థల్లో పెరుగుతోందని డారియో ఆందోళన వ్యక్తం చేశారు. అదే సమయంలో కృత్రిమ మేధకు చెందిన ఏజెంట్లు బాహ్య వ్యవస్థలను యాక్సెస్ చేయడానికి ప్రయత్నిస్తున్న విషయాలను గుర్తు చేశారు. ఏఐని ఇలాగే వదిలేస్తే అది త్వరలోనే స్వయంప్రతిపత్తి గల వ్యవస్థలను సృష్టిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. మరో 6-12 నెలల్లో ఆ సమూహం మొత్తం ఇంటర్నెట్‌ను స్వాధీనం చేసుకునే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అదే జరిగితే కొన్ని వందల బిలియన్ డాలర్ల నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు. అయితే, తాను సాంకేతిక పురోగతిని పూర్తిగా నిలిపివేయాలని చెప్పట్లేదన్నారు. దానికి బదులుగా, కంపెనీలు తమ మోడళ్ల భద్రతను మెరుగుపరచడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. భద్రతా చర్యలను బలోపేతం చేయడానికి ఏఐ కంపెనీలకు మరింత సమయం అవసరమని డారియో



పేర్కొన్నారు. కృత్రిమ మేధ (AI) వేగానికి బ్రేకులు వేయడానికి మూడు-దశల ప్రణాళికను వివరించారు. ఇరాన్‌కు మద్దతిస్తోన్న యెమెన్‌లోని హూతీలు క్షిపణులను అభివృద్ధి చేయడానికి తమ ఏఐ చాట్‌బాట్ క్లాడ్‌ను ఉపయోగిస్తున్నట్లు ఆంథ్రోపిక్ ఇటీవల తమ నివేదికలో పేర్కొంది. ఈ నేపథ్యంలో డారియో తాజా హెచ్చరికలు చేయడం గమనార్హం.

ఏఐ వినియోగంలో భద్రతను ధ్రువీకరించడానికి.. కంపెనీలలో నిరంతరం పర్యవేక్షించే స్వతంత్ర భద్రతా నిపుణుల నియామకం.

భద్రతా ప్రమాణాలను నెలకొల్పడానికి, అనియంత్రిత అభివృద్ధిని నిరోధించడానికి అగ్రగామి ఏఐ సంస్థల మధ్య సమన్వయం.

శక్తిమంతమవుతున్న ఏఐ వ్యవస్థల వల్ల కలిగే ప్రమాదాలను గుర్తించి, ఎదుర్కోవడానికి ప్రపంచ దేశాల మధ్య సహకారం.

# జిందాల్ స్టీల్ గిన్నిస్ రికార్డ్




జిందాల్ స్టీల్ లిమిటెడ్ కంపెనీ గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించింది. ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌గఢ్ వద్ద ప్రపంచంలోనే పొడవైన స్టీల్ స్లాగ్ రహదారిని నిర్మించి ఈ రికార్డును దక్కించుకొంది. ఈ మేరకు కంపెనీ ఓ ప్రకటనలో పేర్కొంది. స్టీల్ తయారీ ప్రక్రియలో వెలువడే చెత్తను స్టీల్ స్లాగ్‌గా పిలుస్తారు. సెంట్రల్ రోడ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌తో జిందాల్ స్టీల్ కంపెనీ జట్టుకట్టి.. దాదాపు 2 లక్షల టన్నుల ప్రాసెస్ చేసిన స్టీల్ స్లాగ్‌తో 1.85 కిలోమీటర్ల పొడవైన రోడ్డును నిర్మించింది. సాధారణ రోడ్లతో పోలిస్తే.. స్టీల్ స్లాగ్ రహదారులు ఎక్కువ కాలం మన్నుతాయని శాస్త్రీయంగా తేలింది. 30-40 శాతం వరకు ఖర్చు తగ్గుతుంది. నిర్వహణ వ్యయాలు కూడా తక్కువే. శాస్త్ర, సాంకేతిక, పారిశ్రామిక రంగాల కలయికతో దేశ నిర్మాణానికి అవసరమైన విలువైన వనరులను తయారు చేయొచ్చని ఇండియన్ స్టీల్ అసోసియేషన్ ప్రెసిడెంట్, జిందాల్ స్టీల్ లిమిటెడ్ ఛైర్మన్ నవీన్ జిందాల్ తెలిపారు. ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వడానికి వ్యర్థాల నుంచి సంపద సృష్టించొచ్చని అన్నారు. స్టీల్ స్లాగ్‌ను రోడ్డు నిర్మాణంలో విలువైన వనరుగా అభివర్ణించారు.

# మనీ మ్యూల్ ఖాతాలకు కొత్త నిబంధనలు




సైబర్ ఆధారిత ఆర్థిక నేరాలు, అక్రమ లావాదేవీలకు ఉపయోగించే మనీ మ్యూల్ ఖాతాల నియంత్రణకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కొత్త నిబంధనలను సిద్ధం చేసింది. సైబర్ నేరాల ద్వారా వచ్చిన సొమ్మును బదిలీ చేసేందుకు వాడే అనుమానాస్పద ఖాతాలపై బ్యాంకులు విధించే తాత్కాలిక డెబిట్ హోల్డ్‌కు గరిష్ఠంగా 60 రోజుల గడువును ప్రతిపాదించింది. బ్యాంకులు, ప్రజల నుంచి అక్టోబరు 2 వరకూ సూచనలు, అభిప్రాయాలను ఆహ్వానించింది. వీటన్నింటి పరిశీలన అనంతరం తుది మార్గదర్శకాలను 2027 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి తెస్తారు. కావాలనుకుంటే బ్యాంకులు ముందుగానే అమలు చేయవచ్చు. కృత్రిమ మేధ (ఏఐ) ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ (ఎమ్ఎల్) సాంకేతికతల ద్వారా అనుమానాస్పద నగదు బదిలీలను బ్యాంకులు గుర్తిస్తాయి. రూ.1,000 లేదా అంతకంటే ఎక్కువ మొత్తంతో ఉన్న సందేహాస్పద బదిలీలను గుర్తించిన వెంటనే బ్యాంకులు తాత్కాలికంగా డెబిట్ హోల్డ్ విధించవచ్చు. ఖాతాదారు సాధారణ లావాదేవీలకు భిన్నంగా ఉండటం, ఖాతాలో పెద్ద మొత్తంలో నిధులు జమ కావడం, ఇప్పటికే సైబర్ నేరాల జాబితాలో ఉన్న ఖాతాలతో సంబంధం ఉండటం ఆధారంగా వీటిని గుర్తిస్తారు. అనుమానం ఉన్న మొత్తానికే హోల్డ్‌ను పరిమితం చేయడం సాధ్యమైనప్పుడు, ఖాతాను నిలిపివేయాల్సిన అవసరం ఉండదు. ఖాతా స్థాయిలో హోల్డ్ విధించడం చివరి ప్రత్యామ్నాయంగా, అదీ అసాధారణ పరిస్థితుల్లో మాత్రమే ఉండాలని ముసాయిదా స్పష్టంగా పేర్కొంది.

డెబిట్ హోల్డ్ విధించిన వెంటనే బ్యాంకు ఖాతాదారుడికి కారణాలు, తొలగించుకునే విధానం, సంప్రదించాల్సిన అధికారి వివరాలను తెలియజేయాలి. లావాదేవీ లేదా ఖాతా నిజమైనదేనని వివరించేందుకు ఖాతాదారుడికి 20 రోజుల సమయం ఇవ్వాలి. వివరణ అందిన తర్వాత బ్యాంకు దాన్ని పరిశీలించి, 10 రోజుల్లోగా నిర్ణయం తీసుకోవాలి. వివరణ రాకపోతే హోల్డ్ విధించిన తేదీ నుంచి 30 రోజుల్లోగా బ్యాంకు నిర్ణయం తీసుకోవాలి. ఖాతాదారుడు ఇచ్చిన వివరణ సంతృప్తిగా ఉంటే బ్యాంకు హోల్డ్‌ను వెంటనే తీసేయాలి. వివరణలో అనుమానాలుంటే, నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ ద్వారా పోలీసులకు తెలియజేయాలి. విచారణ అధికారి నుంచి హోల్డ్‌ను కొనసాగించాలని ఆదేశాలు వస్తే, వెంటనే బ్యాంకులు వాటిని అమలు చేయాలి.

# ఆకాశానికి విమాన ఛార్జీలు

72 దేశీయ మార్గాల్లో 2025 మార్చి నుంచి 2026 జూన్ మధ్య సగటు విమాన ఛార్జీలు 20.5 శాతం మేర పెరిగాయి. ఇవి డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ ఇచ్చిన అధికారిక గణాంకాలు. ఈ పెరుగుదల 35 శాతం వరకూ ఉండొచ్చని విశ్లేషకులు చెబుతున్నారు. ఏడాది కిందట సగటు విమాన ఛార్జీలు రూ.5,000-5,500 మేర ఉన్నాయి. ఇప్పుడేమో రూ.7,000-7,500 వరకు చేరాయి. ఇది కేవలం ఒక అంచనా మాత్రమే. విమాన మార్గం, బయలు దేరే సమయాన్ని బట్టి ఇవి ఇంకా ఎక్కువ ఉండొచ్చు. ఇప్పట్లో విమాన ఛార్జీలు తగ్గేలా కనిపించడం లేదు. ఓ పక్క దేశీయ ప్రయాణికుల రద్దీ తగ్గుతున్నా, విమానయాన సంస్థలు మాత్రం ఛార్జీలను తగ్గించక పోగా, పెంచుతున్నాయి. గిరాకీ ఎంత వేగంగా తగ్గుతోందో, అంతకంటే ఎక్కువ వేగంగా సర్వీసులను తగ్గించుకుంటున్నాయి. దీంతో ఛార్జీలను తగ్గించాల్సిన అవసరం లేకుండా చేసుకుంటున్నాయి.

దేశీయ ప్రయాణికుల రద్దీ జనవరి-జులైలో అంతక్రితం ఏడాది ఇదే సమయంతో పోలిస్తే 0.64 శాతం పెరిగింది. అయిదేళ్లలోనే ఇది అతి తక్కువ వృద్ధి. జులైలో రద్దీ 5% మేర తగ్గింది. అయితే విమానయాన సంస్థలు ఇంత కంటే వేగంగా తమ సర్వీసులను తగ్గించాయి. జులైనే తీసుకుంటే స్పైస్‌జెట్ 38% మేర తన సర్వీసుల్లో కోత వేసింది. ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్, ఆకాశ ఎయిర్, ఇండిగో కూడా 3-19% మేర కోత వేశాయి. సర్వీసులు తగ్గితే, సహజంగా తక్కువ సీట్లు అందుబాటులో ఉంటాయి. అప్పుడు గిరాకీ తగ్గినా, ఛార్జీల ధరలు పెరుగుతాయన్న మాట. గత కొద్ది నెలలుగా 15 రోజుల ముందు బుకింగ్ ధోరణి చూస్తే టికెట్ ధరలు కనీసం 35 శాతం అధికంగానే ఉండడం పరిస్థితికి అద్దం పడుతోంది.



రద్దీ తగ్గడం, సర్వీసుల కోత విషయాన్ని పక్కనపెడితే విమానయాన సంస్థలకు పెరిగిన ముడి చమురు ధరల రూపంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విమానయాన సంస్థల ఖర్చుల్లో ఎక్కువ భాగం ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ఏటీఎఫ్)కే వెళ్తోంది. ఇక పాకిస్థాన్ గగనతలంపై ఆంక్షలు, పశ్చిమాసియా సెగలు చల్లారకపోవడం వల్ల ఆ ప్రాంతాలపై వెళ్లలేక, విమానాలు చుట్టూ తిరిగి వెళ్లాల్సి రావడంతో అదనపు ఇంధనం కావాల్సి వస్తోంది. ఇదీ సర్వీసుల్లో కోతకు కారణంగా మారింది. 2024 జులైతో పోలిస్తే ఈ ఏడాది జులైలో ఏకంగా 10,000 వరకు సర్వీసులు తగ్గాయి. 2022 జులైలో కరోనా కారణంగా డిపార్చర్లు 75,875కు పరిమితం కాగా, ఆ తర్వాత పుంజుకున్నాయి. ఇప్పుడు మళ్లీ తగ్గుతున్నాయి. గడ్డు పరిస్థితుల్లో విమానయాన సంస్థలు చేపట్టిన ఈ చర్యల వల్ల ప్రయాణికుల సీట్ల భర్తీ (పీఎల్‌ఎఫ్) బాగుంది. ఈ ఏడాది జులైలో ప్రతీ 100 సీట్లకు 85.3 సీట్లు భర్తీ అయ్యాయి. వర్షాకాలం అయినా ఈ స్థాయిలో భర్తీ కావడానికి సర్వీసులు తగ్గడం కారణం. ఏప్రిల్-జూన్‌లో విమాన టికెట్ల వ్యాపారం వృద్ధి చెందిందని ప్రయాణ బుకింగ్ వ్యాపార సంస్థలు చెబుతున్నాయంటే అందుకు వెనక కారణం అదే. మొత్తం మీద గిరాకీపైనే కాకుండా, విమానయాన సంస్థలు ఎన్ని సీట్లు మార్కెట్లో అందుబాటులోకి తీసుకొస్తున్నాయన్న దానిపై ఛార్జీలు ఆధారపడతాయి. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే ఇప్పట్లో విమానయాన కంపెనీలు ఛార్జీల తగ్గింపు దిశగా ఆలోచించకపోవచ్చు.






### ఫ్రెంచ్ ఓపెన్ టవల్ మాత్రమే మిగిలిందన్న ఉక్రెయిన్ స్టార్!

రష్యా - ఉక్రెయిన్ దేశాల మధ్య ఇంకా యుద్ధ వాతావరణం కొనసాగుతూనే ఉంది. తాజాగా శనివారం రాత్రి కూడా ఉక్రెయిన్‌పై రష్యా క్షిపణులతో దాడులు చేసింది. ఈ ఘటనలో ఉక్రెయిన్ టెన్నిస్ ప్లేయర్ దయానా యస్త్రెమ్స్కాకు చెందిన అపార్ట్‌మెంట్ ధ్వంసమైంది. అయితే, ఇందులో తన కుటుంబ సభ్యుల ప్రాణాలకు ఎలాంటి ముప్పు వాటిల్లలేదని సోషల్ మీడియా వేదికగా తెలిపింది. అందులో తన అపార్ట్‌మెంట్ కాలిపోతున్న వీడియో, ఫొటోలను పోస్టు చేసింది. కేవలం ఫ్రెంచ్ ఓపెన్ సమయంలో తాను వినియోగించిన టవల్ మాత్రమే మిగిలి ఉందని పేర్కొంది. ''ఈ రాత్రి 'రష్యన్ ప్రపంచం' అంటే ఇదేనని అర్థమైంది. క్షిపణితో నేరుగా దాడి చేసింది. మా అపార్ట్‌మెంట్‌ను ధ్వంసం చేసింది. నాకు మిగిలింది ఒక రోలాండ్ గారోస్ టవల్ మాత్రమే. రష్యా మిస్సైల్ దెబ్బకు నా ఇల్లు తట్టుకోలేకపోయింది. కానీ, వరల్డ్ టెన్నిస్ భాగం మాత్రం మిగిలింది. ఈ చిత్రాలను మా కళ్లతో చూడండి. ఉక్రెయిన్ కోణం నుంచి చూస్తే, మీ 'తటస్థత'కు అసలైన అర్థం ఇదే'' అని పోస్టు చేసింది.

# జూనియర్ హాకీ ఆసియా కప్.. భారత్‌కు డబుల్ ధమాకా



ఆసియా కప్ జూనియర్ హాకీ టోర్నమెంట్‌లో భారత మహిళల జట్టు, పురుషుల జట్టు స్వర్ణాలు సాధించాయి. చైనాతో జరిగిన ఫైనల్‌లో భారత మహిళా జట్టు 1-0 తేడాతో గెలుపొందింది. మ్యాచ్‌లో నమోదైన ఏకైక గోల్‌ను భారత క్రీడాకారిణి సానిక చంద్రకాంత్ మనే 17వ నిమిషంలో సాధించింది. భారత మహిళల జట్టు ఈ కప్‌ను గెలుచుకోవడం ఇది వరుసగా మూడోసారి కావడం విశేషం. 2023 ఎడిషన్‌లో దక్షిణ కొరియాను ఓడించి తొలి టైటిల్ సాధించిన భారత్.. 2024 ఎడిషన్‌లో చైనాను మట్టికరిపించి రెండోసారి విజేతగా నిలిచింది. తాజాగా ఆసియా కప్ ఛాంపియన్‌గా అవతరించిన భారత జట్టు జూనియర్ ప్రపంచ కప్‌లో స్థానాన్ని ఖరారు చేసుకుంది. హ్యాట్రిక్ కొట్టిన భారత అమ్మాయిల బృందానికి హాకీ ఇండియా నగదు ప్రోత్సాహం ప్రకటించింది. జట్టులోని ప్రతి క్రీడాకారిణికి రూ.3 లక్షలు, సహాయక సిబ్బందిలో ప్రతి ఒక్కరికీ రూ.1.5 లక్షల నగదు బహుమతి ఇస్తామని తెలిపింది. ఈ టోర్నమెంట్‌లో పురుషుల విభాగంలో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన భారత్ టైటిల్‌ను నిలబెట్టుకుంది. ఆదివారం జరిగిన ఫైనల్‌లో భారత్ 4-1 తేడాతో కొరియాను ఓడించింది. భారత్ తరఫున అజిత్ యాదవ్ (9వ నిమిషం), అన్మోల్ (13వ), ప్రభ్‌దీప్‌సింగ్ (21వ), అషు మౌర్య (50వ) గోల్స్ చేశారు. కొరియా ఓటమి ఖాయమైన తర్వాత 54వ నిమిషంలో ఆ జట్టు ప్లేయర్ లీ మిన్-హ్యోక్ గోల్ చేశాడు. ఈ టోర్నీలో భారత్‌కు ఇది వరుసగా నాలుగో టైటిల్ కావడం విశేషం. గత మూడు ఎడిషన్లలో (2015, 2023, 2024) పాకిస్థాన్ ప్రత్యర్థి కాగా.. మూడుసార్లు చిరకాల ప్రత్యర్థిని భారత్ చిత్తుగా ఓడించి ఛాంపియన్‌గా నిలిచింది. అబ్బాయిల బృందానికి కూడా హాకీ ఇండియా జట్టులోని ప్రతి క్రీడాకారిణికి రూ.3 లక్షలు, సహాయక సిబ్బందిలో ప్రతి ఒక్కరికీ రూ.1.5 లక్షల నగదు బహుమతి ప్రకటించింది.



# క్షమించేస్తా.. ప్రతీకారం తీర్చుకొనే వ్యక్తిని కాదు: స్మృతి మంధాన



ప్రస్తుత భారత మహిళా క్రికెట్‌లో స్మృతి మంధాన సూపర్ స్టార్. ఇటీవలే టీ20ల్లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గానూ ఘనత సాధించింది. ప్రస్తుతం ఆసియా కప్ ఫైనల్ కోసం సిద్ధమవుతోంది. ఈ క్రమంలో మంధాన ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొంది. సదరు వ్యాఖ్యాత రాజ్ షమాని అడిగిన ప్రశ్నకు మంధాన కాస్త భావోద్వేగానికి గురైంది. తాను కేవలం క్రికెట్ గురించి మాత్రమే మాట్లాడతానని మంధాన వ్యాఖ్యానించిన వీడియో వైరల్‌గా మారింది. కాసేపు ఆలోచించిన మంధాన స్పందిస్తూ.. ''వరల్డ్ కప్ గురించి అనుకుంటా' అని వ్యాఖ్యానించింది. ఆ వెంటనే భావోద్వేగానికి గురైంది. ''నేను కేవలం క్రికెట్ గురించి మాత్రమే మాట్లాడతా'' అని చెప్పిన ఆమె కొవిడ్ సమయం కూడా అత్యంత కఠినమైందిగా పేర్కొంది. గతంలో పలాశ్ ముచ్చల్‌తో పెళ్లి వరకూ వెళ్లిన సంగతి తెలిసిందే. అర్ధంతరంగా రద్దు కావడంతో కొన్నాళ్లు ఆమె మానసికంగానూ ఇబ్బంది పడింది. ఇప్పుడు ఆ ఘటనను గుర్తుకొచ్చి ఉంటుందని పలువురు కామెంట్ చేస్తున్నారు. తన క్యారెక్టర్‌పై మంధాన ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ''ఎవరూ నాకు అంత దగ్గరగా అనిపించరు. కానీ, నాకు చాలా కోపం వస్తుంది. అందుకే నాతో పెట్టుకోవద్దు అనే ధోరణితో ఉండేదాన్ని. నేను మీ దారికి అడ్డురానంత వరకూ.. నా దారికి అడ్డు రావద్దని కోరుకుంటా. నేనేమీ ప్రతీకారం తీర్చుకొనే వ్యక్తిని కాదు. అలాగని వెంటనే మరిచిపోను. ఎవరికీ చెడు మాత్రం చేయను. మనుషులను క్షమిస్తా కానీ... ఆ ఘటనను మరిచిపోను'' అని మంధాన తెలిపింది.

# టెస్టు క్రికెట్‌కు పాక్ అపకారం చేస్తోంది.. దినేశ్ కార్తీక్ కీలక వ్యాఖ్యలు

పాకిస్థాన్ క్రికెట్‌లో ఇటీవల చోటు చేసుకుంటున్న పరిణామాలపై భారత మాజీ ఆటగాడు దినేశ్ కార్తీక్ కీలక వ్యాఖ్యలు చేశాడు. టెస్టుల్లో గొప్ప చరిత్ర కలిగిన పాక్.. ఇప్పుడున్న పరిస్థితుల్లో చాలా టెస్టు దేశాలతో పోటీపడే స్థితిలో లేదని వ్యాఖ్యానించాడు. తాజాగా ఇంగ్లాండ్‌పై మూడు టెస్టుల సిరీస్‌లో పాకిస్థాన్ వైట్‌వాష్‌కు గురైన నేపథ్యంలో దినేశ్ కార్తీక్ ఓ ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశాడు. ''నేను ఇంగ్లాండ్ vs పాకిస్థాన్ టెస్ట్ సిరీస్‌కు వ్యాఖ్యానం చేసినప్పుడు ఈ పాక్ జట్టు చాలా సాధారణంగా అనిపించింది. మొదటి రెండు టెస్టుల్లో వారు రెండు ఇన్నింగ్స్‌లలో కలిపి 90 ఓవర్లు కూడా ఆడలేదు. పిచ్‌లు చాలా కఠినంగా ఉన్నాయి. కానీ, రెండు ఇన్నింగ్స్‌లలో కలిపి 90 ఓవర్లు కూడా ఆడలేనంత క్లిష్టమైన పిచ్‌లు కావవి. పాకిస్థాన్ జట్టు టెస్ట్ క్రికెట్‌కు అపకారం చేస్తోందని నాజర్ హుస్సేన్ (ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్) అన్నాడు. నేను అతనితో పూర్తిగా ఏకీభవిస్తున్నాను. చివరి టెస్టులో రజావుల్లా బాగా రాణించాడు. అతను ఆరంభం నుంచే జట్టులో ఎందుకు లేడు? అసలు ఎంపిక ప్రక్రియలో ఏం జరుగుతోంది? ఎలాంటి ఆటగాళ్లను తీసుకుంటున్నారు? కెప్టెన్సీ మార్పులు, కోచ్‌ల మార్పులు అన్నీ అస్థిరంగా కనిపిస్తున్నాయి. ఆ ప్రభావం వారి ఆట తీరులో స్పష్టంగా కనిపిస్తోంది.



# అఫ్గానిస్థాన్‌తో తొలి టీ20.. టాస్ గెలిచిన భారత్



అఫ్గానిస్థాన్, భారత్ మధ్య ఇవాళ్టి నుంచి మూడు టీ20ల సిరీస్ ప్రారంభం కానుంది. ఈ సిరీస్‌కు అఫ్గాన్ ఆతిథ్య దేశంగా ఉండగా.. మ్యాచ్‌లన్నీ దిల్లీ వేదికగా జరుగుతాయి. మరికాసేపట్లో తొలి టీ20 మ్యాచ్ మొదలుకానుంది. టాస్ గెలిచిన భారత జట్టు బౌలింగ్ ఎంచుకుంది. ఈ మ్యాచ్‌లో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి తుది జట్టులో చోటు దక్కలేదు. భారత్ తుది జట్టు ఇదే: సంజు శాంసన్ (వికెట్‌కీపర్), అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ, నితీశ్ కుమార్ రెడ్డి, శివమ్ దూబే, అక్షర్ పటేల్, అర్ష్‌దీప్ సింగ్, జస్‌ప్రీత్ బుమ్రా, వరుణ్ చక్రవర్తి. అఫ్గానిస్థాన్ ప్లేయింగ్ XI: ఇబ్రహీం జద్రాన్ (కెప్టెన్), రహ్మానుల్లా గుర్బాజ్ (వికెట్‌కీపర్), సెదిఖుల్లా అటల్, దార్విష్ రసూలీ, అజ్మతుల్లా ఒమర్జాయ్, గుల్బాదిన్ నాయబ్, మహ్మద్ నబీ, రషీద్ ఖాన్, ముజీబుర్ రెహమన్, నూర్ అహ్మద్, ఫజల్‌హక్ ఫారూఖీ.

# 'ఇరుముడి' టీమ్‌ను ప్రత్యేకంగా అభినందించిన మెగాస్టార్ చిరంజీవి




**వుదయం సినిమా:** మాస్ మహారాజా రవితేజ 'ఇరుముడి' బ్లాక్‌బస్టర్ విజయాన్ని మెగాస్టార్ చిరంజీవి ప్రత్యేకంగా అభినందించారు. సినిమా థియేట్రికల్ సక్సెస్‌ను పురస్కరించుకుని 'ఇరుముడి' కోర్ టీమ్‌ను తన ఇంటికి ఆహ్వానించిన చిరంజీవి, వారిని వ్యక్తిగతంగా అభినందించారు. రవితేజతో పాటు దర్శకుడు శివ నిర్వాణ, మైత్రి మూవీ మేకర్స్ నిర్మాతలు నవీన్ ఎర్నేని, రవిశంకర్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కూడా ఈ సందర్భంగా వారితో కలిసి ముచ్చటించారు. ఈ సందర్భంగా విడుదలైన ఫొటోల్లో చిరంజీవి, 'ఇరుముడి' టీమ్ మధ్య ఉన్న ఆత్మీయ అనుబంధం కనిపించింది.బాక్సాఫీస్ వద్ద 'ఇరుముడి' అంచనాలను మించి అద్భుతమైన విజయాన్ని అందుకుంటూ, సరికొత్త రికార్డులను నమోదు చేసింది. అత్యధిక వసూళ్లు సాధించిన ప్రాంతీయ చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. నాలుగో వారంలోనూ సినిమా జోరు తగ్గలేదు. నేటి షోలకు కూడా బలమైన బుకింగ్స్ కొనసాగుతున్నాయి.

ఇలాంటి భారీ థియేట్రికల్ సక్సెస్ తర్వాత మెగాస్టార్ చిరంజీవి స్వయంగా ఇంటికి ఆహ్వానించి అభినందించడం 'ఇరుముడి' టీమ్‌కు ప్రత్యేకమైన, ఎప్పటికీ గుర్తుండిపోయే సందర్భంగా నిలిచింది.

## వుదయం సినిమా MOVIE TIME!

# 16న వరల్డ్ వైడ్ థియేట్రికల్ రిలీజ్ కు "రణబాలి"



విజయ్ దేవరకొండ, రశ్మిక మందన్న జంటగా నటిస్తున్న భారీ పాన్ ఇండియా మూవీ "రణబాలి". ఈ చిత్రంలో రశ్మిక రణబాలి జోడీగా జయమ్మ క్యారెక్టర్ లో నటిస్తోంది. తాజాగా ఆమె పాత్రకు సంబంధించిన షూటింగ్ కంప్లీట్ అయ్యింది. షూటింగ్ సెట్ నుంచి చిత్రబృందం ఎమోషనల్ గా ఆమెకు సెండాఫ్ ఇస్తున్న వీడియోను మేకర్స్ రిలీజ్ చేశారు. "రణబాలి" సినిమాకు రాహుల్ సంకృత్యన్ దర్శకత్వం వహిస్తున్నారు. టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై "రణబాలి" సినిమాను ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ హ్యూజ్ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. 19వ సెంచరీ నేపథ్యంతో 1854 నుంచి 1878 మధ్య బ్రిటీష్ పాలనా కాలంలో జరిగిన యదార్థ చారిత్రక సంఘటనల ఆధారంగా "రణబాలి" సినిమా రూపొందుతోంది. పాన్ ఇండియా స్థాయిలో భారీ అంచనాలు ఉన్న ఈ సినిమా అక్టోబర్ 16న విజయ దశమి పర్వదినం సందర్భంగా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. రీసెంట్ గా రిలీజ్ చేసిన ఈ సినిమా టీజర్ హ్యూజ్ రెస్పాన్స్ తెచ్చుకుంటూ యూట్యూబ్ లో నెం.1 ప్లేస్ లో ట్రెండింగ్ అవుతోంది.

# 'పిఠాపురంలో... అలా మొదలైంది' ప్రీ రిలీజ్ ఈవెంట్



**వుదయం సినిమా:** డా. రాజేంద్రప్రసాద్, పృథ్వీరాజ్, కేదార్ శంకర్, మణిచందన, అన్నపూర్ణమ్మ, సన్నీ అఖిల్, విరాట్, సాయి ప్రణీత్, శ్రీలు, ప్రత్యూష, రెహానా ప్రధాన పాత్రల్లో ప్రముఖ దర్శకులు 'ప్రేయసి రావే' ఫేమ్ మహేష్ చంద్ర దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'పిఠాపురం లో... అలా మొదలైంది'. ఈ సినిమాని మహేష్ చంద్ర సినిమా టీమ్, ఎవర్ గ్రీన్ ఎపిక్ సినిమా సంయుక్త నిర్మాణంలో దుండిగళ్ళ బాలకృష్ణ, ఆకుల సురేష్ పటేల్, ఎఫ్.ఎం. మురళి (గోదారి కిట్టయ్య) నిర్మించారు. ప్రముఖ నిర్మాణ సంస్థ ప్రైమ్ షో ఎంటర్టైన్మెంట్ ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 18న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనుంది. ఈ క్రమంలో శనివారం రాత్రి హైదరాబాద్ లో ప్రీ రిలీజ్ ఈవెంట్ జరిగింది . ఈ కార్యక్రమంలో ప్రముఖ నటుడు సుమన్ చిత్ర టీజర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా...సుమన్ మాట్లాడుతూ .. 'చంద్ర మహేష్‌తో నాకు 25 ఏళ్లకు పైగా అనుబంధం ఉంది. ఆయన క్లారిటీతో ఉండే అద్భుతమైన దర్శకుడు. 'పిఠాపురంలో... అలా మొదలైంది' మంచి విజయం సాధించాలి. కొత్త కంటెంట్ తో, ఫ్రెష్ సబ్జెక్ట్‌తో ఆయన తీసిన ఈ చిత్రం అందరినీ ఆకట్టుకుంటుందని భావిస్తున్నాను.' అని అన్నారు.ప్రముఖ నిర్మాత చదలవాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ .. 'చంద్ర మహేష్ యోగ్యుడైన దర్శకుడు. ఆయన మంచి వ్యక్తి. ఈ చిత్రంతో చంద్ర మహేష్‌కి మంచి విజయం దక్కాలి. చంద్ర మహేష్ నిర్మాతల డైరెక్టర్. ఇలాంటి ఉత్తమ దర్శకుడు మరిన్ని సినిమాల్ని తెరకెక్కించాలని కోరుకుంటున్నాను. చైతన్య రెడ్డి గారు ఈ మూవీని రిలీజ్ చేస్తుండటం ఆనందంగా ఉంది. 'పిఠాపురంలో... అలా మొదలైంది' సినిమాతో అందరికీ మంచి పేరు రావాలి. ఈ మూవీ మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.ప్రసన్న కుమార్ మాట్లాడుతూ .. "చంద్ర మహేష్ గారు చాలా మంచి వ్యక్తి. ఆయన ఎంతో కష్టపడి ఈ సినిమాని తెరకెక్కించారు. ఈ మూవీని నిర్మించిన దుండిగళ్ళ బాలకృష్ణ, ఆకుల సురేష్ పటేల్, ఎఫ్.ఎం. మురళి నిర్మాతలకు మంచి లాభాలు దక్కాలి. ఫ్యామిలీ ఎమోషన్స్‌తో తీసిన ఈ చిత్రం మంచి విజయం దక్కాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.

# 18న 'ఉపేంద్ర' రీ రిలీజ్



**వుదయం సినిమా:** రెండు దశాబ్దాల క్రితం కన్నడ స్టార్ హీరో ఉపేంద్ర స్వయంగా దర్శకత్వం వహించి నటించిన చిత్రం ఉపేంద్ర. రీ-రిలీజ్‌ల ట్రెండ్ నడుస్తున్న ఈ సమయంలో, అప్పట్లో సంచలనం సృష్టించిన ఉపేంద్ర మూవీ ఇప్పుడు ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమైంది. కన్నడ స్టార్ ఉపేంద్ర నటించిన 'ఉపేంద్ర' సినిమా 1999లో విడుదలై కల్ట్ ఫాలోయింగ్ సొంతం చేసుకుంది. ఈ సినిమా ఇప్పుడు కొత్త తరానికి కూడా వినోదం పంచేందుకు సిద్ధమైంది. 'ఉపేంద్ర' పుట్టినరోజు సందర్భంగా ఉపేంద్ర సినిమాను సెప్టెంబర్ 18న ఎంజీ మూవీస్ బ్యానర్ పై ఎం అచ్చిబాబు ఈ చిత్రాన్ని గ్రాండ్ గా రీ రిలీజ్ చేస్తున్నారు.ఉపేంద్ర ఈ సినిమాను తీసిన అప్రోచ్‌కు అప్పట్లో అభిమానులు ఫిదా అయ్యారు. ఈ సినిమాలో రవీనా టాండన్, ప్రేమ, దామిని కీలక పాత్రల్లో నటించారు. శిల్పా శ్రీనివాస్ నిర్మాణంలో వచ్చిన ఈ చిత్రానికి సంగీతాన్ని గురుకిరణ్ అందించారు. అప్పట్లో పాటలు ట్రెండ్ సెట్ చేసాయి.సెప్టెంబర్ 18న థియేటర్స్ లో సందడి చెయ్యబోతున్న ఉపేంద్ర చిత్రం ను చూడ్డానికి అభిమానును వెయిట్ చేస్తున్నారు, బుక్ మై షో, డిస్ట్రిక్ట్ యాప్స్ లో బుకింగ్స్ ఓపెన్ అయ్యాయి.


# ముగ్గురు కోతులు 'చిల్లర సాంగ్' విడుదల




**వుదయం సినిమా:** జీఎస్ఆర్ క్రియేషన్స్ సమర్పణలో, స్కై ఫ్లేర్ నెట్‌వర్క్స్ సహ సమర్పణలో శోభారాణి గరిమెల్ల నిర్మాణంలో కార్తీక్ గరిమెల్ల తెరకెక్కిస్తున్న చిత్రం 'ముగ్గురు కోతులు'. ఈ మూవీలో తేజ కొండపల్లి, గణేష్ బొడ్డ, దేవాన్ష్ ముఖ్య పాత్రల్లో నటిస్తుండగా.. వర్షిక పాశం హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ మూవీకి సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్, 'ముగ్గురు కోతులు' టైటిల్ సాంగ్ ఇలా వరుసగా విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ ఆడియెన్స్‌లో మంచి ఆసక్తిని క్రియేట్ చేశాయి. మ్యూజికల్ ప్రమోషన్స్‌లో భాగంగా ఇప్పటి వరకు విడుదల చేసిన పాటలకు మంచి స్పందన లభించింది.తాజాగా ఈ చిత్రంలోని 'చిల్లర సాంగ్'ను యాటిట్యూడ్ స్టార్ చంద్రహాస్ లాంచ్ చేశారు.

# 18న "హనుమాన్ అంశ్"

**వుదయం సినిమా:** బాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించి, రికార్డ్ స్థాయి వసూళ్లు అందుకుంటున్న "హనుమాన్ అంశ్" సినిమాను తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్. ఆయన సమర్పణలో ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంస్థ ఈ చిత్రాన్ని ఈ నెల 18న తెలుగులో థియేట్రికల్ రిలీజ్ చేస్తోంది. ప్రముఖ ఆధ్యాత్మిక గురువు నీమ్ కరోలీ బాబా జీవిత చరిత్ర ఆధారంగా దర్శకుడు డా. విశాల్ చతుర్వేది "హనుమాన్ అంశ్" సినిమాను రూపొందించారు. రాగిని ఎస్, నమ్రత. జి. సింగ్, అనుప్రియ ఎ నగర్, డా.విశాల్ చతుర్వేది నిర్మించారు. "హనుమాన్ అంశ్" సినిమాలో శోభిత్ శ్రీవాత్సవ, చందన్ ఆనంద్, పూర్ణిమ తివారి, విహాన్ షెగ్దే కీలక పాత్రల్లో నటించారు. గత నెల 7వ తేదీన బాలీవుడ్ లో రిలీజైన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద 150 కోట్ల రూపాయలకు పైగా వసూళ్లు సాధించి ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరిచింది. స్టార్ డైరెక్టర్ త్రివిక్రమ్ ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తుండటం మరింతగా అంచనాలు పెంచుతోంది. తెలుగు ఆడియెన్స్ ఈ సినిమాపై ఇప్పటికే ఆసక్తి కనబరుస్తున్నారు.



# "ఇడుపు కాయితం" నుంచి 'శ్రీలత..' సాంగ్ లాంచ్



**వుదయం సినిమా:** ప్రొడ్యూసర్ బన్నీ వాస్, జీనియస్ డైరెక్టర్ సుకుమార్ తమ బన్నీ వాస్ వర్క్స్, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్స్ పై ప్రియదర్శి హీరోగా నిర్మిస్తున్న సినిమా "ఇడుపు కాయితం". ఈ సినిమాలో తెలంగాణ ఫోక్ సాంగ్స్ ద్వారా పేరు తెచ్చుకున్న నటి నాగదుర్గ హీరోయిన్ గా నటిస్తోంది. తెలంగాణ ఫ్యామిలీ బ్యాక్ డ్రాప్ స్టోరీతో ఎంటర్ టైనింగ్ డ్రామాగా "ఇడుపు కాయితం" సినిమాను యువ దర్శకుడు వంశీరెడ్డి దొండపాటి రూపొందిస్తున్నారు. ఈ రోజు ఈ సినిమా నుంచి 'శ్రీలత..' సాంగ్ రిలీజ్ చేశారు.'శ్రీలత..' సాంగ్ లో హీరో ప్రియదర్శి, హీరోయిన్ నాగదుర్గ కెమిస్ట్రీ ఆకట్టుకుంటోంది. ఈ పాటను సురేష్ బొబ్బిలి మంచి మెలొడీ ట్యూన్ తో కంపోజ్ చేశారు. పాట మూడ్ కు తగినట్లు ప్లెజెంట్ లిరిక్స్ అందించారు లిరిక్ రైటర్ అలరాజు. శంకర్ బాబు, మోహన భోగరాజు పాటను రిపీటెడ్ గా వినాలనిపించేలా పాడారు. ఈ పాటను పిక్చరైజ్ చేసిన అందమైన లొకేషన్స్, పిల్లలతో చేయించిన డ్యాన్స్ సీక్వెన్సులు హైలైట్ గా నిలుస్తున్నాయి. 'శ్రీలత..' సాంగ్ అతి తక్కువ టైమ్ లోనే డిజిటల్ వ్యూస్ లో దూసుకెళ్తుందనే అంచనాలు మ్యూజిక్ లవర్స్ లో ఏర్పడుతున్నాయి."ఇడుపు కాయితం" సినిమా ప్రస్తుతం రెగ్యులర్ షూటింగ్ జరుపుకుంటోంది. ఈ సినిమాను డిసెంబర్ ఫస్ట్ వీక్ లో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు తీసుకొచ్చేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.నటీనటులు – ప్రియదర్శి, నాగదుర్గ, శివజ్యోతి (తీన్మార్ సావిత్రి), సుజాత (జోర్దార్), చంద్రవ్వ, మౌనిక రెడ్డి, రచ్చరవి, బిత్తిరి సత్తి, అభయ్ బేతిగంటి, మైమ్ మధు, తదితరులు.

# యూత్ ఫుల్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ టైటిల్ 'శ్రీరస్తు' - త్వరలో రిలీజ్

**వుదయం సినిమా:** ప్రణమ్ దేవరాజ్ హీరోగా, సంజనా ఆనంద్ హీరోయిన్ నటిస్తున్న యూత్ ఫుల్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'శ్రీరస్తు'. హరి క్రియేషన్స్ పతాకంపై తెరకెక్కుతున్న ఈ చిత్రానికి శంకర్ రెడ్డి రచన, దర్శకత్వం వహిస్తున్నారు. పెండ్లి మడుగు హరి కృష్ణ గౌడ్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. దర్శకుడు శంకర్ రెడ్డికి, నిర్మాత హరి కృష్ణ గౌడ్ కి ఇది తొలి చిత్రం కావడం విశేషం. ఈ చిత్రాన్ని ఏకకాలంలో తెలుగు, కన్నడ భాషల్లో తెరకెక్కిస్తున్నారు.కుటుంబ ప్రేక్షకులతో పాటు యువతను ఆకట్టుకునే కామెడీతో ఈ చిత్రం యూత్ ఫుల్ కామెడీ ఎంటర్టైనర్ అంశాలతో 'శ్రీరస్తు' తెరకెక్కుతోంది. హీరో హీరోయిన్ పాత్రల మధ్య ప్రేమకథ సినిమాకు ముఖ్యమైన అంశంగా ఉండనుంది.ఈ చిత్రంలో ప్రజ్వల్ దేవరాజ్ ఒక ముఖ్య పాత్రలో కనిపించబోతున్నారు. సుమన్, దేవి ప్రసాద్, అమని, చైత్ర రాయ్, ప్రసాద్ బెహ్రా, రవి ప్రకాష్, రవి శివ తేజ తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు.శేఖర్ చంద్ర సంగీతం, బాల సరస్వతి సినిమాటోగ్రఫీ, శ్రీ వర్కల ఎడిటింగ్, కృష్ణ మాయ ప్రొడక్షన్ డిజైన్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.'శ్రీరస్తు' టైటిల్, ఫస్ట్ లుక్ తో సినిమాపై ఆసక్తిని పెంచేలా చిత్ర బృందం సిద్ధమవుతోంది. ప్రస్తుతం చిత్రానికి సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు వేగవంతంగా కొనసాగుతున్నాయి. 'శ్రీరస్తు' చిత్రాన్ని ఈ ఏడాది ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది.



Printed, Published & Owned by Sirikonda Maria, Printed at LAKSHYAM TELUGU DAILY, D. No.1227/1, 11 GPR Flats, Pedakakani Village and Mandal, Guntur, Andhra Pradesh - 522509 and Published from : H. No. 25-17-343/18, 60 Feet Road, Srinivasa Thota, Guntur - 522004, Andhra Pradesh. Editor : Sirikonda Augustin, RNI No. APTEL/2014/57702. E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.